RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake Printing of Daily News Papers

హైదరాబాద్ 16 జూలై 2026 గురువారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:41

# తెలంగాణను

## 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే

## అమెజాన్ డేటా సెంటర్ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి



మిగతా 2లో

ఈ శంకుస్థాపన కార్యక్రమం ఫ్యూచర్ సిటీకి వచ్చే పెట్టుబడులు, పరిశ్రమలకు మంచి ప్రోత్సాహకంగా ఉపయోగపడనుంది

ఫ్యూచర్ సిటీలో అత్యంత అధునాతనమైన నగరాన్ని నిర్మించాలని, ఫార్చ్యూన్-500 కంపెనీల పెట్టుబడులను ఆకర్షించడానికి 2025 డిసెంబర్ లో తెలంగాణ రైసింగ్ గ్లోబల్ సమ్మిట్ ను నిర్వహించాం .. 108 దేశాల నుంచి మూడు వేల మంది వివిధ దిగ్గజ కంపెనీల నుంచి కార్పొరేట్ ప్రతినిధులు పాల్గొన్నారు

### కొత్తకోట బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ముఖీ కార్యక్రమం

### ముఖ్య అతిథిగా హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి





హాజరైన మంత్రులు శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు మేఘా రెడ్డి, మధుసూదన్ రెడ్డి, రాజేష్ రెడ్డి, వీర్లపల్లి శంకర్, బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు.

### తెలంగాణలో 'ఎస్ఐఆర్' గడువు పొడిగింపు

తెలంగాణతో పాటు పలు రాష్ట్రాలలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) గడువును కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించింది. ఎన్యుమరేటర్లు వచ్చే నెల 3వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తారని స్పష్టం చేసింది.తెలంగాణ, పంజాబ్ రాష్ట్రాల్లో జూన్ 25న ప్రారంభమైన ఇంటింటి సర్వే గడువును ఆగస్టు 3 వరకు పొడిగించారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను కూడా ఇదే తేదీలోగా పూర్తి చేయనున్నారు. తెలంగాణలో ఆగస్టు 10న, పంజాబ్‌లో ఆగస్టు 13న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణకు తెలంగాణలో సెప్టెంబర్ 9 వరకు, పంజాబ్‌లో సెప్టెంబర్ 12 వరకు అవకాశం కల్పించారు. అనంతరం, అక్టోబర్ 12న రెండు రాష్ట్రాల్లోనూ తుది ఓటర్ల జాబితాను విడుదల చేస్తారు.
ఢిల్లీ, కర్ణాటక రాష్ట్రాల్లో జూన్ 30న ప్రారంభమైన ఇంటింటి సర్వే గడువును ఆగస్టు 8 వరకు పొడిగించారు. ఆగస్టు 17న ముసాయిదా జాబితాను విడుదల చేసి, సెప్టెంబర్ 16 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. అన్ని ప్రక్రియలను పూర్తి చేసి, అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితాను వెల్లడిస్తారు.బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓ) చేపట్టే ఇంటింటి సర్వేలో భాగంగా నకిలీ ఓట్లు తొలగింపు, మరణించిన వారి పేర్ల తొలగింపు, చిరునామా మార్పులు వంటి సవరణలు చేపడతారు.

## దేశంలో విద్యావిధానాన్ని వ్యాపారంగా మార్చింది బీజేపీ సర్కార్



హైద్రాబాఫ్ జులై 15;దేశంలో విద్యా విధానాన్ని కేంద్ర ప్రభుత్వం వ్యాపారంగా మార్చిందని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు.

హైదరాబాద్ బోయినపల్లిలో జరిగిన ఛత్రోంకి గూంజ్ కార్యక్రమానికి పీసీసీ చీఫ్ తో పాటు, కార్యక్రమ కన్వీనర్, ప్రభుత్వ విప్ డాక్టర్ బల్మూర్ వెంకట్, ఎమ్మెల్యే శ్రీ గణేష్, కార్పొరేషన్ చైర్మన్లు, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాల్ చారి, కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు, విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ...ఉద్యోగ, విద్యా పోటీ పరీక్షల పేపర్లను లీక్ చేస్తూ, విద్యార్థులు, యువత జీవితాలతో చెలగాటం అడ్డుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎన్ని ఆరోపణలు వచ్చినా కేంద్ర మంత్రి ధరేంద్ర ప్రధాన్ మాత్రం రాజీనామా చేయడం లేదని, కేంద్రం ఆయనపై చర్యలు ఏమీ తీసుకోవడం లేదన్నారు.

అందుకే ఈ ఉద్యమంతో కేంద్రం పై ఒత్తిడి తేవడానికి ఈ కార్యక్రమం రాహుల్ గాంధీ గారు చేపట్టారని చెప్పారు, ఈ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# చదువే మన ఆత్మగౌరవాన్ని పెంచుతుంది..

# తల్లిదండ్రుల కళ్లల్లో ఆనందం నింపుతుంది

### కొత్తకోట బాలికల ఉన్నత పాఠశాల నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

చదువొక్కటే మన భవిష్యత్తును నిర్ణయిస్తుంది..

మన జీవితాల్లో వెలుగులు నింపుతుంది

చదువే మన ఆత్మగౌరవాన్ని పెంచుతుంది..

తల్లిదండ్రుల కళ్లల్లో ఆనందం నింపుతుంది

గత ప్రభుత్వం విద్యాశాఖపై నిర్లక్ష్యం వహించింది

ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యాశాఖకు సీనియర్ అధికారులను నియమించాం

తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తు తరగతి గదుల్లోనే ఉందని నేను సంపూర్ణంగా నమ్ముతున్నా

అందుకే విద్యాశాఖను నాదగ్గరే పెట్టుకున్నా..

కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో అమరుల ఆశయాలకు, త్యాగాలకు గత ప్రభుత్వం గుర్తింపు ఇవ్వలేదు

తెలంగాణ పునర్నిర్మాణంలో మీరంతా భాగస్వాములు కావాలన్న అమరుల ఆశయాన్ని మా ప్రభుత్వం ముందుకు తీసుకెళుతోంది

మౌలిక వసతులు లేకపోవడం వల్లే ప్రభుత్వపాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గింది

ఇంటి పేర్లు నీళ్లు అని పెట్టుకున్నోల్లు కూడా ఈ పాఠశాల గురించి ఆలోచన చేయలేదు

కానీ మా ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ఈ పాఠశాల భవనాలు నిర్మించి సౌకర్యాలు కల్పించారు

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయకపోతే వందేళ్లయినా సమస్య పరిష్కారమా కాదు

ప్రజా ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి పెట్టాం

మొదట ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీలు పూర్తి చేసి సమస్యను పరిష్కరించాం

విద్య లో దేశంలో తెలంగాణ 18 వ స్థానం పొందింది

విద్యలో తెలంగాణను దేశంలోనే మొదటి రెండు స్థానాల్లో నిలబెట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉంది

విద్యార్థులకు, యువతకు సాంకేతిక నైపుణ్యం అందించే చర్యలు చేపట్టాం

ఐటీఐలను బలోపేతం ఏటీసీలుగా అప్ గ్రేడ్ చేశాం

జర్మనీ, జపాన్ లో బ్లూ కాలర్ జాబ్స్ కు మెరుగైన అవకాశాలు ఉన్నాయి

27, 50,000 మందికి పంద్రాగస్టులోగా యంగ్ ఇండియా కిట్స్ పంపిణీ పూర్తి చేస్తాం

ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటే ఏమవుతారని మిమ్మల్ని అడిగితే మీ రేవంతన్నను చూపించండి

ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే నేను ముఖ్యమంత్రి స్థాయికి చేరా

ప్రభుత్వ పాఠశాలలే తెలంగాణ పునర్నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలి





కలం పట్టి తెలంగాణ భవిష్యత్తును తీర్చి దిద్దాలి

చదువుతోపాటు మైదానాల్లో పోటీ పడండి

మట్టిలో మాణిక్యాలను వెలికితీయండి

క్రీడల్లో రాణించిన మీ భవిష్యత్తును తీర్చి దిద్దే బాధ్యత నాది

రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో విద్యార్థిపై ఏడాదికి లక్షా 8 వేలు ఖర్చు చేస్తుంది..

బాగా చదువుకోండి... జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోండి

# ఈ నెల18 న యువ సంగ్రామ సదస్సు

# తలసాని శ్రీనివాస్ యాదవ్



కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు కావస్తున్నా యువతకు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదని మాజీమంత్రి, అసెంబ్లీలో బిఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ విమర్శించారు. సరూర్ నగర్ స్టేడియంలో ఈ నెల18 వ తేదీన జరగనున్న యువ సంగ్రామ సదస్సు ఏర్పాట్లను డిప్యూటీ ఫ్లోర్ లీడర్ లు తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే లు సుధీర్ రెడ్డి, ముఠా గోపాల్, భండారి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి తలసాని సాయి కిరణ్ యాదవ్, పలువురు సీనియర్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ నీరు, నిధులు, నియామకాలు అనే నినాదంతో కేసీఆర్ ఆధ్వర్యంలో పోరాడి తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తమ ప్రభుత్వం2 లక్షలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేసిందని, మరికొన్ని ఉద్యోగాల భర్తీ వివిధ కారణాలతో పెండింగ్ లో ఉండిపోయాయని చెప్పారు. 2023 ఎన్నికల ప్రచారంలో తాము అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే రెండు లక్షల ఉద్యోగాల నియామకాలు చేపడతామని, ఉద్యోగం వచ్చే వరకు ప్రతినెలా 4 వేల రూపాయల నిరుద్యోగ భృతి ఇస్తామని సరూర్ నగర్ లో కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీ యూత్ డిక్లరేషన్ ను ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రంలో అనేకమంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. ఉద్యోగాల కోసం యువత ఆందోళనలు చేపడితే అక్రమంగా అరెస్ట్ లు చేయడం, లాఠీచార్జి చేయడం వంటి దుర్మార్గపు చర్యలకు ప్రభుత్వం పాల్పడుతుందని ధ్వజమెత్తారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా డ్రామాలు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పై యువతకు నమ్మకం పోయిందని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు వత్తిడి తీసుకొస్తామని హెచ్చరించారు. ఈ నెల 18 వ జరిగే సభకు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని, యువత పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు.

ప్రజాబలం

16 జూలై 2026 గురువారం

# వన్ నేషన్-వన్ ఎలక్షన్

భారత రాజకీయ యవనికపై అత్యంత భారీ మార్పులకు కేంద్ర ప్రభుత్వం వేదిక సిద్ధం చేస్తోంది. ఒకేసారి మూడు చారిత్రాత్మక సంస్కరణలను అమల్లోకి తెచ్చేందుకు చట్టసభల్లో ముమ్మర ప్రయత్నాలు సాగుతున్నాయి. వన్ నేషన్-వన్ ఎలక్షన్ , నియోజకవర్గాల పునర్విభజన , మహిళా రిజర్వేషన్ల తక్షణ అమలు కోసం పార్లమెంట్‌లో ప్రతిపాదించిన రాజ్యాంగ సవరణ బిల్లులు దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ రూపురేఖలను సంపూర్ణంగా మార్చేయబోతున్నాయి. ఈ మూడు బిల్లుల కలయిక కేవలం ఎన్నికల సంస్కరణ మాత్రమే కాదు, ఇది భారత ఫెడరల్ నిర్మాణాన్ని, ప్రాతినిధ్య రాజకీయాలను సరికొత్త దిశకు తీసుకెళ్లే ఒక సుదీర్ఘ ప్రయాణం.దేశవ్యాప్తంగా లోక్‌సభతో పాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలనే వన్ నేషన్-వన్ ఎలక్షన్ బిల్లు భారత ఎన్నికల నిర్వహణ వ్యయాన్ని, శ్రమను భారీగా తగ్గించడమే లక్ష్యంగా తెస్తున్నారు. పార్లమెంటరీ సంయుక్త కమిటీ అంచనాల ప్రకారం.. నిరంతరం ఎక్కడో ఒకచోట ఎన్నికలు జరగడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు దాదాపు 7 లక్షల కోట్ల నష్టం వాటిల్లుతోంది. ఒకేసారి ఎన్నికలు జరగడం వల్ల మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ వల్ల నిలిచిపోయే అభివృద్ధి పనులకు విముక్తి లభిస్తుంది. అయితే, మధ్యలో ఏదైనా రాష్ట్ర ప్రభుత్వం పడిపోతే, అక్కడ కొత్తగా ఎన్నికయ్యే సభ కేవలం మిగిలిన కాలపరిమితి కి మాత్రమే పరిమితం అవుతుందనే ప్రతిపాదన ప్రాంతీయ పార్టీలలో కొంత ఆందోళన కలిగిస్తోంది. ఈ విధానాన్ని 2029 కల్లా పూర్తి స్థాయిలో అమల్లోకి తేవాలని కేంద్రం గట్టి పట్టుదలతో ఉంది.1971 జనాభా లెక్కల ఆధారంగా స్తంభింపజేసిన లోక్‌సభ స్థానాల పరిమితిని సవరించి, నియోజకవర్గాల పునర్విభజనను చేపట్టేందుకు కేంద్రం సిద్ధమైంది. దీని కోసం ప్రతిపాదించిన చట్టాల ప్రకారం.. లోక్‌సభ గరిష్ట స్థానాల సంఖ్యను 550 నుండి ఏకంగా 850కి పెంచే అవకాశం ఉంది. ఎవరికీ అన్యాయం జరగకుండా యాభై శాతం సీట్ల ఫార్ములాను తీసుకు వచ్చింది. గతంలో ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ చట్టం అమలు కావాలంటే జనాభా లెక్కలు, పునర్విభజన పూర్తి కావాలనే నిబంధన ఉండేది. కానీ, తాజా 131వ రాజ్యాంగ సవరణ బిల్లు ద్వారా ఈ ప్రక్రియను వేగవంతం చేసి, అందుబాటులో ఉన్న డేటా ఆధారంగానే మహిళా కోటాను తక్షణమే అమల్లోకి తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీనివల్ల రాబోయే 2029 సాధారణ ఎన్నికల నాటికి లోక్‌సభ , రాష్ట్రాల అసెంబ్లీలలో 33 శాతం స్థానాలు మహిళలకే దక్కుతాయి. ఇది భారత రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యాన్ని క్రింది స్థాయి నుండి అగ్రస్థాయి వరకు అనూహ్యంగా పెంచే విప్లవాత్మక మార్పు కానుంది.ఈ మూడు మహా బిల్లులు ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి. పునర్విభజన జరిగితేనే పెరిగిన సీట్లలో మహిళా రిజర్వేషన్లు పక్కాగా అమలవుతాయి, ఆ సీట్ల ఆధారంగానే వన్ నేషన్-వన్ ఎలక్షన్ నిర్వహించాల్సి ఉంటుంది. అయితే, ఈ స్థాయి భారీ రాజ్యాంగ సవరణలు కేవలం పార్లమెంట్‌లో సాధారణ మెజారిటీతో సాధ్యం కాదు. దీనికి రెండు పద్ధతుల ప్రత్యేక మెజారిటీ తో పాటు కనీసం సగం రాష్ట్రాల అసెంబ్లీల ఆమోదం తప్పనిసరి. ప్రాంతీయ పార్టీలను ఒప్పించడం, దక్షిణాది రాష్ట్రాల హక్కులను కాపాడటం, ఒకేసారి దేశవ్యాప్తంగా ఈవీఎంల సరఫరా వంటి భారీ లాజిస్టికల్ సవాళ్లు కేంద్రం ముందున్నాయి. లోక్‌సభ, అసెంబ్లీలకు కలిపి దేశం మొత్తం ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే.. భారీగా ప్రభుత్వ ధనం వృథా తగ్గి.. ఖర్చులు కలిసి వస్తాయని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. దీంతో పాటు ప్రభుత్వ అధికార యంత్రాంగాన్ని కూడా సమర్థవంతంగా ఉపయోగించుకునే అవకాశం ఉంటుందనే వాదనలు వినిపిస్తున్నాయి. సాధారణంగా అధికారులు ఎన్నికల విధుల్లో పూర్తిగా నిమగ్నమై ఉంటే పరిపాలనపై ప్రభావం పడుతుంది.. అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఎన్నికలు ఒకేసారి నిర్వహిస్తే.. సమయం ఆదాతో పాటు రెండుసార్లు ఎన్నికలు జరగకుండా వారు పరిపాలనపై దృష్టి పెట్టడానికి అవకాశం ఉంటుంది. దీంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలుకు తరచూ ఎన్నికల కోడ్ అడ్డంకిగా మారడం కూడా తగ్గుతుంది. ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం వల్ల ఓటర్లు ఒకేసారి వచ్చి ఓటింగ్ వేయడం వల్ల పోలింగ్ శాతం కూడా పెరుగుతుందని లా కమిషన్ వెల్లడించింది.అయితే ఈ జమిలీ ఎన్నికలు నిర్వహించాలంటే ముందుగా కొన్ని రాజ్యాంగ సవరణలు చేయాల్సి ఉంటుంది. ప్రజా ప్రాతినిధ్య చట్టం సహా ఇతర పార్లమెంటరీ ప్రొసీజర్లను కూడా సవరించాల్సి ఉంటుంది. దీని కోసం రాష్ట్రాల అంగీకారం కూడా కావాల్సి ఉంటుంది. ఒకే దేశం ఒకే ఎన్నిక అమల్లోకి వస్తే ప్రచారంలో జాతీయ అంశాలే అధిక ప్రాధాన్యత కలిగి ఉండి.. స్థానిక అంశాలు, సమస్యలు కనిపించకుండా పోతాయని ప్రాంతీయ పార్టీలు తీవ్రంగా భయపడుతున్నాయి. దీనికి తోడు ఎన్నికల ఖర్చులో కూడా జాతీయ పార్టీలతో ప్రాంతీయ పార్టీలు పోటీపడాల్సి రావడం మరింత ఇబ్బందిగా ఉంటుందని భావిస్తున్నాయి. అయితే 2015లో నిర్వహించిన ఓ సర్వే ప్రకారం.. దేశంలో జమిలి ఎన్నికలు నిర్వహిస్తే 77 శాతం మంది ప్రజలు ఒకే పార్టీ లేదా కూటమికి ఓటు వేయనున్నారని తేలింది. అసెంబ్లీకి పార్లమెంట్‌కు వేర్వేరుగా నిర్వహిస్తే ఒకే పార్టీని ఎన్నుకొనే అవకాశాలు 61శాతానికి తగ్గినట్లు వెల్లడైంది.స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1967 వరకు దేశంలోని అన్ని రాష్ట్రాలకు, లోక్‌సభకు ఒకేసారి ఎన్నికలు జరిగేవి. ఆ తర్వాత కొన్ని రాష్ట్రాల అసెంబ్లీలు రద్దుకావడం, 1970 లో ఏడాది ముందే లోక్‌సభ రద్దు చేయడంతో ఈ విధానం మారిపోయింది. అయితే 1983 లో ఎన్నికల కమిషన్ మరోసారి జమిలీ ఎన్నికల ప్రతిపాదనను తెరపైకి తెచ్చినా.. ప్రభుత్వం ఆసక్తి చూపలేదు. 1999 లో లా కమిషన్ నివేదిక ఒకే దేశం ఒకే ఎన్నిక విధానాన్ని లేవనెత్తినా అది ఆచరణలోకి రాలేదు. 2016 లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ జమిలీ ఎన్నికల ఆలోచనను ప్రతిపాదించగా.. 2017 లో నీతి ఆయోగ్ కసరత్తు చేసింది. 2019 లో ఈ అంశంపై వివిధ పార్టీల నేతలతో ప్రధాని మోదీ సమావేశం ఏర్పాటు చేయగా.. కాంగ్రెస్ సహా చాలా ప్రతిపక్షాలు హాజరు కాలేదు. అయితే 2022 లో జమిలీ ఎన్నికల నిర్వహణకు తాము సిద్ధమేనని సీఈసీ సుశీల్ చంద్ర ప్రకటించారు. 2022 డిసెంబర్‌లో జమిలీ ఎన్నికలపై లాకమిషన్ వివిధ పార్టీలు, ఈసీ, అధికారులు, విద్యావేత్తలు, నిపుణుల అభిప్రాయాలను ఆహ్వానించింది.ఇవన్నీ దాటుకుని బిల్లులు చట్ట రూపం దాలిస్తే, భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఇది సరికొత్త అధ్యాయం అవుతుంది. అయితే దీనికి సంబంధించిన బ్యాక్ గ్రౌండ్ వర్క్ ను ఎన్డీఏ పెద్దలు ఇప్పటికే పూర్తి చేసినట్లుగా తెలుస్తోంది.

# అమెజాన్ డేటా సెంటర్ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి

తెలంగాణను 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే "తెలంగాణ రైజింగ్-2047" లక్ష్యం. వికసిత భారత్ 2047 లక్ష్యం 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ గా భారత్ ను నిలపాలన్న లక్ష్యంలో భాగంగా జాతీయ జీడీపీలో తెలంగాణ తన వాటాను ప్రస్తుతం ఉన్న 5 శాతం నుంచి 10 శాతానికి పెంచుకోవాలని ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది

ఈ లక్ష్యాన్ని చేరుకోవడానికి పెట్టుబడులు, ఉద్యోగ కల్పన కీలకం.. ఇందులో భాగంగా, పరిశ్రమల కల్పనకు అవసరమైన అన్ని మౌలిక వసతులు, సౌకర్యాలు, అనుమతులను ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది

2034 నాటికి అమెజాన్ సంస్థ లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టాలి

ప్రతి నెలా పరిశ్రమల స్థాపనకు సంబంధించి అన్ని అంశాలపై సమగ్ర రివ్యూ నిర్వహిస్తున్నాం .. అమెజాన్ సంస్థ పెట్టుబడులకు సంబంధించి ప్రతి నెలా ప్రత్యేక సమావేశం నిర్వహిస్తాం

తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి కి నమూనాగా నిలపాలనే ఆలోచనతో తెలంగాణ రైజింగ్ పాలసీ విధానాన్ని రూపొందించుకున్నాం .. పరిశ్రమలు, పర్యాటకం, ఎనర్జీ, ఆరోగ్యం, స్పోర్ట్స్ లాంటి రంగాల్లో నిర్దిష్టమైన పాలసీలు రూపొందించుకున్నాం

ఉద్యోగ కల్పన కోసం యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ను ఏర్పాటు చేసుకున్నాం

అమెజాన్ లాంటి సంస్థలు పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తే ఆ ప్రాంతాల్లో ఇతర కంపెనీలు, పరిశ్రమల ఏర్పాటుకు దోహద పడుతుంది

హైదరాబాద్ నగరంలో ఔటర్ రింగ్ రోడ్డు, ఐటీ, ఫార్మా కంపెనీలు, అంతర్జాతీయ ఎయిర్పోర్ట్ తో ప్రపంచానికే ఆదర్శంగా నిలిచింది

ఔటర్ రింగ్ రోడ్డు లోపల 1.34 కోట్ల మంది నివసిస్తున్నారు.. ఉద్యోగ అవకాశాలు కల్పించడం తోపాటు కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దాలి

నగరంలో ఉన్న పరిశ్రమలను తరలించే అవసరం ఉంది, మూసి నది ప్రక్షాళన, మెట్రో రైలు విస్తరించడం అవసరం ఉంది

మూడు లక్షల ఆర్టీసీ బస్సులను ఎలక్ట్రిక్ బస్సులు గా మార్చడానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది.. నగరంలో డీజిల్ మీద ఆధార పడి నడుస్తున్న 2 లక్షల ఆటోలను రెట్రో ఫిట్టింగ్ ద్వారా ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చే దిశగా అడుగులు పడుతున్నాయి

ఎలక్ట్రిక్ వాహనాల రిజిస్ట్రేషన్ కు టాక్స్ ను పూర్తిగా మినహాయించి హైదరాబాద్ ను




కాలుష్య రహితంగా మార్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది .. ఏడాదికి రూ 1,500 కోట్ల రూపాయల ఆదాయాన్ని కోల్పోయినప్పటికీ ఈ కార్యక్రమాన్ని చేపట్టాం

దేశంలో ఇతర నగరాల్లో ఉన్న కాలుష్య సంబంధిత సమస్యలను హైదరాబాద్ లో పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నాం

క్యూర్, ప్యూర్, రేర్ ప్రాంతాలుగా రాష్ట్రాన్ని విభజించాం.. సమగ్ర ప్రణాళిక తో అభివృద్ధిలో ముందుకు సాగుతున్నాం

ఈ ప్రాంత రైతులను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా.. రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్ల కోస భూములను త్యాగం చేసిన రైతులను ఎప్పటికీ గుర్తు పెట్టుకుంటుంది

భవిష్యత్ తరాలకు ఒక అద్భుతమైన నగరాన్ని నిర్మించడానికి ముందుకు వచ్చి సహకరించిన వారిని అభినందిస్తూ .. చిన్న చిన్న సమస్యలను పరిష్కరించుకుంటూ అవసరమైన నష్ట పరిహారాన్ని అందించాలని అధికారులకు ఆదేశాలిస్తున్నా..

భూమి ఇచ్చి అభివృద్ధికి సహకరించిన రైతులను గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది

ఆందోళనలు చేపడుతున్న రైతులతో చర్చించాలని మంత్రి శ్రీధర్ బాబు, మాజీ ఎమ్మెల్యే కె లక్ష్మా రెడ్డి గార్లకు సూచిస్తున్నా..


భూములు కోల్పోయిన రైతుల కుటుంబాలకు ఉపాధి అవకాశాలను కల్పించాలి.. మంచి నష్ట పరిహారాన్ని అందించాలి

అమెజాన్ సంస్థ తన కార్యకలాపాలను మరింతగా విస్తరించాలని విజ్ఞప్తి చేస్తున్నా

# శాస్త్ర విజ్ఞానమే దేశ నిర్మాణానికి బలమైన పునాది : గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

**-విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, ఆవిష్కరణల స్ఫూర్తిని పెంపొందించడంలో విజ్ఞాన భారతి కీలక పాత్ర పోషించాలి**

**-లోక్ భవన్‌లో విజ్ఞాన భారతి (విభా) శాస్త్ర ప్రతిభా పోటీల కంటెస్టెంట్ లతో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ముఖాముఖి**





హైదరాబాద్, జూలై 15, 2026 :శాస్త్ర విజ్ఞానం, పరిశోధనలు, ఆవిష్కరణలే భారత భవిష్యత్తుకు బలమైన పునాదులని తెలంగాణ గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. విజ్ఞాన భారతి (విభా) ఆధ్వర్యంలో నిర్వహించిన "శాస్త్ర ప్రతిభా పోటీలు 2025–-26" లో పాల్గొన్న కువైట్, సౌదీ అరేబియా దేశాల నుంచి వచ్చిన 48 మంది విద్యార్థులు, మెంటర్ల తో బుధవారం లోక్ భవన్‌లో గవర్నర్ ముఖాముఖీ నిర్వహించారు .

పర్యటన వివరాలు , సందర్శించిన ప్రదేశాలు, వాటి ప్రాముఖ్యత , భారతీయ ప్రాచీన శాస్త్రవేత్తలు, బ్రిక్స్ కూటమి గురించి విద్యార్థులను ప్రశ్నించారు .

ఈ సందర్భంగా కువైట్, సౌదీ అరేబియా దేశాల నుంచి వచ్చిన 48 మంది భారతీయ విద్యార్థులు, మెంటర్లు గవర్నర్‌ను కలుసుకున్నారు. విద్యార్థుల్లో శాస్త్ర విజ్ఞానంపై ఉన్న ఆసక్తిని గవర్నర్ అభినందిస్తూ, నిరంతర అధ్యయనం, పరిశోధన, నూతన ఆవిష్కరణల దిశగా ముందుకు సాగాలని సూచించారు.

ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, స్వదేశీ స్ఫూర్తితో శాస్త్ర ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తున్న విజ్ఞాన భారతి, సమాజంలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం, యువతలో వినూత్న ఆలోచనలకు ప్రోత్సాహం కల్పించడం, దేశ అభివృద్ధికి అవసరమైన శాస్త్ర సాంకేతిక రంగాల్లో యువతను తీర్చిదిద్దడంలో మరింత కీలక పాత్ర పోషించాలని అన్నారు. విదేశాల్లో నివసిస్తున్న భారతీయ విద్యార్థులకు భారత శాస్త్రీయ వారసత్వాన్ని పరిచయం చేయడంతో పాటు, వారిలో ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించేందుకు విజ్ఞాన భారతి చేస్తున్న కృషిని గవర్నర్ ప్రశంసించారు.

ఈ కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం దాన కిషోర్, విజ్ఞాన భారతి ప్రతినిధులు పాల్గొన్నారు .



శ్రీ జగదాంబ మహంకాళి దేవాలయం బోనాల ఉత్సవాల్లో(గోల్కొండ బోనాలు) పాల్గొనాల్సిందిగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ని ఆహ్వానించారు. గురువారం నుంచి ఆషాడ మాస బోనాల ఉత్సవాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో మంత్రి కొండా సురేఖ , దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత రావు తో పాటు ఆలయ ఈవో, పూజారులు, ధర్మకర్తల మండలి సభ్యులు జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి ని కలిసి ఆహ్వానం అందించారు.

# అద్దె వాహనాల డ్రైవర్ల ఆర్థిక ఇబ్బందులు..

## వేతనాల పెంపు కోరుతూ సమ్మె.

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ శాఖలకు అద్దె ప్రాతిపదికన వాహనాలు నడుపుతున్న డ్రైవర్లు, యజమానులు అమీర్ పేట్ హెచ్‌ఎండిఏ కార్యాలయం ముందు సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రస్తుతం నెలకు రూ.34,000 చెల్లిస్తున్న అద్దెను పెంచి రూ.55,000కు పెంచాలని వారు డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల, వాహనాల నిర్వహణ ఖర్చులు, ఈఎంఐలు, డ్రైవర్ల జీతాలు, బీమా ప్రీమియంలు తదితర వ్యయాలు గణనీయంగా పెరిగినా అద్దె చార్జీలను పెంచకపోవడంతో తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్నామని వారు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే స్పందించి అద్దె చార్జీలను రూ.34 వేల నుంచి రూ.55 వేలకు పెంచాలని, తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంపత్ కుమార్, పండరి, సాయి, అబ్దుల్ ,హనుమంతు, వెంకటేష్, కరుణాకర్ ,నవీన్, ఆల్ హెచ్‌ఎండిఏ డ్రైవర్స్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ అభివృద్ధికి కొత్త రెక్కలు తొడగనున్న వరంగల్ విమానాశ్రయం

(సి.హెచ్.ప్రతాప్)

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రయాణంలో వరంగల్ మామునూరు విమానాశ్రయం ఒక కీలక మైలురాయిగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ప్రధాన కేంద్రంగా సేవలందిస్తుండగా, వరంగల్‌లో విమానాశ్రయం అందుబాటులోకి రావడం ఉత్తర తెలంగాణ జిల్లాల అభివృద్ధికి కొత్త ఊపునివ్వగలదు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరడం ఈ అంశానికి మరింత ప్రాధాన్యతను తీసుకొచ్చింది.

వరంగల్ చారిత్రక, సాంస్కృతిక, విద్యా, పారిశ్రామిక రంగాలలో ప్రత్యేక గుర్తింపు పొందిన నగరం. కాకతీయుల వైభవాన్ని చాటిచెప్పే వారసత్వ కట్టడాలు, ప్రపంచ వారసత్వ జాబితాలో స్థానం సంపాదించిన రామప్ప దేవాలయం, వేల స్తంభాల గుడి వంటి పర్యాటక కేంద్రాలు దేశ విదేశాల నుంచి సందర్శకులను ఆకర్షిస్తున్నాయి. విమాన సౌకర్యం ఏర్పడితే ఈ ప్రాంతానికి పర్యాటకుల రాక మరింత పెరిగి స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వనుంది.

పర్యాటక రంగంతో పాటు పారిశ్రామికాభివృద్ధికి కూడా ఈ విమానాశ్రయం కీలకంగా మారుతుంది. వరంగల్, హనుమకొండ, కరీంనగర్, మహబూబాబాద్, ములుగు వంటి జిల్లాల్లో పెట్టుబడులు పెరగడానికి మెరుగైన రవాణా అనుసంధానం ఎంతో అవసరం. విమానాశ్రయం అందుబాటులోకి వస్తే సమాచార సాంకేతికత, ఔషధ పరిశ్రమలు, వస్త్ర పరిశ్రమ, ఆహార శుద్ధి పరిశ్రమల విస్తరణకు అనుకూల వాతావరణం ఏర్పడుతుంది. వ్యాపార కార్యకలాపాలు వేగవంతమై యువతకు ఉపాధి అవకాశాలు విస్తరించే అవకాశం ఉంది.

విమానాశ్రయం నిర్మాణం అనేది కేవలం విమానాలు దిగే కేంద్రం మాత్రమే కాదు. దాని చుట్టూ రహదారులు, గిడ్డంగులు, వాణిజ్య సముదాయాలు, అతిథి గృహాలు, శిక్షణా కేంద్రాలు, సేవారంగ సంస్థలు అభివృద్ధి చెందుతాయి. దీనివల్ల ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు పెరిగి ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుంది. వ్యవసాయ, ఉద్యాన, పూల సాగు ఉత్పత్తులను వేగంగా ఇతర ప్రాంతాలకు, విదేశాలకు తరలించే అవకాశాలు కూడా మెరుగుపడతాయి.

అయితే ప్రాజెక్టు అమలులో భూసేకరణ, పర్యావరణ పరిరక్షణ, స్థానిక ప్రజల ప్రయోజనాల పరిరక్షణ వంటి అంశాలపై సమతుల్య దృష్టి అవసరం. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ నిర్ణీత గడువులో పూర్తి చేయడం అత్యంత ముఖ్యం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పర సమన్వయంతో ముందుకు సాగితే ఈ ప్రాజెక్టు వేగంగా పూర్తయ్యే అవకాశం ఉంది.

వరంగల్ విమానాశ్రయం కార్యరూపం దాల్చడం ద్వారా తెలంగాణలో సమతుల్య ప్రాంతీయాభివృద్ధికి కొత్త దిశ లభిస్తుంది. ఇది కేవలం రవాణా సౌకర్యాన్ని పెంచే ప్రాజెక్టు మాత్రమే కాకుండా, పెట్టుబడులు, పర్యాటకం, ఉపాధి, వాణిజ్యం, సేవారంగాలకు దీర్ఘకాలిక వృద్ధికి బలమైన పునాదిగా నిలిచి, ఉత్తర తెలంగాణ అభ్యున్నతికి కొత్త రెక్కలను అందించగలదు.

## ఉప ముఖ్యమంత్రి, మంత్రుల పర్యటన ఏర్పాట్ల పరిశీలన



**సత్తుపల్లి,ప్రజాబలం జూలై 15:** గురువారం సత్తుపల్లి నియోజకవర్గంలోని యాతాలకుంట టన్నెల్ ప్రాంతం, సీతారామ ప్రాజెక్టు సందర్శనకు రానున్న ఉప ముఖ్యమంత్రి మరియు మంత్రుల పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్. బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్‌తో కలిసి హెలీప్యాడ్ ఏర్పాట్లు, టన్నెల్ పనులు, భద్రతా చర్యలు, అధికారులు చేపట్టాల్సిన ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.

పర్యటన విజయవంతంగా సాగేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, హెలీప్యాడ్, రహదారులు, భద్రత, ఇతర మౌలిక సదుపాయాల ఏర్పాట్లను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

## ఆయిల్ పరిశ్రమలో కార్మికుడి మృతి..ఉద్రిక్తత

నల్లజర్ల తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం అయ్యవరం లో 3ఎఫ్ ఆయిల్ ఫ్యాక్టరీ వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. మంగళవారం నాడు ఆయిల్ పామ్ పరిశ్రమ లో నీటి ట్యాంక్ లో పడి సామర్లకోట మండలం పవర గ్రామానికి చెందిన తుమ్మలపల్లి రాజేంద్ర అనే కార్మికుడు మృతి చెందాడు. రాజేంద్ర మృతి పై కుటుంబ సభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ త్రీ ఎఫ్ ఆయిల్ పామ్ పరిశ్రమ వద్ద ధర్నాకు దిగారు. పోలీసులు ఫ్యాక్టరీ వద్ద భారీగా మోహరించారు. ఫ్యాక్టరీ వద్ద ధర్నా కు దిగిన సీఐటీయూ నాయకులను బంధువులను పోలీస్ జీప్ లు ఎక్కించి పోలీస్ స్టేషన్ కు తరలించారు.

# రహదారుల అభివృద్ధికి కేంద్రమంత్రికి తుమ్మల లేఖలు

### కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి నాలుగు ప్రత్యేక లేఖలు
### ఖమ్మం-అశ్వారావుపేట రహదారి నాలుగు వరుసలుగా మార్పు
### ఔటర్ బైపాస్‌లో మిగిలిన 7 కి.మీ లింకుకు మంజూరు కోరిన మంత్రి
### కొత్తగూడెం-పాల్వంచలకు 25 కి.మీ బైపాస్ ప్రతిపాదన
### భద్రాచలం పట్టణానికి రూ.25 కోట్లతో బైపాస్.. తక్కువ వ్యయంతో శాశ్వత పరిష్కారం

**ఖమ్మం జిల్లా ప్రతినిధి జూలై15 ప్రజాబలం:** ఖమ్మం జిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధి, ప్రయాణికుల భద్రత లక్ష్యంగా రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత-జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర రోడ్డు రవాణా, రహదారులు, ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి నితిన్ జైరాం గడ్కరీకి నాలుగు ప్రత్యేక లేఖలు రాశారు. ఖమ్మం-అశ్వారావుపేట రహదారి నాలుగు వరుసలుగా మార్పు, ఖమ్మం ఔటర్ బైపాస్‌లో మిగిలిన లింకు మంజూరు, కొత్తగూడెం-పాల్వంచ పట్టణాలకు బైపాస్ నిర్మాణం, భద్రాచలం పట్టణానికి బైపాస్ మంజూరుపై ఈ లేఖల్లో ఆయన వివరించారు.

భద్రాచలం పట్టణానికి బైపాస్.. కరకట్ట హైవేతో పోలిస్తే అత్యంత తక్కువ ఖర్చు...

ఏపీ, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సహా పలు ఉత్తరాది రాష్ట్రాలను కలిపే జాతీయ రహదారి-30 ప్రస్తుతం ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం ఉన్న భద్రాచలం పట్టణం నడిబొడ్డు గుండా వెళ్తోందని మంత్రి తుమ్మల తెలిపారు. ఇసుక లారీలు, పారిశ్రామిక, వ్యవసాయ వాహనాలతో పాటు ఏటా భారీ సంఖ్యలో వచ్చే భక్తుల రద్దీ కలగలిసి తీవ్ర ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని వివరించారు. 10 కిలోమీటర్ల పరిధిలోనే తొమ్మిది ప్రమాద ప్రాంతాలు (బ్లాక్‌స్పాట్లు) ఏర్పడి, ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాన పండుగల సమయాల్లో ట్రాఫిక్ నియంత్రణ కోసం భారీ వాహనాలను గంటల తరబడి నిలిపివేయాల్సి రావడంతో భక్తులకు తీవ్ర అసౌకర్యం, సరుకు రవాణాకు ఆలస్యం, రవాణా ఖర్చులు పెరుగుతున్నాయని పేర్కొన్నారు.

ఇటీవల భద్రాచలం కరకట్ట మీదుగా ప్రత్యామ్నాయ హైవే నిర్మాణ ప్రతిపాదన తెరపైకి వచ్చినా, దానికి రూ.120 కోట్ల భారీ వ్యయం అవుతుందని మంత్రి గుర్తుచేశారు. అదే భద్రాచలం పట్టణానికి ప్రత్యేక బైపాస్ రోడ్డు నిర్మిస్తే కేవలం రూ.25 కోట్లతోనే పూర్తి చేయవచ్చని, ఖర్చు తక్కువగా ఉండటమే కాకుండా శాశ్వత పరిష్కారం లభిస్తుందని వివరించారు. ఈ బైపాస్‌తో దీర్ఘకాలిక ట్రాఫిక్ రవాణాకు, ముఖ్యంగా భారీ వాణిజ్య వాహనాలకు పట్టణం గుండా వెళ్లే అవసరం తప్పుతుందని, భక్తులకు సురక్షిత, సౌకర్యవంతమైన ప్రయాణం లభిస్తుందని, ప్రమాదాలు గణనీయంగా తగ్గి, ప్రయాణ సమయం ఆదా అవుతుందని, సరుకు రవాణా మెరుగుపడి ప్రాంత పారిశ్రామిక, ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఎన్‌హెచ్-30 వ్యూహాత్మక ప్రాధాన్యతను, భద్రాచలంలో రహదారి భద్రత అవసరాన్ని పరిగణనలోకి తీసుకుని బైపాస్ నిర్మాణానికి పరిపాలన, ఆర్థిక అనుమతులు తక్షణమే మంజూరు చేయాలని మంత్రి కోరారు.

ఖమ్మం-అశ్వారావుపేట నాలుగు వరుసలుగా మార్చాలి

జాతీయ రహదారి 365బీబీలోని ఖమ్మం-అశ్వారావుపేట మార్గాన్ని, జాతీయ రహదారి 563లోని వరంగల్-ఖమ్మం మార్గాన్ని తొలుత నాలుగు వరుసలుగా విస్తరించాలని ప్రతిపాదించినట్లు మంత్రి గుర్తుచేశారు. అయితే జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) ప్రస్తుత రహదారుల విస్తరణకు బదులు ఖమ్మం-దేవరపల్లి (365బీజీ), వరంగల్-ఖమ్మం (163జీ) పేరుతో కొత్తగా గ్రీన్‌ఫీల్డ్ రహదారులను చేపట్టిందని తెలిపారు. దీంతో ప్రస్తుత 365బీబీ, 563 రహదారుల విస్తరణ పక్కనపెట్టినట్లు వివరించారు.

ఖమ్మం, వెంకటాయపాలెం, తనికెళ్ల, కొణిజర్ల, పల్లిపాడు, వైరా, పినపాక, తల్లాడ, అంజనాపురం, కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి, గంగారం, మండలపల్లి, అశ్వారావుపేట తదితర జనావాసాల గుండా సాగే ఈ 122 కిలోమీటర్ల రహదారిపై ట్రాఫిక్ ఒత్తిడి కొనసాగుతుందని, సుమారు 40 బ్లాక్‌స్పాట్లు ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రజా భద్రత, ప్రాంత అభివృద్ధి దృష్ట్యా ఈ మార్గాన్ని కేంద్ర రహదారుల శాఖకు (మోర్త్) తిరిగి అప్పగించి, నాలుగు వరుసల పనులకు ప్రత్యేక కేసుగా పరిగణించి మంజూరు చేయాలని కోరారు.

ఖమ్మం ఔటర్ బైపాస్‌లో మిగిలిన 7 కిలోమీటర్ల లింకు..

గ్రీన్‌ఫీల్డ్ రహదారుల నిర్మాణంతో ఖమ్మం పట్టణానికి పశ్చిమ, దక్షిణ, ఆగ్నేయ దిశల్లో బైపాస్ ఏర్పడిందని, సూర్యాపేట-ఖమ్మం నాలుగు వరుసల రహదారి, ఖమ్మం-కురవి (365ఏ) పనులతో ఉత్తర భాగం కూడా పూర్తవుతుందని మంత్రి తెలిపారు. దీంతో ప్రతిపాదిత ఖమ్మం ఔటర్ బైపాస్‌లో దాదాపు 80 శాతం సిద్ధమైందని, అయితే ఖమ్మం-కురవి మార్గానికి, వరంగల్-ఖమ్మం (163జీ) మార్గానికి మధ్య ఆగ్నేయ దిశలో 7 కిలోమీటర్ల కీలక అనుసంధాన లింకు మిగిలి ఉందని వివరించారు.

ఖమ్మం-కురవి మార్గాన్ని అమరావతి-నాగపూర్ గ్రీన్‌ఫీల్డ్ హైవే లింకుతో అనుసంధానిస్తే ఖమ్మం చుట్టూ నిరంతర రింగ్ రోడ్డు పూర్తిస్థాయిలో సాకారమవుతుందని మంత్రి పేర్కొన్నారు. ఈ లింకు పూర్తయితే ఖమ్మం చుట్టూ అన్ని జాతీయ రహదారుల మధ్య నిరంతర అనుసంధానం ఏర్పడి, పట్టణంలోకి భారీ వాహనాల రాకపోకలు తగ్గి, రద్దీ, ప్రమాదాలు తగ్గుతాయని పేర్కొన్నారు. గత రెండు వార్షిక ప్రణాళికల్లో ఈ ప్రతిపాదన చేర్చినా నిధులు మంజూరు కాలేదని గుర్తుచేస్తూ, ఇప్పటికే భారీగా పెట్టుబడులు పెట్టిన నేపథ్యంలో మిగిలిన లింకుకు ప్రాధాన్యతపై పరిపాలన, ఆర్థిక అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.



కొత్తగూడెం, పాల్వంచలకు బైపాస్ అవసరం..

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సహా పలు రాష్ట్రాల మీదుగా సాగే జాతీయ రహదారి 30, ప్రస్తుతం కొత్తగూడెం, పాల్వంచ పారిశ్రామిక పట్టణాల నడిబొడ్డు గుండా వెళ్తుండటంతో తీవ్ర ట్రాఫిక్ రద్దీ, ప్రమాదాలు, పర్యావరణ సమస్యలు తలెత్తుతున్నాయని మంత్రి తెలిపారు. ఇసుక లారీలు, పారిశ్రామిక, వ్యవసాయ వాహనాల రాకపోకలతో సుమారు 23 బ్లాక్‌స్పాట్లు ఏర్పడి ప్రాణనష్టం సంభవిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గౌరెల్లి -కొత్తగూడెం మధ్య ఎన్‌హెచ్-930 పూర్తయితే ట్రాఫిక్ మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.

ఈ నేపథ్యంలో కారుకొండ, సూరారం, రామవరం, లక్ష్మీదేవిపల్లి, ఓల్డ్ పాల్వంచ, జగన్నాధపురం మీదుగా 25 కిలోమీటర్ల బైపాస్ నిర్మించి, ఎన్‌హెచ్-930పి, ఎన్‌హెచ్-30లను అనుసంధానించాలని మంత్రి ప్రతిపాదించారు. ఈ ప్రాజెక్టుతో రహదారి భద్రత మెరుగుపడటంతో పాటు, ప్రయాణ సమయం తగ్గి, పారిశ్రామిక, ఆర్థిక వృద్ధికి దోహదపడుతుందని పేర్కొంటూ, ప్రాధాన్యతపై మంజూరు ఇవ్వాలని కోరారు.

## తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ లీజు సాధనపై సత్తుపల్లి సింగరేణిలో విజయోత్సవాలు



**సత్తుపల్లి,ప్రజాబలం ప్రతినిధి జూలై 15 :** సింగరేణి చరిత్రలో కీలక ఘట్టంగా నిలిచిన తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ మైనింగ్ లీజు మంజూరును పురస్కరించుకుని సత్తుపల్లి ఏరియాలో ఘనంగా విజయోత్సవాలు నిర్వహించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రత్యేక కృషి ఫలితంగా 13 ఏళ్ల నిరీక్షణకు ముగింపు లభించిందని అధికారులు పేర్కొన్నారు.

బుధవారం ఉదయం మార్నింగ్ షిఫ్ట్ ప్రారంభ సమయంలో జేవీఆర్ ఓసీ, జేవీఆర్ సీహెచ్‌పీ, కిష్టారం ఓసీ, జేవీఆర్ డిస్పెన్సరీలలో కార్మికులు, అధికారులు భారీ సంఖ్యలో పాల్గొని సంబరాలు జరుపుకున్నారు. జేవీఆర్ ఓసీలో నిర్వహించిన కార్యక్రమానికి ఏరియా జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జేవీఆర్ సీహెచ్‌పీలో ఏరియా ఇంజనీర్ సోమశేఖరరావు, కిష్టారం ఓసీలో ఎస్వో టు జీఎం బొల్లం శ్రీనివాస్ పాల్గొన్నారు. జేవీఆర్ డిస్పెన్సరీలో వైద్య సిబ్బంది ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం సత్తుపల్లి జీఎం కార్యాలయంలో ఏరియా హెచ్‌వోడీలు, కార్యాలయ సిబ్బందితో కలిసి ప్రధాన విజయోత్సవ సభ జరిగింది.ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పంపిన ప్రత్యేక సందేశాన్ని అధికారులు చదివి వినిపించారు. అనంతరం కార్మికులకు డిప్యూటీ సీఎం సందేశంతో కూడిన కరపత్రాలు, మిఠాయిలను పంపిణీ చేశారు.తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ ద్వారా ఏటా 6 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి 45 సంవత్సరాల పాటు కొనసాగి సింగరేణి అభివృద్ధికి, తెలంగాణ ఇంధన భద్రతకు బలాన్నిస్తుందని అధికారులు తెలిపారు. అలాగే భవిష్యత్తులో కోయగూడెం, సత్తుపల్లి తదితర బొగ్గు బ్లాకులను కూడా సింగరేణికి తీసుకురావాలనే డిప్యూటీ సీఎం హామీపై కార్మికులు హర్షం వ్యక్తం చేశారు.

## సత్తుపల్లిలో 2 కోట్లతో అత్యాధునిక అవుట్‌డోర్ క్రీడా ప్రాంగణం.

### జేవియర్ డిగ్రీ కళాశాల మైదానాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, కాంగ్రెస్ నేత డాక్టర్ మట్టా దయానంద్



**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి జూలై 15 :** సత్తుపల్లి పట్టణంలోని జేవియర్ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో సుమారు రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించనున్న అత్యాధునిక అవుట్‌డోర్ క్రీడా ప్రాంగణం ఏర్పాటుకు పనులు వేగం పుంజుకున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా క్రీడల అధికారి సునీల్ రెడ్డితో కలిసి సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ క్రీడా మైదానాన్ని పరిశీలించారు.

అవుట్‌డోర్ క్రీడా ప్రాంగణం నిర్మాణానికి అవసరమైన కొలతల ప్రక్రియను అధికారులు చేపట్టగా, క్రీడాకారులకు అన్ని వసతులు కల్పించేలా ప్రణాళికలు రూపొందించాలని ఎమ్మెల్యే రాగమయి, డాక్టర్ దయానంద్ అధికారులకు పలు సూచనలు చేశారు.అనంతరం జేవియర్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఉన్న వ్యాయామ పరికరాలను పరిశీలించిన వారు, పని చేయని పరికరాలను వెంటనే మరమ్మతులు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సత్తుపల్లి పట్టణంలో అత్యంత ఆధునిక సౌకర్యాలతో అవుట్‌డోర్ క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేసి యువతకు మెరుగైన క్రీడా వేదికను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ ప్రాంగణం పూర్తయితే స్థానిక క్రీడాకారులకు శిక్షణ, పోటీల నిర్వహణకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

# వైసీపీలో మళ్లీ కీలకం కానున్న చెవిరెడ్డి

తిరుపతి, జూలై 15 వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లో కీలక నేతల పాత్రపై మరోసారి రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. పార్టీ వ్యవహారాలను ఎవరు సమన్వయం చేస్తున్నారు, అధినేతకు అత్యంత సన్నిహితంగా ఎవరు వ్యవహరిస్తున్నారు అనే అంశాలపై ఊహాగానాలు వినిపిస్తున్నాయి. గతంలో పార్టీలో "కోటరీ" వ్యవస్థ ఉందంటూ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి పలు సందర్భాల్లో వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ఆ వ్యాఖ్యలు అప్పట్లో రాజకీయంగా పెద్ద చర్చకు దారితీశాయి.ప్రస్తుతం వైసీపీ రాష్ట్ర కోఆర్డినేటర్గా సజ్జల రామకృష్ణారెడ్డి వ్యవహరిస్తున్నారు. పార్టీ తరఫున విధానపరమైన ప్రకటనలు చేయడం, కీలక రాజకీయ అంశాలపై స్పందించడం, నాయకత్వ నిర్ణయాలను కేడర్‌కు చేరవేయడం వంటి బాధ్యతలను ఆయన నిర్వహిస్తూ వస్తున్నారు. అందుకే పార్టీ వ్యవహారాల్లో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో చాలాకాలంగా ఉంది.అయితే ఇటీవల మరో సీనియర్ నేత పేరు ఎక్కువగా వినిపిస్తోంది. తిరుపతి జిల్లా)కు చెందిన మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పార్టీ కేంద్ర కార్యాలయంలో చురుకుగా వ్యవహరిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. పార్టీ కార్యక్రమాల సమన్వయంలో ఆయన పాత్ర పెరిగిందనే చర్చ కూడా రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది.చంద్రగిరి ) నియోజకవర్గం నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన చెవిరెడ్డి, 2024 ఎన్నికల సమయంలో తన కుమారుడు మోహిత్ రెడ్డి ని రాజకీయాల్లోకి తీసుకొచ్చారు. అదే ఎన్నికల్లో ఆయన ఒంగోలు లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేశారు. అయితే ఎన్నికల్లో కూటమి ప్రభావంతో తండ్రీకొడుకులు ఇద్దరూ విజయం సాధించలేకపోయారు.తర్వాత లిక్కర్ కేసుకు సంబంధించి చెవిరెడ్డి అరెస్టై కొంతకాలం జైలులో ఉన్నారు. అనంతరం బెయిల్‌పై విడుదలైన తర్వాత ఆయన పార్టీ కార్యకలాపాల్లో మరింత చురుకుగా వ్యవహరిస్తున్నారని సమాచారం. ముఖ్యంగా తాడేపల్లి లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఎక్కువ సమయం గడుపుతున్నారని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.పార్టీకి సంబంధించిన వివిధ జిల్లాల పరిస్థితులపై సమాచారం సేకరించడం, స్థానిక నాయకులతో సమన్వయం చేయడం, ఆ వివరాలను పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి చేరవేయడం వంటి బాధ్యతల్లో చెవిరెడ్డి పాల్గొంటున్నారనే ప్రచారం కొనసాగుతోంది. అలాగే పార్టీ కార్యక్రమాలు సమర్థంగా అమలు అయ్యేలా పర్యవేక్షిస్తున్నారని కూడా పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.ఇటీవల కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనకు వ్యతిరేకంగా వైసీపీ చేపట్టిన నిరసన కార్యక్రమాల నిర్వహణలో కూడా చెవిరెడ్డి చురుకుగా వ్యవహరించారని ఆయన అనుచరులు చెబుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా నాయకులతో నిరంతరం సంప్రదింపులు జరిపి కార్యక్రమాలను సమన్వయం చేశారని వారు పేర్కొంటున్నారు. ఈ కారణంగా ఆయనకు పార్టీ అధినాయకత్వం వద్ద మరింత ప్రాధాన్యం పెరిగిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.మరోవైపు సజ్జల రామకృష్ణారెడ్డి ఇప్పటికీ పార్టీ విధానపరమైన అంశాల్లో కీలక పాత్ర పోషిస్తూనే ఉన్నారని పరిశీలకులు గుర్తుచేస్తున్నారు. అధికారిక ప్రకటనలు, రాజకీయ స్పందనలు ఎక్కువగా ఆయన ద్వారానే వెలువడుతున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో సజ్జల, చెవిరెడ్డి ఇద్దరూ పార్టీ వ్యవహారాల్లో ముఖ్యమైన బాధ్యతలు నిర్వహిస్తున్నారనే చర్చ కొనసాగుతోంది. అయితే పార్టీలో వారి పాత్రలు ఎలా మారతాయి, భవిష్యత్‌లో బాధ్యతల పంపిణీలో ఎలాంటి మార్పులు చోటు చేసుకుంటాయనే అంశంపై అధికారికంగా ఎలాంటి ప్రకటన లేదు. దీంతో వైసీపీ అంతర్గత రాజకీయాలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి కొనసాగుతోంది.

# కూటమి ఎమ్మెల్యేలే టార్గెట్ గా రావణ్ టీమ్

అనంతపురం, జూలై 15 ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం రేపుతున్న 'ప్రశ్న' యూట్యూబ్ ఛానల్ బ్లాక్‌మెయిలింగ్, వేధింపుల కేసు విచారణలో తాజాగా మరో సంచలన నిజాన్ని వెలుగులోకి వచ్చింది. అనంతపురం జిల్లా కల్యాణదుర్గం టీడీపీ ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబును వ్యక్తిగతంగా, రాజకీయంగా దెబ్బతీయడానికి ఈ యూట్యూబ్ ముఠా పెద్ద ఎత్తున కుట్ర పన్నినట్లు అంతర్గత విచారణలో బయటపడింది. 'ప్రశ్న' నిర్వాహకుడు జోసెఫ్ అలియాస్ రావణ్, అతని అనుచరులు చాలా కాలంగా ఎమ్మెల్యేకు వేధింపులు గురిచేసినట్లు ప్రాథమిక సమాచారం అందుతోంది.ఎమ్మెల్యే సురేంద్ర బాబుపై సమాజంలో అప్రతిష్ట తెచ్చేలా తప్పుడు అవినీతి ఆరోపణలతో వీడియోలు రూపొందించడం వెనుక కీలక సూత్రధారుల లింకులు బయటపడ్డాయి. ఈ కుట్ర వెనుక వైసీపీ నేత ఉమామహేశ్వర్ నాయుడి సోదరుడు ఇంద్రసేన నాయుడు ప్రమేయం ఉన్నట్లు ఆధారాలు లభించాయి. ఆయనతో పాటు 'ప్రశ్న' యూట్యూబ్ ఛానల్ సీఈవో గమన కూడా ఈ ప్లాన్‌లో భాగస్వామి అయి, తెరవెనుక స్క్రిప్ట్ డిజైనింగ్, ఫండింగ్ వ్యవహారాలను నడిపించినట్లు జిల్లావ్యాప్తంగా జోరుగా చర్చ సాగుతోంది.కూటమి ప్రభుత్వానికి చెందిన ప్రజాప్రతినిధులను టార్గెట్ చేస్తూ విపక్షాలు, కొన్ని యూట్యూబ్ ఛానళ్లు చేస్తున్న ఇటువంటి విష ప్రచారాలపై అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇదివరకే పార్టీ నేతలకు సూచించారు.

తాజా పరిణామాల నేపథ్యంలో గమన, ఇంద్రసేన నాయుడుల వ్యవహారంపై పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ డిజిటల్ నెట్‌వర్క్ వెనుక ఉన్న మరికొంతమంది కీలక వ్యక్తుల కాల్ డేటా, ఆర్థిక లావాదేవీలను వెలికితీసేందుకు గన్నవరం పోలీసులు తదుపరి చర్యలకు సిద్ధమవుతున్నారు.

వెనక్కి తగ్గిన పోలీసులు

యూట్యూబ్ ఛానల్ నిర్వాహకుడు బచ్చలకూరి జోసెఫ్ అలియాస్ ప్రసన్న రావణ్ కేసు విచారణలో ఊహించని మలుపు చోటుచేసుకుంది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా రావణ్‌ను 10 రోజుల పాటు తమ కస్టడీకి ఇవ్వాలంటూ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై గన్నవరం కోర్టులో విచారణ జరిగింది. అయితే, నాటకీయ పరిణామాల మధ్య ఆ కస్టడీ పిటిషన్‌ను తాము వెనక్కి (ఉపసంహరణ) తీసుకుంటున్నట్లు పోలీసుల తరఫు న్యాయవాది న్యాయస్థానానికి అధికారికంగా తెలియజేశారు.డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలతో పాటు మావోయిస్టు భావజాల వ్యాప్తి, సాయుధ తిరుగుబాటును ప్రోత్సహించేలా మాట్లాడారనే తీవ్రమైన ఆరోపణలపై గన్నవరం పోలీసులు రావణ్‌పై ఉపా (ఉపా) చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించిన సంగతి తెలిసిందే. ఈ కేసు మూలాలను, ఆర్థిక లావాదేవీలను వెలికితీసేందుకు 10 రోజుల పోలీసు కస్టడీ అవసరమని గత శుక్రవారం పోలీసులు కోరారు. అయితే, ఈ కేసులో 'ప్రశ్న' యూట్యూబ్ ఛానల్ సీఈఓ గమనతో పాటు పలువురు కీలక వ్యక్తులను గన్నవరం డీఎస్పీ కార్యాలయంలో పోలీసులు ఇప్పటికే సుదీర్ఘంగా విచారించి అవసరమైన వివరాలు, డిజిటల్ ఆధారాలను సేకరించినట్లు తెలుస్తోంది.

రావణ్ కస్టడీ అవసరం లేదని భావించి పోలీసులు వెనక్కి తగ్గినట్లు న్యాయవర్గాల్లో చర్చ సాగుతోంది. పోలీసులు కస్టడీ పిటిషన్‌ను ఉపసంహరించుకోవడంతో జోసెఫ్ రావణ్ ప్రస్తుతానికి నెల్లూరు సెంట్రల్ జైల్లోనే జ్యుడీషియల్ రిమాండ్‌లో కొనసాగనున్నారు. మరోవైపు, ఈ కేసులో ప్రభుత్వం కావాలనే ఉపా వంటి కఠిన చట్టాలను అక్రమంగా ప్రయోగిస్తోందని రావణ్ తరఫు న్యాయవాది పొన్నవోలు సుధాకర్ రెడ్డి కోర్టు వెలుపల తీవ్ర ఆరోపణలు చేశారు. తనపై నమోదైన పలు కేసులను ఒకే కేసుగా విచారించాలని కోరుతూ రావణ్ ఇప్పటికే ఏపీ హైకోర్టును కూడా ఆశ్రయించారు. పోలీసుల తాజా ఉపసంహరణ నిర్ణయంతో ఈ పొలిటికల్ అండ్ లీగల్ డ్రామా ఏ మలుపు తిరుగుతుందో అన్నది ఆసక్తికరంగా మారింది

# గోదావరి జిల్లాలపై నేతల గురి

రాజమండ్రి, జూలై 15 ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో గోదావరి ప్రాంతానికి ప్రత్యేకమైన స్థానం ఉంది. ముఖ్యంగా తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కోనసీమ, ఏలూరు ) జిల్లాల్లో రాజకీయ పరిణామాలు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారడం కొత్త విషయం కాదు. ఈ ప్రాంతంలో రాజకీయ చైతన్యం ఎక్కువగా ఉండటంతో పాటు ఎన్నికల సమయంలో ప్రజల తీర్పు కూడా రాష్ట్ర రాజకీయాలపై ప్రభావం చూపుతుందని విశ్లేషకులు భావిస్తుంటారు. అందుకే అధికార, ప్రతిపక్ష పార్టీలు రెండూ గోదావరి జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారిస్తుంటాయి.ఇటీవల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వరుస జిల్లా పర్యటనలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. కొద్ది రోజుల క్రితం రాయలసీమ ప్రాంతంలోని తిరుపతి చిత్తూరు , కడప, అన్నమయ్య జిల్లాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, ఇప్పుడు గోదావరి జిల్లాల పర్యటన ప్రారంభించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరించడంతో పాటు, ప్రాజెక్టుల పురోగతిని పరిశీలించడంపై దృష్టి పెట్టారు.ఈ పర్యటనలో భాగంగా తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, ఏలూరు జిల్లాల్లో పలు కార్యక్రమాలకు హాజరవుతున్నారు. ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద గేట్ల పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు, పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిని కూడా సమీక్షించారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై వివరాలు వెల్లడిస్తున్నారు.మరోవైపు ప్రతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కూడా గోదావరి జిల్లాలపై దృష్టి కేంద్రీకరించారు. గత ఎన్నికల అనంతరం ఈ ప్రాంతంలో పెద్దగా పర్యటించని ఆయన, ఇప్పుడు పశ్చిమ గోదావరి జిల్లాలోని భీమవరం ( పర్యటనకు సిద్ధమవుతున్నారు. ఈ సందర్భంగా వచ్చే 15న ఆక్వా రైతులతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకునే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.ఆక్వా రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు, రైతులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులు, మార్కెట్ పరిస్థితులు వంటి అంశాలను జగన్ ప్రస్తావించే అవకాశం ఉందని సమాచారం. ఈ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేసే అవకాశముందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.సార్వత్రిక ఎన్నికలకు ఇంకా కొంత సమయం ఉన్నప్పటికీ, స్థానిక సంస్థల ఎన్నికలపై ఇప్పటికే రాజకీయ పార్టీల దృష్టి పడింది. అందుకే అధికార పార్టీతో పాటు ప్రతిపక్షం కూడా ప్రజల్లో చురుకుగా ఉండేందుకు ప్రయత్నాలు ప్రారంభించినట్లు కనిపిస్తోంది. ప్రజా సమస్యలను ప్రస్తావిస్తూ తమ రాజకీయ కార్యాచరణను వేగవంతం చేసే దిశగా అడుగులు వేస్తున్నాయి.ఒకే సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రతిపక్ష నేత జగన్ ఇద్దరూ గోదావరి ప్రాంతంలో పర్యటనలు చేపట్టడం రాజకీయంగా ఆసక్తికర పరిణామంగా మారింది. ఈ పర్యటనలు స్థానిక రాజకీయాలపై మాత్రమే కాకుండా, రాబోయే ఎన్నికల వ్యూహాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గోదావరి జిల్లాల్లో మొదలైన ఈ రాజకీయ చురుకుదనం రానున్న రోజుల్లో రాష్ట్ర రాజకీయాలను మరింత వేడెక్కించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# పట్టిసీమ వివాదంలోకి రేవంత్

విజయవాడ జూలై16 తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య జల రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. తెలంగాణలోని కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీ వద్ద కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే నీటిని నిల్వ చేయకుండా కిందకు వదిలేస్తోందని, తద్వారా ఏపీలోని పట్టిసీమ ఎత్తిపోతల పథకానికి గోదావరి జలాలు సమృద్ధిగా అందేలా చూస్తోందని ప్రతిపక్ష బిఆర్ఎస్ ఆరోపిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన గురువు చంద్రబాబుకు మేలు చేసేందుకే తెలంగాణ ప్రయోజనాలను పణంగా పెడుతున్నారన్నది ఈ విమర్శల సారాంశం.

ఈ నేపథ్యంలో ఈ వాదనలోని సాంకేతిక, భౌగోళిక అంశాలపై ఆసక్తి నెలకొంది.తెలంగాణలోని కన్నెపల్లి మేడిగడ్డ పంప్ హౌస్ నుంచి ఎత్తిపోసే నీరు కిందకు రాకపోవడం వల్లే ఏపీలోని పట్టిసీమకు నీరు అందుతుందనే వాదన ప్రాథమిక భౌగోళిక సూత్రాలకే విరుద్ధం.

మహారాష్ట్ర నుంచి వచ్చే ప్రాణహిత, గోదావరి నదులు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం వద్ద కలుస్తాయి. ఇక్కడే మేడిగడ్డ బ్యారేజీ ఉంది. మేడిగడ్డ దాటిన తర్వాత గోదావరి నది వందల కిలోమీటర్ల మేర ప్రవహించి, ఛత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దుల నుంచి వచ్చే ఇంద్రావతి, శబరి వంటి భారీ ఉపనదులను కలుపుకుంటుంది. ఈ ఉపనదులన్నీ కలిసిన తర్వాతే గోదావరి నది ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం, ఆపై రాజమండ్రి ఎగువన ఉన్న పట్టిసీమ ప్రాంతానికి చేరుకుంటుంది.కాబట్టి మేడిగడ్డ వద్ద నీటిని ఆపినా, ఆపకపోయినా? వర్షాకాలంలో ఇంద్రావతి, శబరి, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లలో కురిసే భారీ వర్షాల కారణంగా వచ్చే వరద నీరు సహజ గ్రావిటీ ద్వారా పట్టిసీమకు చేరుకుంటుంది. జూలై మొదటి వారంలో మహారాష్ట్రలో కురిసిన భారీ వర్షాలకు ప్రాణహిత ద్వారా మేడిగడ్డకు సుమారు 1 లక్ష క్యూసెక్కుల వరద రాగా, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నిబంధనల ప్రకారం ఆ నీటిని కిందకు వదిలారు. అదే సమయంలో ఏపీలోని పట్టిసీమ వద్ద గోదావరిలోకి వచ్చిన 56,000 క్యూసెక్కుల వరద జలాల నుంచే జూలై 8న ఏపీ ప్రభుత్వం కృష్ణా డెల్టాకు నీటిని లిఫ్ట్ చేయడం ప్రారంభించింది.కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కారణాలతోనే మేడిగడ్డ వద్ద నీటిని నిల్వ చేయడం లేదన్న ఆరోపణలున్నాయి. అయితే దీనికి అనేక సాంకేతిక కారణాలున్నాయి. అక్టోబర్ 2023లో మేడిగడ్డ బ్యారేజ్ 7వ బ్లాక్‌లోని కొన్ని పిల్లర్లు కుంగిపోయాయి. దీనిపై విచారణ జరిపిన ఔఆూం బ్యారేజీ పునాదుల కింద ఇసుక కొట్టుకుపోవడం, జియో-టెక్నికల్ సర్వేల్లో లోపాలు ఉన్నట్లు తేల్చింది. ప్రస్తుత స్థితిలో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో పూర్తి స్థాయిలో అంటే 141 మీటర్ల మేర నీటిని నిల్వ చేయడం అత్యంత ప్రమాదకరమని, బ్యారేజీలు కొట్టుకుపోయే ప్రమాదం ఉందని ఔఆూం స్పష్టం చేసింది. ఈ మూడు బ్యారేజీల శాశ్వత పునరుద్ధరణ పనులు పూర్తి కావడానికి కనీసం 2 నుండి 3 ఏళ్ల సమయం పడుతుందని అంచనా. నదిలో ప్రవాహం లేని ఎండకాలంలో మాత్రమే కాంక్రీట్ పనులు చేయడం సాధ్యమవుతుంది. ప్రభుత్వం ప్రాజెక్టు భద్రతను దృష్టిలో ఉంచుకుని నిపుణుల కమిటీ సూచనల మేరకే గేట్లు ఎత్తి నీటిని కిందకు పంపుతోంది తప్ప, పట్టిసీమకు నీరివ్వాలనే ఉద్దేశంతో కాదు. ఒకవేళ బలవంతంగా నీటిని నిల్వ చేస్తే రూ. 1.1 లక్షల కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ఆస్తులకే ముప్పు వాటిల్లుతుంది.రాజకీయ విమర్శల కోణంలో చూస్తే రేవంత్ రెడ్డి ఏపీకి మేలు చేస్తున్నారనే ఆరోపణలు ప్రజల్లోకి వెళ్ళవచ్చు.

కానీ, క్షేత్రస్థాయి పరిశీలన, సాంకేతిక నివేదికల ప్రకారం మేడిగడ్డ వద్ద నీటిని నిల్వ చేయకపోవడానికి ప్రధాన కారణం ఆ ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన సాంకేతిక లోపాలు, భద్రతా కారణాలే. భౌగోళికంగా మేడిగడ్డకు వందల కిలోమీటర్ల దిగువన ఉండే పట్టిసీమకు నీరు అందడం అనేది గోదావరి నది సహజ ప్రవాహం, ఇతర ఉపనదుల వరద మీద ఆధారపడి ఉంటుంది తప్ప, మేడిగడ్డ గేట్లు వేయడం లేదా ఎత్తడం పై మాత్రమే ఆధారపడి లేదు.

# నవంబర్ లో లోకల్ బాడీ ఎన్నికలు

విజయవాడ, జూలై 16,ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల వేడి మొదలైంది. రాబోయే నవంబర్ నాటికి లోకల్ పోల్స్ ముగించాలనే పక్కా ప్లాన్‌తో అధికార కూటమి అడుగులు వేస్తోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇద్దరూ ఇప్పటికే తమ పార్టీల శ్రేణులకు ఈ విషయంలో స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. చట్టపరమైన, సాంకేతికపరమైన ప్రక్రియ పూర్తి కాగానే స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని, దానికి సైనికుల్లా సిద్ధం కావాలని క్షేత్రస్థాయి క్యాడర్‌ను అలర్ట్ చేశారు. ఎన్నికల ప్రకటన వచ్చిన తర్వాత సీట్ల కోసం కొట్టుకోకుండా, ముందే గ్రౌండ్ లెవెల్‌లో ఒక అవగాహనకు అంతర్గతంగా వచ్చేస్తున్నారు. గత ఎన్నికల్లో జనసేన పార్టీ వంద శాతం స్ట్రైక్ రేట్‌తో దూసుకుపోవడానికి ప్రధాన కారణం పార్టీ కోసం రక్తం చిందించిన క్షేత్రస్థాయి కార్యకర్తలే. అందుకే ఈసారి స్థానిక సంస్థల ఎన్నికల్లో వారికి ప్రాధాన్యత ఇవ్వాలని పవన్ కల్యాణ్ గట్టిగా నిశ్చయించుకున్నారు. గత ఐదేళ్లుగా వైఎస్సార్‌సీపీ అరాచకాలను ఎదుర్కొని, పార్టీ జెండా మోసిన నిజమైన లాయల్ కార్యకర్తల పూర్తి సమాచారాన్ని, వారి అర్హతలను జనసేన అధిష్ఠానం ఇప్పటికే సేకరించింది. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చాక పైరవీలు చేసేవారికి కాకుండా, కష్టపడ్డవారికే టికెట్లు దక్కుతాయి అనే నమ్మకాన్ని పవన్ కిందిస్థాయి క్యాడర్‌లో నింపారు. దీనివల్ల ఆశావహుల్లో గందరగోళం తగ్గి, పార్టీ కోసం మరింత ఉత్సాహంగా పనిచేసే వాతావరణం ఏర్పడింది.మరోవైపు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు స్థానిక సంస్థల ఎన్నికలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. ఇటీవల కుప్పం, కర్నూలు తదితర ప్రాంతాల సమీక్షా సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. లోకల్ పోల్స్‌లో విజయం సాధించడం నాన్-నెగోషియబుల్ అని తేల్చిచెప్పారు. స్థానిక ఎన్నికల్లో గెలిపించిన నేతలనే పార్టీ నెత్తిన పెట్టుకుంటుందని, ఓడిపోయిన వారిని ఎంతటి వారైనా పక్కన పెడుతుందని కఠినమైన హెచ్చరికలు జారీ చేశారు. ముఖ్యంగా తంబళ్లపల్లె వంటి నియోజకవర్గాల్లో పార్టీ ఇన్‌చార్జ్‌ల నియామకం, గ్రౌండ్ ఫీడ్‌బ్యాక్ ఆధారంగానే సీట్ల కేటాయింపు ఉంటుందని లోకేష్, బాబు స్పష్టం చేయడంతో తమ్ముళ్లలో మునుపెన్నడూ లేని సీరియస్‌నెస్ కనిపిస్తోంది.సాధారణంగా స్థానిక ఎన్నికలు అనగానే అధికార పార్టీల్లో టికెట్ల కోసం అంతర్గత కుమ్ములాటలు, తిరుగుబాట్లు కామన్. పైగా ఇక్కడ టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి కూటమిగా పోటీ చేస్తున్నాయి. ఒకే స్థానానికి ముగ్గురు అభ్యర్థులు పోటీ పడితే ఓట్లు చీలిపోయే ప్రమాదం ఉంది. ఈ ముప్పును ముందే పసిగట్టిన బాబు-పవన్ ద్వయం.. క్షేత్రస్థాయిలో ఎలాంటి గందరగోళానికి తావులేకుండా సీట్ల సర్దుబాటు ఫార్ములాను ముందే సిద్ధం చేస్తున్నారు. ఏయే గ్రామ పంచాయతీలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో ఏ పార్టీ బలంగా ఉందో ఆ పార్టీకే ఆ సీటు కేటాయించేలా.. జిల్లా స్థాయి మంత్రులు, ఇన్‌చార్జ్‌ల పర్యవేక్షణలో ముందస్తు స్క్రీనింగ్ కమిటీలు వేస్తున్నారు.సార్వత్రిక ఎన్నికల తరహాలోనే స్థానిక ఎన్నికల్లోనూ 2024 నాటి కూటమి పొత్తు సెంటిమెంట్‌ను అలాగే కొనసాగించాలని అధినాయకత్వం భావిస్తోంది. పైస్థాయిలో నేతలు కలిసి ఉన్నా, కిందిస్థాయిలో గ్రామాల్లో టీడీపీ-జనసేన క్యాడర్ కలవడం చాలా ముఖ్యం. అందుకోసమే ఉమ్మడి సమన్వయ కమిటీల ద్వారా ఇరు పార్టీల కార్యకర్తలను ఒకే తాటిపైకి తెస్తున్నారు. ఈ ముందస్తు సన్నాహాల వల్ల ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే సమయానికి కూటమి తరఫున అభ్యర్థులు దాదాపు ఖరారై ప్రచారంలో ఉంటారు. ఇది ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీని మానసికంగా మరింత డిఫెన్స్‌లోకి నెట్టేసే వ్యూహం.ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ వరుస పరాజయాలు, అంతర్గత వలసలతో డీలా పడి ఉంది. ఈ తరుణంలో నవంబర్ లోకల్ బాడీ ఎన్నికల్లో కూడా కూటమి క్లీన్ స్వీప్ చేస్తే.. విపక్షం పుంజుకునే అవకాశాలు పూర్తిగా మూసుకుపోతాయి. అందుకే చంద్రబాబు కమాండర్‌లా తానే ముందుండి నడిపిస్తానని భరోసా ఇస్తుండగా, పవన్ కల్యాణ్ పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగా గ్రామీణ ఓటర్లను ఆకట్టుకునేలా సరికొత్త అభివృద్ధి సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. అభ్యర్థుల ఎంపికలో పారదర్శకత, ముందస్తు ప్రణాళిక, క్యాడర్‌కు స్పష్టమైన గైడ్‌లైన్స్.. ఇవే నవంబర్ సమరంలో కూటమికి శ్రీరామరక్ష కానున్నాయి.

# రిటైర్ అయ్యాక మళ్లీ ఉద్యోగం...

విజయవాడ, జూలై 16, ఆంధ్రప్రదేశ్ ఆర్కైవ్స్ రిటైర్డ్ డైరెక్టర్ వి రంగరాజ్ ఉద్యోగానికి సంబంధించి ఆసక్తికర పరిణామం జరిగింది. వి రంగరాజ్ జూన్ 30న పదవీ విరమణ చేయగా.. ఆయన్ను మళ్లీ తిరిగి విధుల్లోకి తీసుకుంటూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వి రంగరాజ్‌కు 60 ఏళ్లు నిండటంతో నిబంధనల ప్రకారం గత నెల 30న పదవీ విరమణ చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలు, కార్పొరేషన్లు, సొసైటీల రెగ్యులర్ ఉద్యోగుల (ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014లోని షెడ్యూల్ 9, 10 పరిధిలోకి వస్తారు) పదవీ విరమణ వయసును 60 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు పెంచిన సంగతి తెలిసిందే. ఈ ఉత్తర్వులు 2022 జనవరి 1 నుంచి వర్తిస్తాయని తెలిపింది.ఏపీ ఆర్కైవ్స్ విభాగం కూడా ఈ పదో షెడ్యూల్ పరిధిలోకి వస్తుంది.. ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చాయి. రంగరాజ్ ఈ నెల 2న ఈ నిబంధనల ప్రకారం తనకు 62 ఏళ్ల వరకు సర్వీసు పొడిగింపు వర్తిస్తుందని ప్రభుత్వానికి జాయినింగ్ రిపోర్టు సమర్పించారు. వెంటనే ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఆయన్ను తిరిగి విధుల్లోకి చేర్చుకుంటూ ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం మీద రంగరాజ్ మరో రెండేళ్ల పాటూ తన ఉద్యోగంలో కొనసాగనున్నారు. రంగరాజ్‌లాగే మరికొందరు కూడా తిరిగి వారి పోస్టుల్లో చేరనున్నారు.ఆంధ్రప్రదేశ్‌లో 2022లో ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయసు 60 నుంచి 62కు పెంచారు. తమకు కూడా పదవీ విరమణ వయసును పెంచాలని ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు కోర్టుకు వెళ్లగా.. అక్కడ అనుకూలంగా ఆదేశాలు వచ్చాయి.రాష్ట్ర ప్రభుత్వం కూడా ఉద్యోగుల డిమాండ్‌పై అధ్యయనం చేసేందుకు మంత్రులు నారా లోకేష్, పయ్యావుల కేశవ్, నారాయణలతో ప్రభుత్వం కమిటీ వేసిన సంగతి తెలిసిందే.. ఈ కమిటీ పలుమార్లు సమావేశమై పదవీ విరమణ వయసు పెంపుపై చర్చించింది.

# అంతా గమనే... కర్త...కర్మ... క్రియ...

తిరుపతి, జూలై 15, ముసుగు తొలగిపోతోంది. తెర వెనుక ఉన్న చీకటి శక్తులు.. వెలుగులోకి వస్తున్నాయి. వారి లక్ష్యాలు.. దానికోసం ఎంచుకున్న మార్గాలు బయట పడుతున్నాయి. పైకి పెట్టింది ప్రశ్న అనే పేరు మాత్రమే.. కానీ దాని వెనుక ఉన్న పొలిటికల్ టార్గెట్లు.. కుట్రలు ఇప్పుడు బయట పడుతున్నాయి.. ఈ మొత్తం ఎపిసోడ్లో ఆటలో అరటిపండు కేవలం రావణ్ మాత్రమే. కథ మొత్తం గగనది.. దాని వెనుక ఉన్నది ఓ నాయకుడు.ప్రశ్న ఛానల్ పెట్టింది జోసెఫ్ అలియాస్ రావణ్. మొదట్లో సజావుగానే సాగింది. ఆ తర్వాత ఉద్యోగులకు జీతాలు ఇవ్వడం కూడా కష్టంగా మారింది. ఈ దశలో ప్రశ్న ఛానల్ లోకి వచ్చేసింది గగన.. సీఈవోగా మారింది. ఛానల్ వ్యవహారాలు మొత్తం తానే చూసింది. కొన్ని సందర్భాలలో రావణ్ తో కలిసి వీడియోలు చేసేది. షార్ట్స్ కూడా చేసేది. అవన్నీ కూడా పవన్ కళ్యాణ్ ను తీవ్రంగా వ్యతిరేకించే విధంగా ఉండేవి. కొన్ని సందర్భాలలో పవన్ కళ్యాణ్ అనుచరులపై వీడియోలు కూడా పెట్టేవారు.. బండ్ల గణేష్ మీద అత్యంత దారుణంగా వీడియోలు రూపొందించేవారు.గగన గన్నవరం పోలీస్ స్టేషన్లో విచారణకు హాజరైన తర్వాత.. పోలీసులు ఆమెను నిర్మానుష్యమైన ప్రాంతంలో మహిళా పోలీస్ అధికారుల సమక్షంలో విచారణ సాగించారు. ఈ నేపథ్యంలో అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. గగనది బళ్లారి ప్రాంతం. ఈమెకు రాము అనే వ్యక్తితో పెళ్లయింది. గమన ఒక బొటిక్ నిర్వహించేది. అక్కడికి ఇంద్రసేన నాయుడు వచ్చేవాడు. అలా ఇద్దరి మధ్య పరిచయం ఏర్పడింది. అది కాస్త వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఆ తర్వాత ఇంద్రసేన నాయుడుతో గగన ఉండడం మొదలుపెట్టింది. రాము మీద అనేక రకాలుగా కేసులు పెట్టింది. గగన ఒత్తిడి తట్టుకోలేక రాము ఒక దశలో ఆత్మహత్యకు ప్రయత్నించాడు. వీరిద్దరి వ్యవహారం తట్టుకోలేక రాము నేరేడుమెట్ పోలీస్ స్టేషన్లో చీటింగ్ కేసు కూడా పెట్టాడు.రాముకు పూర్తిగా దూరం జరిగిపోయిన గగన ఇంద్రసేనకు బాగా దగ్గరయింది.. వీరిద్దరూ విదేశాలకు తరచు వెళ్లేవారు. వివిధ వ్యాపారాలు మొదలుపెట్టారు. ఈ క్రమంలోనే ప్రశ్న చానల్లో కి అనూహ్యంగా ప్రవేశించాడు ఇంద్రసేన.. ఈయనకు పొలిటికల్ లక్ష్యాలు ఉండడం.. పవన్ కళ్యాణ్ అంటే విపరీతమైన ద్వేషం ఉండడంతో గగన ద్వారా కథ నడిపించాడు. గమనం ప్రశ్న ఛానల్ సీఈవోను చేశాడు. ఫండింగ్ మొత్తం ఇంద్రసేన పెట్టాడు. ఆర్థిక వ్యవహారాలు మొత్తం గగన చూసుకునేది. చివరికి స్క్రిప్ట్.. కంటెంట్ మొత్తం తను ఇచ్చేది. రావణ్ ద్వారా చదివించేది.ఈ వ్యవహారం ఇలా సాగిపోతుండగానే.. దళిత క్రైస్తవుల సభలో రావణ్ పాల్గొనడం.. పవన్ కళ్యాణ్ మీద వ్యక్తిగతంగా విమర్శలు చేయడంతో ఏపీ పోలీసులు దృష్టి సారించారు. ఆ తర్వాత రావణ్ ను అరెస్ట్ చేశారు. ఎన్ని రకాలుగా కేసులు నమోదు చేసినప్పటికీ అతనికి బెయిల్ వస్తున్న నేపథ్యంలో.. అతని ఫోన్.. డిజిటల్ ఉపకరణాలు స్వాధీనం చేసుకొని అందులో ఉన్న డేటా పరిశీలించారు. అప్పుడే పోలీసులకు దిమ్మ తిరిగిపోయింది. ఎందుకంటే దాంట్లో అనేక రకాల కుట్ర కోణాలు.. బూతు వీడియోలు.. సంభాషణలు కనిపించాయి. దీంతో పోలీసులు గగనను అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత ఇంద్రసేనతో ఆమె సాగించిన వ్యవహారం గురించి చెప్పడంతో పోలీసులకు ఫ్యూజులు ఎగిరిపోయాయిఇంద్రసేన నాయుడు సోదరుడు ఉమామహేశ్వర నాయుడు వైసీపీ నాయకుడు.. గతంలో టిడిపిలో ఉన్నప్పటికీ టికెట్ ఇవ్వడానికి చంద్రబాబు నిరాకరించారు. దీంతో ఆయన వైసీపీకి తీర్థం పుచ్చుకున్నారు. పవన్ కళ్యాణ్ మీద ఈయనకి కూడా విపరీతమైన ద్వేషం ఉండేది. సోదరుడి టార్గెట్ ఏంటో తెలుసుకున్న ఇంద్రసేన నాయుడు ప్రశ్న ఛానల్ లో పెట్టుబడులు పెట్టి.. తన సోదరుడి పొలిటికల్ కు లక్ష్యాలకు అనుగుణంగా నడిపించడం మొదలుపెట్టాడు. అందువల్ల గన్నవరం విమానాశ్రయంలో గగనకు జగన్ దర్శన భాగ్యం సులభంగానే లభించింది. దీనికి తోడు గగన రావణ్ అరెస్ట్ అయిన ఒకరోజు వ్యవధిలోనే సెల్ఫీ వీడియో విడుదల చేసింది. అందులో జగన్ కు థాంక్స్ చెప్పింది.. ఈ అంశాలను పరిశీలనలోకి తీసుకున్న పోలీసులు లోతుగా దర్యాప్తు చేయడంతో ఈ విషయాలు బయటపడ్డాయి. అయితే రావణ్ కేవలం ఆటలో అరటిపండు మాత్రమేనని.. అసలు కథ చాలా ఉందని పోలీసులు చెబుతున్నారు

# ప్లాస్టిక్ గోదాం లో భారీ అగ్ని ప్రమాదం

మీర్ పేట్ హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని మీర్పేట్ పోలీస్ స్టేషన్ పరిధి నందనవనంలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. మెట్రో బార్ సమీపంలోని ఓ ప్లాస్టిక్ గోదాంలో ఒక్కసారిగా మంటలు చలరేగి వేగంగా వ్యాపించి పక్కనే ఉన్న మరో గోదాంను, సమీప భవనంలోని ఇళ్లను కూడా ఆవరించాయి. స్థానికుల సమాచారం అందుకున్న వెంటనే మూడు అగ్నిమాపక వాహనాలు సంఘటనా స్థలానికి చేరుకుని సిబ్బంది తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనలో భారీగా ఆస్తి నష్టం జరిగినట్లు ప్రాథమిక సమాచారం. ఎలాంటి ప్రాణనష్టం జరిగినట్లు సమాచారం లేదు. అగ్నిప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ఘటనపై మీర్పేట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# డిఫెన్స్ లో ట్రబుల్ షూటర్

మెదక్ జూలై 15, తెలంగాణ రాజకీయాల్లో ప్రత్యర్థులపై నిరంతరం వాడివేడి విమర్శలు గుప్పించే బీఆర్ఎస్ ట్రబుల్ షూటర్, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు మొదటి సారి తీవ్రమైన పొలిటికల్ డిఫెన్స్లో పడినట్లు కనిపిస్తోంది. ఆయన సతీమణి తన్నీరు శ్రీనీత డైరెక్టర్గా ఉన్న ఆర్వైస్ నేచర్స్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ చుట్టూ ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త వివాదం ముదురుతోంది. మైకుల ముందు కత్తులు దూసుకునే వివిధ పార్టీల అగ్రనేతలు.. తెరవెనుక మాత్రం కోట్లాది రూపాయల వ్యాపార సామ్రాజ్యాల్లో చెట్టాపట్టాలేసుకుని తిరుగుతున్నారనే విమర్శలకు ఈ కంపెనీ తాజా లీకులు మరింత బలం చేకూరుస్తున్నాయిఈ వివాదంలో ప్రధానంగా వినిపిస్తున్న ఆరోపణ.. మార్కెట్ నెట్వర్క్ గురించినదే. సాధారణంగా ఏ ప్రైవేట్ డైరీ బ్రాండ్కైనా మార్కెట్లో నిలదొక్కుకోవడానికి సాధారణ ప్రజలు, కిరాణా షాపుల రిటైల్ వాటా ఎక్కువగా ఉండాలి. కానీ, మిల్చీ మిల్క్ బ్రాండ్కు బహిరంగ మార్కెట్లో వాటా చాలా తక్కువగా ఉన్నప్పటికీ, హైదరాబాద్లోని దాదాపు అన్ని ప్రముఖ కార్పొరేట్ ఆసుపత్రులకు ఈ కంపెనీ నుంచే భారీగా పాలు, ఇతర ఉత్పత్తులు సరఫరా అవుతుండటం ఇప్పుడు అనుమానాలకు తావిస్తోంది. రోగుల ఆరోగ్య అవసరాల నెపంతో.. నిబంధనలకు విరుద్ధంగా పొలిటికల్ ఇన్ఫ్లుయెన్స్ ఉపయోగించి ఈ బల్క్ ఆర్డర్లు దక్కించుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ రికార్డుల ప్రకారం.. ఈ కంపెనీ పెట్టుబడులు , వ్యాపార లావాదేవీల వెనుక ఆసక్తికరమైన క్రాస్-పార్టీ బంధాలు బయటపడ్డాయి. అపోలో గ్రూప్తో పాటు చేవెళ్ల బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి కుటుంబ సభ్యులు, అలాగే బీజేపీ , కాంగ్రెస్కు చెందిన మరికొందరు కీలక నేతల కుటుంబాల ప్రమేయం ఇందులో ఉందనే ప్రచారం జోరందుకుంది. రాజకీయాలు కేవలం ఓట్ల కోసమే.. వ్యాపారాల దగ్గరకు వచ్చేసరికి పార్టీల రంగులు మారిపోతాయి అంటూ నెటిజన్లు, రాజకీయ విశ్లేషకులు ఈ స్క్రీన్ వెనుక భాగస్వామ్యాలపై సెటైర్లు వేస్తున్నారు.ఈ వ్యవహారం సోషల్ మీడియాలో దుమారం రేపిన వెంటనే.. సదరు కంపెనీకి సంబంధించిన అధికారిక వెబ్సైట్ అర్ధాంతరంగా డౌన్ కావడం ఈ ఆరోపణలకు మరింత బలాన్ని చేకూర్చింది. లోపల ఉన్న ఇన్వెస్టర్ల పూర్తి వివరాలు, ప్రమోటర్ల పేర్లు ప్రజాబాహుళ్యంలోకి వెళ్లకుండా దాచేందుకే వ్యూహాత్మకంగా వెబ్సైట్ను క్లోజ్ చేశారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, అప్పటికే అలర్ట్ అయిన నెటిజన్లు పాత స్క్రీన్ షాట్లను ట్విట్టర్, వాట్సాప్ లలో షేర్ చేస్తూ.. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నేతల అంతర్గత సయోధ్యను వేలెత్తి చూపిస్తున్నారు.కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి చెప్తున్నట్లుగా బీఆర్ఎస్, బీజేపీలు తెరవెనుక ఒక్కటే అనే నినాదానికి ఇలాంటి వ్యాపార భాగస్వామ్యాలు రాజకీయంగా మరింత ఆయుధాన్ని ఇస్తున్నాయి. ఎన్నికల వేళ డ్రామాలు ఆడుతూ, లోపల మాత్రం ఇలాంటి మెగా డైరీ ప్రాజెక్టుల ద్వారా పరస్పర ఆర్థిక ప్రయోజనాలు పొందుతున్న నేతల ద్వంద్వ నీతిపై క్షేత్రస్థాయిలో తీవ్ర చర్చ నడుస్తోంది. వెబ్సైట్ డౌన్ చేసినంత మాత్రాన డిజిటల్ ఆధారాలు చెరిగిపోవని, ఈ మిల్చీ మిల్క్ వ్యాపార నెట్వర్క్, హాస్పిటల్ సప్లై వెనుక ఉన్న అసలు సత్యాలపై హరీష్ రావు బహిరంగంగా సమాధానం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాజకీయ వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి

# ఈ 20 మంటల్లో కేంద్ర ప్రభుత్వం

ముంబై, జూలై 15 (న్యూస్ పల్స్) పర్యావరణ పరిరక్షణ, ముడిచమురు దిగుమతుల భారం తగ్గింపు పేరిట కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ప్రవేశపెడుతున్న ఈ-20 పెట్రోల్ విధానం ఇప్పుడు వాహనదారుల్లో తీవ్ర వ్యతిరేకతకు దారితీస్తోంది. అంతర్జాతీయ పరిస్థితులు, ఇంధన స్వయంసమృద్ధిని సాకుగా చూపి కేంద్రం ఈ ప్రత్యామ్నాయ ఇంధనాన్ని మార్కెట్లోకి తెచ్చినప్పటికీ.. దీనిపై ప్రజల్లో కనీస అవగాహన కల్పించడంలో ఇంధన శాఖ పూర్తిగా విఫలమైందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దేశవ్యాప్తంగా బంకుల్లో సాధారణ పెట్రోల్ స్థానంలో ఇథనాల్ కలిపిన ఇంధనాన్ని బలవంతంగా పంపిణీ చేస్తుండటంతో వాహనదారులు తీవ్ర అయోమయానికి గురవుతున్నారు. ఈ విధానం వల్ల వాహనాలు పాడవుతున్నాయనే ఆందోళన పెరుగుతున్నా ప్రభుత్వం మౌనం వహించడం మరింత దుమారానికి కారణమవుతోంది.ప్రస్తుతం రోడ్లపై ఉన్న పాత తరం బీఎస్-4 , బీఎస్-6 వాహనాల్లో చాలావరకు 20 శాతం ఇథనాల్ మిశ్రమానికి అనుకూలంగా లేవు. ఇథనాల్ ఎక్కువగా ఉన్న ఇంధనాన్ని వాడటం వల్ల బైకులు, కార్లలోని ఫ్యూయల్ లైన్లు, రబ్బర్ ట్యూబులు, ఇంజన్ భాగాలు తుప్పుపట్టి దెబ్బతింటున్నాయని మెకానిక్ రంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీనికి తోడు, ఈ-20 పెట్రోల్ వాడటం వల్ల వాహనాల మైలేజీ దాదాపు 5 నుంచి 10 శాతం వరకు తగ్గిపోతోందని వాహనదారులు వాపోతున్నారు. పర్యావరణం పేరుతో ఒక అంశాన్ని ప్రజలపై రుద్దేటప్పుడు.. వారిని మానసికంగా సిద్ధం చేసి, పాత వాహనదారులకు ప్రత్యామ్నాయం చూపించకుండా నేరుగా అమలు చేయడం వల్లే ఈ తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.ప్రభుత్వ మౌనం , సరైన అవగాహన లేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని సోషల్ మీడియాలో రకరకాల ఊహాగానాలు, ప్రచారాలు ఊపందుకున్నాయి. ముఖ్యంగా దేశంలో ఇథనాల్ ప్రాజెక్టులను, పరిశ్రమలను ప్రోత్సహించడంలో కీలకపాత్ర పోషిస్తున్న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని టార్గెట్ చేస్తూ ప్రచారాలు జరుగుతున్నాయి. ఈ ఇథనాల్ ఉత్పత్తి అంతా గడ్కరీ కుటుంబ సభ్యులకు లేదా ఆయన కుమారుల వ్యాపారాలకు లబ్ధి చేకూర్చేందుకే బలవంతంగా ప్రజలపై రుద్దుతున్నారనే టాక్ నెట్టింట బలంగా ప్రచారంలోకి వెళ్లిపోయింది. సాంకేతిక పరమైన నిర్ణయాలను ప్రజలకు శాస్త్రీయంగా వివరించకపోవడం వల్లనే, ఈ పథకం కాస్తా ఒక ప్రైవేట్ వ్యాపార ప్రయోజనంగా జనం నోళ్లలో నానాల్సి వస్తోంది.ఏ ప్రజాస్వామ్య ప్రభుత్వమైనా పెద్ద మార్పులను తీసుకువచ్చేటప్పుడు వినియోగదారులకు ఎంపిక చేసుకునే హక్కును కల్పించాలి. కానీ ఈ-20 విషయంలో కేంద్రం తాము ఏం చేసినా ప్రజలు భరించక తప్పదనే రీతిలో వ్యవహరించిందనే విమర్శలు వస్తున్నాయి. బంకుల్లో ఈ-10 లేదా సాధారణ పెట్రోల్ దొరక్కపోవడంతో వాహనదారులు గత్యంతరం లేక ఈ-20 వాడాల్సి వస్తోంది. ఏ పర్యావరణ ప్రయోజనాల కోసం ఈ పథకాన్ని తెచ్చారో, దానికి భిన్నంగా వాహనాల రిపేర్ ఖర్చులు భరించలేక సామాన్యుడు తీవ్ర అసంతృప్తితో ఉన్నాడు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి బంకుల్లో స్వచ్ఛమైన పెట్రోల్ను కూడా అందుబాటులో ఉంచడంతో పాటు, వాహనాల భద్రతపై స్పష్టమైన భరోసా ఇవ్వాల్సి ఉంది.

## మెదక్లో కల్తీ పాల ముఠా గుట్టురట్టు

మెదక్ నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి గ్రామంలో కృత్రిమ పాలు తయారీ కేంద్రంపై టాస్క్ఫోర్స్ దాడులు నిర్వహించారు. కల్తీ పాలు తయారు చేస్తుండగా నిందితులను పట్టుకున్నారు.150 లీటర్ల కల్తీ పాలు, మిల్క్ పౌడర్, తయారీ సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను

## జమ్మూలో బీజేపీ వర్సెస్ నేషనలిస్ట్ కాంగ్రెస్

శ్రీనగర్ జూలై 15 (న్యూస్ పల్స్) జమ్మూ కాశ్మీర్ లో రాజకీయాలు ఒక్కసారిగా మారిపోయాయి. బీజేపీ తన పార్టీ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి, తన ప్రభుత్వాన్ని అస్థిరపరచాలని చూస్తున్నాయని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా సంచలన ప్రకటన చేశారు. "ఆపరేషన్ లోటస్" పేరుతో తమ ప్రభుత్వాన్ని అస్థిరపచాలని చూస్తున్నారని సంచలన ఆరోపణలు చేశారు.బీజేపీకి చెందిన ఓ కీలక నేత, సుప్రీంకోర్టు న్యాయవాది మా పార్టీ ఎమ్మెల్యేను రహస్యంగా కలిశారు. పార్టీ మారితే రూ.20 కోట్ల నుంచి రూ.30 కోట్ల నగదు, మంత్రి పదవి ఇస్తామని, జమ్మూ కశ్మీర్కు పూర్తి రాష్ట్ర హోదా కల్పిస్తామని ఆశ చూపారు. కానీ మా ఎమ్మెల్యేల విశ్వాసాన్ని, నిబద్ధతను వారు కొనలేకపోయారు. రూ.100 కోట్లు ఇచ్చినా నేషనల్ కాన్ఫరెన్స్ నేతలు అమ్ముడుపోరు. బలహీనులుగా భావించి వెనుక ద్వారం గుండా అధికారంలోకి రావాలని బీజేపీ చూస్తోంది" అని తీవ్రంగా విమర్శించారు.జమ్మూ కాశ్మీర్ సీఎం ఒమర్ తమపై లేనిపోని అభాండాలు మోపుతున్నారని బీజేపీ మండిపడింది. రూ.100 కోట్ల పరువు నష్టం దావా వేస్తామని హెచ్చరిస్తూ సీఎం ఒమర్ కి బీజేపీ లీగల్ నోటీసులు కూడా పంపింది. ఒమర్ అబ్దుల్లా ఆరోపణలను బీజేపీ ఖండించింది. ఒమర్ అబ్దుల్లా చేసిన వ్యాఖ్యలు పూర్తిగా నిరాధారమైనవని పార్టీ జాతీయ అధికార ప్రతినిధి సుధాంశు త్రివేది పేర్కొన్నారు. తమపై చేసిన ఆరోపణలకు వెంటనే ఆధారాలు చూపాలని, లేకపోతే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆ తర్వాత బీజేపీ తరఫున ఒమర్ అబ్దుల్లాకు అధికారిక లీగల్ నోటీసు పంపారు. ఆరోపణలను నిరూపించలేకపోతే లేదా బహిరంగ క్షమాపణ చెప్పకపోతే రూ.100 కోట్ల పరువు నష్టం దావా దాఖలు చేస్తామని నోటీసులో పేర్కొన్నారు.

# నేపాల్ లో జెన్ జీ రచ్చ

ఖాట్మాండుజూలై 15 నేపాల్ రాజకీయాల్లో సంచలన మార్పులతో అధికార పీఠాన్ని కైవసం చేసుకున్న కొత్త ప్రభుత్వానికి కేవలం మూడున్నర నెలలకే తీవ్ర ప్రజా వ్యతిరేకత ఎదురవుతోంది. గత సెప్టెంబర్లో జెన్-జి నడిపిన ఉవ్వెత్తున లేచిన ఉద్యమం అప్పటి కేపీ శర్మ ఓలీ ప్రభుత్వాన్ని కుప్పకూల్చింది. ఆ యువ విప్లవం సృష్టించిన ప్రభంజనంతోనే మార్చిలో జరిగిన ఎన్నికల్లో రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ ఏకంగా 182 స్థానాలను గెలుచుకుని చారిత్రాత్మక విజయాన్ని సాధించింది. దీంతో కాఠ్మాండూ మాజీ మేయర్, యువ నేత బాలేంద్ర బాలెన్ షా ప్రధానమంత్రిగా పగ్గాలు చేపట్టారు. కానీ, ఏ యువతైతే తమ ఆకాంక్షలను నెరవేరుస్తాడని ఆయన్ను పీఠంపై కూర్చోబెట్టిందో, ఇప్పుడు అదే యువత ఆయన తీసుకుంటున్న కఠిన నిర్ణయాలపై రోడ్లపైకి వచ్చి పోరాడుతుండటం గమనార్హం.ఈ తాజా సంక్షోభానికి కాఠ్మాండూ పాస్పోర్ట్ కార్యాలయం వద్ద జరిగిన గణేష్ నేపాలీ అనే యువకుడి ఆత్మహత్యే ప్రధాన కారణమైంది. దుబాయ్ వెళ్లాలనే కలలతో ప్రభుత్వ ఉద్యోగానికి సిద్ధమవుతున్న ఆ రైడ్-షేరింగ్ కార్మికుడి బైక్ ను పోలీసులు లాక్ చేయడంతో తీవ్ర మనస్తాపానికి గురై పెట్రోల్ పోసుకుని ఆత్మబలిదానం చేసుకున్నాడు. వారం రోజుల ముందే పోలీసులు అతని బైక్ను సీజ్ చేసి 1,000 జరిమానా విధించినట్లు తెలుస్తోంది. దీనికి తోడు, ఎలాంటి ప్రత్యామ్నాయ పునరావాసం చూపించకుండా దాదాపు 2,600 మంది భూమిలేని పేద కుటుంబాలను నిర్వాసితులను చేయడం, వరదల్లో స్వచ్ఛందంగా సేవలు అందించిన యువతపై పోలీసులు లాఠీచార్జ్ చేయడంతో జనం ఆగ్రహం కట్టలు తెంచుకుంది.కాఠ్మాండూ మేయర్గా ఉన్నప్పుడు అక్రమ కట్టడాల కూల్చివేతలతో పాపులారిటీ తెచ్చుకున్న ఆయన, అదే బుల్డోజర్ తరహా క్లీనప్ పాలనను జాతీయ స్థాయిలో రుద్దాలని చూస్తూ పేదల పొట్టకొడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. పెద్దల అవినీతిని అంతమొందించి, ఉద్యోగాలు కల్పిస్తారనే నమ్మకంతో యువత ఓటేస్తే.. ప్రభుత్వం మాత్రం కఠినమైన ట్రాఫిక్ నిబంధనలు, భారీ జరిమానాలతో చిరు వ్యాపారులు, వలస కార్మికులను వేధిస్తోందనే అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఒకే తప్పుకు మున్సిపల్ పోలీసులు 1,000, ట్రాఫిక్ పోలీసులు 500 చొప్పున వేర్వేరు చట్టాల కింద జరిమానాలు వసూలు చేస్తుండటం ఇక్కడి వ్యవస్థాగత గందరగోళానికి అద్దం పడుతోంది.ఈ మొత్తం వ్యవహారంలో ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మున్సిపల్ ఎన్ఫోర్స్మెంట్ సంస్కృతిని నిర్మించింది స్వయంగా మాజీ మేయర్ అయిన ప్రధాని బాలెన్ షాయే. సంక్షోభం ఇంతలా ముదురుతున్నా ప్రధాని మౌనం వహించడం, కేవలం సోషల్ మీడియా ఇమేజ్తోనే దేశాన్ని నడపలేరని విమర్శకులు విమర్శిస్తున్నారు. రోజుకు 1,500 మంది ఉపాధి కోసం దేశం విడిచిపోతున్న నేపాల్ దయనీయ స్థితికి గణేష్ నేపాలీ ఉదంతం ఒక ప్రత్యక్ష నిదర్శనంగా నిలిచింది. అయితే పదవి చేపట్టి కొద్ది నెలలు కాక ముందే అద్భుతాలు చేసేయాలని అనుకోవడం కష్టమని జెన్ జీ భావించడం లేదు. అక్కడే సమస్య వస్తోంది.

# కాంగ్రెస్ ను ముంచేస్తున్న అంతర్గత శత్రువులు

హైదరాబాద్, జూలై1 5,కాంగ్రెస్ పార్టీకి శత్రువులు ఎక్కడో ఉండరని, ఆ పార్టీలోనే ఉంటారనేది రాజకీయాల్లో తరచూ వినిపించే మాట. ఇప్పుడు తెలంగాణ కాంగ్రెస్లో జరుగుతున్న పరిణామాలు ఈ వ్యాఖ్యలను అక్షరాలా నిజం చేస్తున్నాయి. పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ, అంతర్గత అసంతృప్తులు, బహిరంగ విమర్శలు కాంగ్రెస్ సర్కార్ను తీవ్ర ఇబ్బందుల్లోకి నెడుతున్నాయి. తాజాగా ఫైర్బ్రాండ్ నాయకురాలు, రాజ్యసభ ఎంపీ రేణుకా చౌదరి, సీనియర్ నేత, ఎమ్మెల్సీ విజయశాంతి చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి. విపక్షాలకు ఆయుధాలు అందిస్తూ, సొంత ప్రభుత్వంపైనే వీరు గురిపెట్టడం ఇప్పుడు హాట్ టాపిక్గా మారింది.ఎమ్మెల్యే క్వార్టర్స్లో కాంగ్రెస్ హైకమాండ్ ప్రతినిధి మీనాక్షి నటరాజన్తో ఎంపీ రేణుకా చౌదరి భేటీ కావడం రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. ముఖ్యంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా తాజా రాజకీయాలపై వీరి మధ్య సుదీర్ఘ చర్చ జరిగింది. అయితే ఈ భేటీ అనంతరం రేణుకా చౌదరి చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ శ్రేణులను ఉలిక్కిపడేలా చేశాయి.రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు మళ్లీ పుంజుకుంటున్నాయని, కాంగ్రెస్ నాయకత్వం ఇప్పటికైనా మేలుకోవాలని ఆమె ఘాటుగా హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో ఎక్కడెక్కడ కాంగ్రెస్ నేతలు అసంతృప్తిగా ఉన్నారో ఆ విషయాన్ని బీజేపీ నేతలు పసిగడుతున్నారని, వారిని తమ వైపు తిప్పుకునేందుకు వ్యూహాలు రచిస్తున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీలో చాలా సమస్యలు ఉన్నాయని, వాటన్నింటిపై అధిష్ఠానంతో మాట్లాడతానని రేణుక స్పష్టం చేయడం ద్వారా.. పార్టీలో అంతా సజావుగా లేదనే సంకేతాన్ని ఆమె బహిరంగంగానే పంపించారు.మరోవైపు, సీనియర్ నేత విజయశాంతి సోషల్ మీడియా వేదికగా షాబాద్ నరమేధం ఉదంతాన్ని ప్రస్తావిస్తూ సొంత ప్రభుత్వంపై, పోలీస్ శాఖపై తీవ్ర విమర్శలు గుప్పించారు. షాబాద్ ఘోర కలికలిలో హంతకుడు ఆత్మహత్య చేసుకోవడంతో పోలీసులు ఈ కేసు ముగిసిందని భావించడంపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు.ఈ కేసులో అసలు లోపాన్ని వేలెత్తి చూపుతూ.. పోక్సో కేసులో అరెస్ట్ అయిన నిందితుడు రాజ్ కుమార్ బెయిల్పై విడుదల కావడానికి పోలీసుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. నిందితుడి నుంచి లంచం తీసుకుని పోలీసులు అతడి విడుదలకు సహకరించారన్న వార్తలు పత్రికల ద్వారా తెలిసి తెలంగాణ మహిళా లోకం షాక్కు గురవుతోందని విజయశాంతి పేర్కొన్నారు. పోలీసుల చేసిన ఈ ఘోర తప్పిదం వల్లే, బయటకు వచ్చిన నిందితుడు ఏకంగా ఆరుగురి ప్రాణాలను కడతేర్చడానికి ఆస్కారం ఏర్పడిందని ఆమె తీవ్రంగా మండిపడ్డారు.మహిళలకు ప్రాధాన్యత ఇస్తామని చెబుతున్న కాంగ్రెస్ పాలనలో ఈ ఘటనను అత్యంత సీరియస్గా పరిగణించాలని ఆమె డిమాండ్ చేశారు. పోలీస్ శాఖలోని ఇలాంటి అవినీతి, లోపాల వల్ల తెలంగాణలో మహిళా భద్రతపై అనుమానాలు తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తూ.. ఒక మహిళా ప్రజాప్రతినిధిగా శాంతిభద్రతల విషయంలో కఠినంగా వ్యవహరించాలని కోరారు.

# రెండు చోట్ల రేవంత్ ఓటు...

హైదరాబాద్, జూలై1 5, రాష్ట్రంలో చట్టాలను, నిబంధనలను పటిష్టంగా అమలు చేయాల్సిన ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న రేవంత్ రెడ్డి పేరిట రెండు వేర్వేరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటు హక్కు నమోదై ఉండటం ఇప్పుడు తెలంగాణ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. బాధ్యతాయుతమైన అత్యున్నత పదవిలో ఉన్న ఒక వ్యక్తి పేరు, రెండు వేర్వేరు పార్లమెంటరీ పరిధులలోని ఓటర్ల జాబితాలో కనిపించడం సంచలనం సృష్టిస్తోంది. అధికారిక ఓటరు నమోదు డేటా ద్వారా ఈ విషయం స్పష్టమవడంతో, సోషల్ మీడియా వేదికగా నెటిజెన్లు, రాజకీయ విశ్లేషకులు దీనిపై రకరకాలుగా ఆరా తీస్తున్నారు.ప్రస్తుత ఓటర్ల జాబితా రికార్డుల ప్రకారం.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రెండు చోట్ల ఓటు హక్కు ఉన్నట్లు తెలుస్తోంది.

ప్రస్తుత ఓటర్ల జాబితా రికార్డుల ప్రకారం.. మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానం పరిధిలోకి వచ్చే కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గంలో రేవంత్ రెడ్డి ఓటరుగా నమోదై ఉన్నారు. అదే సమయంలో నాగర్ కర్నూల్ పార్లమెంట్ స్థానం పరిధిలోని అచ్చంపేట అసెంబ్లీ నియోజక వర్గం ఓటర్ల జాబితాలో కూడా ఆయన పేరు స్పష్టంగా కనిపిస్తోంది. ఈ రెండు చోట్లా ఉన్న ఓటరు నమోదు పత్రాలలో ఆశ్చర్యకరంగా ఒకే ఒక ఎలక్షన్ ఐడీ కార్డ్ నంబర్ (టీఈూ0274035) ఉండటం గమనార్హం. అచ్చంపేట పరిధిలోని వాంగూర్ మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలోని ఆయన నివాస గృహ నంబర్ 3-48 అడ్రస్‌తో ఒక ఓటు ఉంటే.. కొడంగల్ పరిధిలో హౌస్ నంబర్ 1-209 అడ్రస్‌తో రెండో ఓటు నమోదై ఉంది.

1. కొడంగల్ నియోజకవర్గం: మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానం పరిధిలోకి వచ్చే కొడంగల్‌లో హౌస్ నంబర్ 1-209 అడ్రస్‌తో ఆయన ఓటు నమోదై ఉంది.

2. అచ్చంపేట నియోజకవర్గం: నాగర్ కర్నూల్ పార్లమెంట్ స్థానం పరిధిలోని అచ్చంపేట నియోజకవర్గం, వాంగూర్ మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలోని ఆయన ఇంటి నంబర్ 3-48 అడ్రస్‌తో మరో ఓటు నమోదై ఉంది.

అయితే, ఇందులో అత్యంత ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. ఈ రెండు వేర్వేరు నియోజకవర్గాల్లోని ఓటర్ల జాబితాలోనూ రేవంత్ రెడ్డికి ఒకే ఒక ఎలక్షన్ ఐడీ కార్డ్ నంబర్ (ఝూ0274035) ఉండటం గమనార్హం.ఈ డబుల్ ఎంట్రీ రికార్డులలో ముఖ్యమంత్రి పేరు స్పెల్లింగ్‌లో కూడా తప్పులు దొర్లాయి. ఆయన పేరు అసలు స్పెల్లింగ్ "ఖీవలజీనిబిష్ఠ" కాగా.. రెండు నియోజకవర్గాల ఓటర్ల జాబితాలోనూ నరసింహా రెడ్డి కుమారుడైన "ఒనిబీఎబీశ్రీజీ ఖీవలజీనిబి ఖీవటటఎ" అని నమోదై ఉంది.సాధారణంగా ఇలాంటి స్పెల్లింగ్ తప్పులను సరిదిద్దుకోవడానికి నిబంధనల ప్రకారం సంబంధిత ఓటర్ రిజిస్ట్రేషన్ అధికారికి ఫామ్-8 సమర్పించాల్సి ఉంటుంది. అలాగే, 1950 నాటి ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం.. ఏ పౌరుడూ కూడా ఒకటి కంటే ఎక్కువ నియోజకవర్గాల ఓటర్ల జాబితాలో ఓటరుగా నమోదు చేసుకోవడానికి అర్హుడు కాదనే కఠినమైన నిబంధన ఉంది. ఈ బహుళ ఓటు నమోదును తొలగించుకోవడానికి, తాము సాధారణంగా నివసించని నియోజకవర్గ పరిధిలోని అధికారికి స్వచ్ఛందంగా ఫామ్-7 సమర్పించి, ఒక ఓటును రద్దు చేయాలని కోరే చట్టపరమైన అవకాశం ఓటరుకు ఉంటుంది.దేశంలో బహుళ ఓట్ల నమోదు అంశంపై చట్టం చాలా కఠినంగా వ్యవహరిస్తోంది. రెండు చోట్ల ఒకే వ్యక్తికి ఓటు ఉంటే ఏడాది జైలు శిక్ష తప్పదని ఇటీవలే ఎన్నికల సంఘం ప్రకటించింది. గతంలో ప్రముఖ నటుడు ప్రకాష్ రాజ్ కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు వంటి బహుళ రాష్ట్రాల్లో ఓటరుగా నమోదయ్యారనే ఆరోపణలపై బెంగళూరు కోర్టు నాన్-బెయిలబుల్ అరెస్ట్ వారెంట్ జారీ చేయడం, ఆ తర్వాత ఆయన బెయిల్ పొంది చట్టపరమైన విచారణను ఎదుర్కొంటుండటం మనకు తెలిసిందే.

ఈ నేపథ్యంలోనే, ముఖ్యమంత్రి ఓటరు నమోదు డేటాలోనూ ఇలాంటి డబుల్ ఎంట్రీలు బయటపడటంతో.. "సీఎం రేవంత్ రెడ్డికి కూడా ఏడాది కాలం జైలుశిక్ష పడే అవకాశం ఏమైనా ఉందా?" అంటూ నెటిజెన్లు, ప్రతిపక్షాలు ఆరా తీస్తున్నాయి. అత్యున్నత పదవిలో ఉన్న నేతలకు సంబంధించిన ఓటరు డేటాలోనే ఇలాంటి లోపాలు ఉండటం అధికారుల నిర్లక్ష్యమా లేక సాంకేతిక పొరపాటా అనే కోణంలో విశ్లేషణలు సాగుతున్నాయి. ఏది ఏమైనా, ఈ 'డబుల్ ఓటు' వ్యవహారం ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతోంది.

# గులాబీ రెడ్ పాలిటిక్స్..

హైదరాబాద్, జూలై1 5, తెలంగాణలో రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ముందుకు రావడం లేదని, ప్రాజెక్టులకు నీటిని విడుదల చేయడం లేదని ఆరోపిస్తూ.. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ ఎస్ పార్టీ బ్లెడ్ పాలిటిక్స్(రక్త రాజకీయం) కు తెరదీసింది. సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ రైతుల రక్తం చవిచూస్తున్నారని ఆరోపిస్తున్న బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్.. సీఎంకు కావాలంటే తమ రక్తం ఇస్తామని, రైతులను ఆదుకోవాలని ఎక్స్ వేదికగా కామెంట్లు చేశారు.అనంతరం.. జూబ్లీహిల్స్‌లోని బీఆర్ఎస్ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ విద్యార్థి, యువజన విభాగం కార్యకర్తలు రక్తదాన శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల్లో పలువురు విద్యార్థులు రక్తం దానం చేశారు. అనంతరం.. ఈ రక్తాన్ని సచివాలయానికి తీసుకువెళ్లి.. సీఎం రేవంత్ రెడ్డికి ఇచ్చి.. నిరసన తెలపాలని నిర్ణయించారు. ఈ క్రమంలో పోలీసులు బీఆర్ ఎస్ విద్యార్థి, యువజన విభాగం కార్యకర్తలను అడ్డుకుని రక్తం బాటిళ్లు, ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా ఇరు పక్షాల మధ్య తీవ్ర వాగ్యుద్ధం నడిచింది. అయినప్పటికీ.. పోలీసులు మరింత మందిని రంగంలోకి దింపి బీఆర్ఎస్ కార్యకర్తలను అడ్డుకున్నారు. ఇదిలావుంటే.. అసలు ఇంత రాజకీయం అవసరమా? అనేది పరిశీలకుల మాట. రైతులను ఆదుకునే విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా వెనుకబడే ఉందని పలువురు గుర్తు చేస్తున్నారు. రాజకీయం చేసేందుకు అనేక అంశాలు ఉన్నాయని రైతులకు నీటిని విడుదల చేయకపోతే.. ఆ మేరకు మరో మార్గం ఎంచుకోవాలని చెబుతున్నారు.ఇక, బీఆర్ఎస్ బ్లెడ్ పాలిటిక్స్‌పై కాంగ్రెస్ తీవ్రంగా మండిపడింది. గతంలో బీఆర్ఎస్ పాలకులు రైతులకు సంకెళ్లు వేసి జైలుకు తరలించిన ఫొటోలను సోషల్ మీడియాలో పోస్టు చేయడం గమనార్హం. నల్గొండ, మహబూబాబాద్ వంటి జిల్లాల్లో రైతులు.. గిట్టుబాటు ధర కోసం రోడ్డెక్కితే లాఠీలతో ఎలా కొట్టించారో చూడండి.. అంటూ.. నాటి ఫొటోలను పోస్టు చేశారు. అంతేకాదు.. రైతులపై నాడు మంత్రి చేసిన వ్యాఖ్యలను కూడా ఈ సందర్భంగా ప్రస్తావించడం గమనార్హం. మొత్తంగా బీఆర్ ఎస్ బ్లెడ్ పాలిటిక్స్ ఎవరికి మేలు చేస్తాయో చూడాలి.

# అభివృద్ధి కోసం కేంద్రాన్ని టార్గెట్ చేసిన సీఎం!

హైదరాబాద్, జూలై 15, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధిని పార్టీ రాజకీయాలకు అతీతంగా చూడాలని సూచించిన తర్వాత బీజేపీ ఎంపీలు ఆయనతో సమావేశమయ్యారు. ఈ సమావేశం రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల అనుమతులు, కేంద్ర నిధులు వంటి అంశాలపై దృష్టి సారించింది. రేవంత్ రెడ్డి ఈ సమావేశం తర్వాత ఢిల్లీ ప్రయాణం వ్యూహం అభివృద్ధి ప్రాధాన్యతను స్పష్టం చేస్తోంది. రాజకీయ భేదాలను పక్కన పెట్టి రాష్ట్ర ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేస్తుంది. ఇది సాధారణంగా వ్యతిరేక పక్షాల మధ్య సహకారం అరుదైన సందర్భంలో ముఖ్యమైనది. రాష్ట్ర అభివృద్ధి పనులు కేంద్ర ప్రభుత్వ అనుమతులు, నిధులపై ఆధారపడి ఉండటంతో ఇలాంటి సమన్వయం అవసరం.ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి వంటి బీజేపీ ఎంపీలు సమావేశానికి హాజరవడం సానుకూల అంశం. వారు పెండింగ్ ప్రాజెక్టుల అనుమతులు, నిధుల విడుదలపై దృష్టి పెట్టాలని కోరడం రాష్ట్ర సమస్యలపై ఉమ్మడి ఆందోళనను చూపిస్తుంది. ఇది రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో చర్చలు జరపడానికి ఒక మద్దతు వేదికగా మారవచ్చు. అయితే ఇది పూర్తి స్థాయి రాజకీయ సహకారం కాదని, నిర్దిష్ట అంశాలపై మాత్రమే సమన్వయం అని అర్థం చేసుకోవాలి.కిషన్ రెడ్డి, బండి సంజయ్, అర్వింద్ వంటి ప్రముఖ బీజేపీ నాయకులు హాజరు కాకపోవడం ఈ వ్యూహానికి ఒక సవాల్ గా కనిపిస్తుంది. ఇది బీజేపీలో అంతర్గత వ్యూహాలు, వేరే ప్రాధాన్యతలు లేదా రాజకీయ ఒత్తిళ్లను సూచిస్తోంది. ప్రతిపక్షంగా ఉన్నప్పుడు పూర్తి స్థాయి సహకారం ఇవ్వడం కష్టం కావడం సహజం.

ఈ గైర్హాజరు రేవంత్ రెడ్డి చేస్తున్న ప్రయత్నాలకు పూర్తి మద్దతు లభించకపోవచ్చుని, లేదా బీజేపీ వైపు నుంచి వేరే విధానం అనుసరించే అవకాశం ఉంది.రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లి కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న అనుమతులు, నిధుల కోసం ప్రయత్నించడం ఈ వ్యూహంలో కీలక భాగం. రాష్ట్రాలు కేంద్ర నిధులు, అనుమతులపై ఎంతగా ఆధారపడి ఉంటాయో ఇది గుర్తు చేస్తుంది. ఈ ప్రయాణం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ భేదాలు పక్కన పెట్టి కేంద్రంతో సమన్వయం చేసుకునే ప్రయత్నం చేస్తోంది.రేవంత్ రెడ్డి ఈ వ్యూహం ద్వారా రాజకీయ పరిపక్వతను చూపించారు.

రాష్ట్ర అభివృద్ధి అనేది ఒక్క పార్టీ సాధించగలిగేది కాదు. కేంద్ర-రాష్ట్ర సమన్వయం అవసరమైనప్పుడు ఇలాంటి చర్చలు ఉపయోగకరంగా ఉంటాయి. బీజేపీలోని కొందరు ఎంపీల హాజరు ఈ ప్రయత్నానికి కొంత మద్దతు ఇస్తుంది. రేవంత్ రెడ్డి వ్యూహం రాజకీయాల కంటే అభివృద్ధిని ముందుంచి చూస్తున్నట్లు కనిపిస్తోంది.

దీని విజయం ఢిల్లీలో ఎంత మేరకు నిధులు, అనుమతులు సాధించగలుగుతారనే దానిపై ఆధారపడి ఉంటుంది.

## బాల్కనీ పైనుంచి కింద పడ్డ తల్లీకూతురు

బాల్కనీ పైనుంచి కిందపడి తల్లీకూతురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన గుజరాత్‌లో చోటుచేసుకుంది. సూరత్ లింబాయత్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఇంటి బాల్కనీకి రైలింగ్ లేకపోవడంతో తల్లీకూతురు కిందపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే కూతురు లేచి స్పృహ కోల్పోయిన తల్లికి సాయం చేయడానికి ప్రయత్నించారు. స్థానికుల సాయంతో క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు నెట్టింట వైరలవుతున్నాయి.

# సగం మంది టీచర్లే టెట్ పాస్

హైదరాబాద్, జూలై 15, ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఫలితాలు విడుదలవగా.. రాష్ట్రవ్యాప్తంగా కేవలం 43.94 శాతం మంది అభ్యర్థులు మాత్రమే అర్హత సాధించి తీవ్ర నిరాశపరిచారు. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ అధికారికంగా ఈ రిజల్ట్స్‌ను విడుదల చేయగా.. పరీక్ష రాసిన 1.15 లక్షల మందిలో సగం మంది కూడా క్వాలిఫై కాలేకపోయారు. ముఖ్యంగా ప్రస్తుతం విధుల్లో ఉంటూ పరీక్ష రాసిన ఇన్-సర్వీస్ ప్రభుత్వ ఉపాధ్యాయులలో ఏకంగా 14,814 మంది ఫెయిల్ కావడం విద్యాశాఖనుగ్ర్భ్రాంతికి గురిచేసింది. వీరంతా 2028 ఆగస్టు వరకు పాస్ కాకపోతే వీరి ఉద్యోగాలు పోయే అవకాశం ఉంది తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఫలితాలు విడుదల అయ్యాయి. ఈసారి ఫలితాల్లో అభ్యర్థులు తీవ్రంగా నిరాశపరిచారు. పరీక్ష రాసిన వారిలో సగం మంది కూడా క్వాలిఫై కాలేదు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 43.94 శాతం మంది మాత్రమే అర్హత సాధించారు. హైదరాబాద్‌లోని పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్‌లో టెట్ కన్వీనర్ జి. రమేశ్, టెట్ డైరెక్టర్ రేవతిరెడ్డిలతో కలిసి పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ ఈ ఫలితాలను అధికారికంగా విడుదల చేశారు. మొత్తం 1,15,028 మంది పరీక్షకు హాజరుకాగా.. కేవలం 50,544 మంది మాత్రమే క్వాలిఫై అయ్యారు. ముఖ్యంగా ప్రభుత్వ ఉపాధ్యాయులు అయితే సగం కంటే తక్కువ మంది పాస్ కావడం గమనార్హం.సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జీటీ) పోస్టుల కోసం నిర్వహించిన పేపర్-1 పరీక్షలో 65.29 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో 36,129 మంది పరీక్ష రాయగా 23,590 మంది పాస్ అయ్యారు. అయితే స్కూల్ అసిస్టెంట్ పోస్టుల కోసం నిర్వహించిన పేపర్-2లో ఫలితాలు చాలా ఘోరంగా ఉన్నాయి. పేపర్-2లో మొత్తం 78,899 మంది పరీక్ష రాస్తే కేవలం 26,954 మంది మాత్రమే అర్హత సాధించారు. ఇందులో మ్యాథ్స్ అండ్ సైన్స్ విభాగంలో 40.76 శాతం (17,987 మంది) ఉత్తీర్ణత సాధించగా.. సోషల్ స్టడీస్ విభాగంలో అత్యల్పంగా 25.79 శాతం (8,967 మంది) మంది మాత్రమే క్వాలిఫై కావడం గమనార్హం.మరోవైపు ప్రస్తుతం విధుల్లో ఉంటూ ఈ పరీక్ష రాసిన ఇన్-సర్వీస్ ప్రభుత్వ ఉపాధ్యాయుల ఫలితాలు మరింత ఆందోళనకరంగా ఉన్నాయి. మొత్తం 23,623 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు పరీక్షకు హాజరుకాగా.. కేవలం 8,809 మంది (37.29%) మాత్రమే క్వాలిఫై అయ్యారు. ఏకంగా 14,814 మంది ఉపాధ్యాయులు ఫెయిల్ కావడం విద్యాశాఖ వర్గాలను విస్మయానికి గురిచేసింది. గతేడాది ప్రభుత్వ టీచర్ల పాస్ పర్సంటేజ్ 50 శాతంగా ఉండగా.. ఈసారి అది 37.29 శాతానికి పడిపోయింది. ఇన్-సర్వీస్ టీచర్లలో పేపర్-1లో 52.57 శాతం, పేపర్-2 మ్యాథ్స్ అండ్ సైన్స్‌లో 38.27 శాతం, సోషల్‌లో అత్యంత దారుణంగా 24.05 శాతం మంది మాత్రమే పాస్ అయ్యారు.సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం.. విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయులు 2028 ఆగస్టు నాటికి ఖచ్చితంగా టెట్ పరీక్ష పాస్ కావాల్సి ఉంటుంది. ఒకవేళ ఈ డెడ్‌లైన్‌లోగా టెట్ క్వాలిఫై కాకపోతే వారు తమ ప్రభుత్వ ఉద్యోగాలను కోల్పోవాల్సి వస్తుంది. అయితే తాజా పరీక్షలో 14 వేల మందికి పైగా టీచర్లు ఫెయిల్ కావడంతో వారి ఉద్యోగ భద్రతపై తీవ్రమైన ఆందోళన నెలకొంది.

# కాజీపేటలోఇంటర్‌సిటీ రైళ్ల తయారీ

వరంగల్, జూలై 15, తెలంగాణలోని కాజీపేట రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ నెక్స్ట్ జనరేషన్ ఇంటర్‌సిటీ రైళ్ల తయారీ కేంద్రంగా అవతరించనుంది. రూ. 521 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఈ ప్లాంట్ పనులు 95 శాతం పూర్తయ్యాయి. గంటకు 130 కిమీ వేగంతో దూసుకెళ్లే ఈ రైళ్లను 300 కిమీ పరిధిలోని నగరాల అనుసంధానానికి వాడనున్నారు. ఐదేళ్లలో 200 రైల్‌సెట్లను తయారు చేయాలని రైల్వే లక్ష్యంగా పెట్టుకుంది. ఇక్కడ వందే భారత్ కోచ్‌ల తయారీకీ వీలుండగా.. ఈ ప్రాజెక్ట్ వల్ల రాష్ట్రంలో 3 వేల మందికి ఉపాధి లభించనుంది.

ముంబై, ఢిల్లీ, చెన్నై, బెంగళూరు వంటి దేశంలోని ప్రధాన నగరాల మధ్య నడిచే నెక్స్ట్ జనరేషన్ అత్యాధునిక ఇంటర్‌సిటీ ప్యాసింజర్ రైళ్లు త్వరలోనే తెలంగాణ రాష్ట్రం నుంచి పట్టాలెక్కబోతున్నాయి. ఇందుకు సంబంధించి చారిత్రాత్మక రైల్వే ఉత్పాదక కేంద్రంగా మారేందుకు కాజీపేట రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ సర్వసిద్ధమవుతోంది. కాజీపేట కర్మాగారంలో సరికొత్త ఇంటర్‌సిటీ కోచ్‌ల తయారీ కోసం చెన్నైకి చెందిన ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ త్వరలోనే అంతర్జాతీయ టెండర్లను పిలవనుంది. దాదాపు రూ. 521 కోట్ల భారీ అంచనా వ్యయంతో అత్యాధునిక సాంకేతికతతో నిర్మితమవుతున్న ఈ భారీ రైల్వే ఉత్పాదక కేంద్రం పనులు చివరి దశకు చేరుకున్నాయి. రానున్న కొద్ది నెలల్లోనే ఈ కర్మాగార నిర్మాణ పనులు పూర్తిగా పూర్తి కానున్నాయి.గరిష్ఠంగా గంటకు 130 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా రూపొందించిన ఈ ఆధునిక రైళ్లను.. ప్రధానంగా 300 కిలోమీటర్ల లోపు ఉండే స్వల్ప, మధ్యస్థ దూర ప్రయాణాల కోసం ఉపయోగించనున్నారు. ఇవి పొరుగున ఉన్న పట్టణాలు, నగరాల మధ్య అత్యంత వేగవంతమైన, సౌకర్యవంతమైన కనెక్టివిటీని అందిస్తాయి. రాబోయే ఐదేళ్ల కాలంలో కాజీపేట కేంద్రంగా దాదాపు 200 ఇంటర్‌సిటీ రైల్‌సెట్లను తయారు చేయాలని భారతీయ రైల్వే శాఖ లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఇక్కడ వాణిజ్యపరమైన ఉత్పత్తి ప్రారంభమైన తర్వాత.. తదుపరి తరం ప్రయాణికుల రోలింగ్ స్టాక్ తయారీలో ఈ తెలంగాణ ఫ్యాక్టరీ దేశంలోనే అతిపెద్ద హబ్‌లలో ఒకటిగా అవతరించనుంది. కాజీపేట రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌లో ఇప్పటికే 95 శాతం నిర్మాణ పనులు విజయవంతంగా పూర్తయ్యాయని, ఈ ఏడాది చివరి నాటికి ఇక్కడ ఉత్పత్తి ప్రారంభమయ్యే అవకాశం ఉందని దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులు తెలిపారు. అంతేకాకుండా.. ఈ కర్మాగారంలోనే వందే భారత్ కోచ్‌లతో పాటు అన్ని రకాల ఆధునిక ప్రయాణికుల రైళ్లను తయారు చేసేందుకు వీలుగా ఫ్లెక్సిబుల్ డిజైన్‌ను రూపొందించినట్లు ఆయన వివరించారు.

రోజూ ప్రయాణించే ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారవేత్తల అవసరాలను తీర్చేలా, తక్కువ ఖర్చుతో కూడిన షటిల్ సర్వీసులుగా ఈ ట్రైన్లను రైల్వే శాఖ ప్రవేశపెట్టనుంది. ఈ రైళ్లలో ప్రయాణికుల కోసం అనేక రకాల అత్యాధునిక సదుపాయాలు కల్పించనున్నారు. ప్రతి రైలులో మొత్తం 20 కోచ్‌లు ఉంటాయి. వీటిలో ఆటోమేటిక్ ప్లగ్ డోర్లు, మెరుగైన వెంటిలేషన్ సిస్టమ్‌లు, ప్రమాదాల తీవ్రతను తట్టుకునేలా క్రాష్‌వర్తీ కోచ్ డిజైన్‌ను అమర్చనున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం ప్రతి కోచ్‌కు ఇరువైపులా రెండేసి చొప్పున బయో-టాయిలెట్లను ఏర్పాటు చేయనున్నారు. ఈ కర్మాగారం ద్వారా స్థానికంగా దాదాపు 3 వేల మందికి పైగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

# సీఎం చంద్రబాబుకు బిగ్ రిలీఫ్



అమరావతి అసైన్డ్ భూముల వ్యవహారంలో సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణకు హైకోర్టులో ఊరట లభించింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏపీ అసైన్డ్ భూముల బదిలీ నిరోధక చట్టం, ఐపీసీ సెక్షన్ల కింద సీఐడీ నమోదు చేసిన కేసును హైకోర్టు కొట్టివేసింది. దీంతో ఇరువురు నేతలకు ఈ సుదీర్ఘ చట్టపరమైన వివాదం నుండి పెద్ద ఉపశమనం లభించినట్లయింది.

## హాస్టల్ విడిచి బయటకు వచ్చిన ఇంటర్ విద్యార్థులు

మంచిర్యాల జిల్లా చెన్నూరులోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకులంలో వసతుల సమస్యలతో 17 మంది ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మంగళవారం రాత్రి హాస్టల్ విడిచి బయటకు వచ్చారు. ఎమ్మెల్యే సతీమణి సురేఖను కలిసి తమ ఇబ్బందులను వివరించారు. విద్యార్థుల సమస్యలను విన్న సురేఖ, వారిని జిల్లా కో-ఆపరేటివ్ అధికారి శ్రీధర్కు అప్పగించి, సురక్షితంగా చెన్నూరుకు తరలించేలా చర్యలు తీసుకున్నారు. గురుకులంలో వసతులను మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు.

# ముద్రగడ కూతురును అడ్డుకున్న కాపు నేతలు

హైదరాబాద్ కాపు నేత ముద్రగడ పద్మనాభం తో కూతురు క్రాంతి విభేదించిన సంగతి తెలిసిందే. గతంలో జరిగిన పవన్ కల్యాణ్ తుని సభలో క్రాంతి పాల్గోన్నారు. పవన్ కు ఆమెమద్దతు తెలపడంతో తండ్రీకూతుళ్ల బంధం విడిపడింది. - కాపుల నాయకుడు పవన్ అని క్రాంతి చెప్పగా తాను చనిపోయినా కూతురు రావడానికి వీల్లేదన్న ముద్రగడ అన్నారు. మంగళవారం ముద్రగడ మృతి చెందడంతో అక్కడికి అయినా క్రాంతి రావడంతో తల్లి, అభిమానులు అడ్డుకున్నారు. పోలీసులు క్రాంతిని బలవంతంగా కారులో తరలించారు.

# తిరుమలలో ఆక్టోపస్ కమాండోల మాక్ డ్రిల్

తిరుమలలో భక్తుల భద్రతే ధ్యేయంగా ఆక్టోపస్ కమాండోలు, రాష్ట్ర పోలీస్ శాఖ, టీటీడీ విజిలెన్స్ విభాగం సంయుక్తంగా భారీ మాక్ డ్రిల్ నిర్వహించాయి. తిరుమలలోని పీఏసీ?4 సత్రాన్ని ఉగ్రవాదులు ముట్టడించినట్లుగా ఊహించి ఈ ఆపరేషన్ చేపట్టారు. అత్యవసర సమయాల్లో భద్రతా బలగాలు ఉగ్రవాదులను ఎలా అదుపులోకి తీసుకుంటాయి, భక్తులను ఎలా సురక్షిత ప్రాంతాలకు తరలిస్తాయి వంటి అంశాలను ప్రాక్టికల్గా ప్రదర్శించారు.

# కాపు సమాజానికి తీరని లోటు

# ముద్రగడ మృతిపై సోము వీర్రాజు

విజయవాడ బీజేపీ నేత సోము వీర్రాజు ప్రముఖ నాయకులు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం భావపూర్వక శ్రద్ధాంజలి ఘటించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో, ముఖ్యంగా తూర్పుగోదావరి జిల్లా రాజకీయాల్లో తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్న సీనియర్ నాయకులు ముద్రగడ పరమపదించారనే వార్త నన్ను ఎంతగానో కలచివేసిందని అన్నారు.

శాసనసభ్యుడిగా, మంత్రిగా, ఎంపీగా ఆయన ప్రజలకు అందించిన సేవలు అనన్యసామాన్యం. విలువలతో కూడిన రాజకీయాలు చేస్తూ, నమ్మిన సిద్ధాంతం కోసం, తన సామాజిక వర్గ సంక్షేమం కోసం ఆయన సాగించిన ఉద్యమాలు నిరుపమానం. ఆయన మరణం రాష్ట్ర రాజకీయాలకే కాక, యావత్ కాపు సమాజానికి తీరని లోటు. వారి ఆత్మకు సద్గతులు కలగాలని ఆ సర్వేశ్వరుడిని వేడుకుంటూ... ఈ కష్టసమయంలో వారి కుటుంబ సభ్యులకు, అనుచరులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని అన్నారు.

## మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి హౌస్ అరెస్ట్

నిజామబాద్ మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తలపెట్టిన నిరాహార దీక్షను పోలీసులు అడ్డుకున్ఆరు. ఈ నేపథ్యంలో అయనను హౌస్ అరెస్టు చేసారు. నియోజకవర్గంలో ఉదయం నుంచి బీఆర్ఎస్ పార్టీ శ్రేణులను ఎక్కడికక్కడ గృహనిర్బంధాలతో పాటు అరెస్టు చేసి పలు పోలీస్ స్టేషన్లకు తరలించారు. భీంగల్ మున్సిపాలిటీ అభివృద్ధితో పాటు 100 పడకల ఆసుపత్రి నిర్మాణం, ఆర్టీసీ డిపో పునరుద్ధరణపై కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా నిరాహార దీక్ష చేయాలని ప్రశాంత్ రెడ్డి నిర్ణయించారు.

# మైలవరంలో అర్ధరాత్రి మెరుపు దాడులు..

# రేషన్ బియ్యం లారీ సీజ్

మైలవరంలో గత అర్ధరాత్రి పోలీసులు జరిపిన మెరుపు దాడుల్లో భారీగా అక్రమ రేషన్ బియ్యం పట్టుబడింది. మైలవరం, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం ప్రాంతాల్లో రేషన్ బియ్యం సేకరించి బాగుచేసి, వెల్వడంలో లారీకి లోడ్ చేస్తుండగా పోలీసులు దాడి చేశారు. ఆవుల శివారెడ్డికి చెందిన లారీలో తరలిస్తున్న 25 టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. లారీని అదుపులోకి తీసుకొని, నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధాకర్ వెల్లడించారు.

# ఇసుక, కంకర (గ్రావెల్) అక్రమ తవ్వకాలు,

# రవాణా పై కఠిన చర్యలు

**అనుమతి పొందిన ప్రతి వాహనానికి విండ్‌స్క్రీన్‌పై పర్మిట్ తప్పనిసరి**

**అక్రమాలకు పాల్పడితే రీచ్‌ల అనుమతులు రద్దు చేస్తాం**

**జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్**

**రెవెన్యూ, మైనింగ్ శాఖలతో సమన్వయంతో సంయుక్త దాడులు**

**:జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు**

తిరుపతి, జూలై 15: జిల్లాలో ఇసుక, కంకర (గ్రావెల్) అక్రమ తవ్వకాలు, అక్రమ రవాణా ద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టే చర్యలను ఏమాత్రం ఉపేక్షించబోమని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ మిని కాన్ఫిరెన్స్ హాలు నందు రెవెన్యూ, మైనింగ్, పోలీస్, రవాణా, నీటిపారుదల తదితర శాఖల అధికారులతో ఇసుక, కంకర తవ్వకాల నియంత్రణ, అనుమతులు, రవాణా, పర్యవేక్షణ, అమలు చర్యలపై జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు సంయుక్తంగా సమీక్షా సమావేశం నిర్వహించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అనుమతి లేని ప్రాంతాల్లో ఇసుక, కంకర తవ్వకాలు, అక్రమ నిల్వలు, అక్రమ రవాణా జరగకుండా సంబంధిత శాఖలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు మాత్రమే తవ్వకాలు, రవాణా జరిగేలా క్షేత్రస్థాయిలో పటిష్ట పర్యవేక్షణ చేపట్టాలన్నారు. అనుమతులు పొందిన ఇసుక రీచ్‌లు, క్వారీల నుంచి ఖనిజాలను తరలించే ప్రతి వాహనానికి సంబంధిత అనుమతి పత్రాన్ని (పర్మిట్) విండ్ స్క్రీన్‌పై తప్పనిసరిగా ప్రదర్శించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాహనాల నమోదు సంఖ్యలతో కూడిన పూర్తి జాబితాను రెవెన్యూ, పోలీస్, రవాణా శాఖలకు అందజేయాలని సూచించారు. ప్రతి వాహనం ఆన్‌లైన్ బిల్లు, అనుమతి పత్రాలతోనే రవాణా చేయాలని స్పష్టం చేశారు. రెవెన్యూ, మైనింగ్, పోలీస్, రవాణా శాఖలు పరస్పర సమన్వయంతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని, అనుమతులు లేని వాహనాలు, అక్రమ తవ్వకాలపై తక్షణమే కేసులు నమోదు చేసి వాహనాలను స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. అక్రమాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు పునరావృతం కాకుండా సమర్థవంతమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు




చేయాలన్నారు. సరిహద్దు ప్రాంతాలు, చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలని సూచించారు. రెవెన్యూ, పోలీస్, మైనింగ్ శాఖలు సంయుక్త టాస్క్‌ఫోర్స్‌గా పనిచేసి అందిన ప్రతి సమాచారంపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

చెక్‌పోస్టులు, కీలక రహదారుల వద్ద ఆకస్మిక తనిఖీలు నిర్వహించి అక్రమ రవాణాను అరికట్టాలని తెలిపారు. స్వర్ణముఖి నది పరివాహక ప్రాంతంతో పాటు ఇతర జలవనరుల వద్ద అనుమతించిన హద్దులను దాటి ఇసుక తవ్వకాలు జరగకుండా నీటిపారుదల, రెవెన్యూ శాఖలు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించిన రీచ్‌లు, వాహనాలపై ఎలాంటి రాజీ లేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అనుమతి పొందిన రీచ్‌కు చెందిన వాహనం అక్రమ రవాణాలో పట్టుబడితే సంబంధిత రీచ్ అనుమతిని రద్దు చేయడంతో పాటు అవసరమైతే తాత్కాలికంగా సస్పెండ్ చేసే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. స్థానిక ప్రజల గృహ నిర్మాణ అవసరాల కోసం ప్రభుత్వ నిబంధనల మేరకు జరిగే చిన్నస్థాయి ఇసుక రవాణాకు ఇబ్బందులు కలిగించవద్దని, అయితే పెద్ద ఎత్తున అక్రమ నిల్వలు, డంపింగ్ చేసి టిప్పర్ల ద్వారా అక్రమంగా తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బారాయుడు మాట్లాడుతూ అక్రమ ఇసుక, కంకర రవాణా పై జిల్లా పోలీసు యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. రెవెన్యూ, మైనింగ్ శాఖలతో సమన్వయం చేసుకుని సంయుక్త దాడులు నిర్వహిస్తామని తెలిపారు. అక్రమ రవాణా, తవ్వకాలలో పాల్గొనే వ్యక్తులు, వాహనాలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, ఎటువంటి ఒత్తిళ్లకు తావులేకుండా నిబంధనలను అమలు చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లాలో ఇసుక, కంకర అవసరాలు, ప్రభుత్వ అభివృద్ధి పనులకు సరఫరా, జాతీయ రహదారుల నిర్మాణ పనులకు అవసరమైన ఖనిజాల లభ్యత, అనుమతుల ప్రక్రియ, అక్రమ తవ్వకాల నివారణకు చేపట్టాల్సిన చర్యలు, శాఖల వారీగా బాధ్యతలు, నిరంతర పర్యవేక్షణ వ్యవస్థపై సవివరంగా చర్చించారు. ఈ సమావేశంలో తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ఆర్డీవోలు రామ్మోహన్, భానుప్రకాశ్ రెడ్డి, దేవేంద్ర రెడ్డి, జిల్లా రవాణా అధికారి మురళీ మోహన్, గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ బాలాజీ నాయక్, ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్టు డైరెక్టర్లు (తిరుపతి, చిత్తూరు నెల్లూరు, చెన్నై), నీటిపారుదల శాఖ ఎస్ఈ, ఈఈలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మాచర్ల రూరల్ సీఐగా ఎం.వేణు బాధ్యతలు స్వీకరణ




మాచర్ల, :పల్నాడు జిల్లా మాచర్ల మండల రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎం.వేణు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక దృష్టి సారిస్తానని అన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, బాధితులకు న్యాయం చేసేలా విధులు నిర్వహిస్తానని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం తప్పదన్నారు. శాంతి భద్రతల పరిరక్షణె తమ ధ్యేయం అన్నారు. ఈ నేపథ్యంలో నూతన సీఐ వేణును రూరల్ పరిధిలోని పలువురు ఎస్సైలు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

## కడప జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సవితమ్మ ని మర్యాదపూర్వకంగా కలిసిన బద్వేల్ నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ మంచూరు



బద్వేలు జమ్మలమడుగు నియోజకవర్గంలో దాల్మియా సిమెంట్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన కడప జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సవితమ్మ ని ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ బద్వేలు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి మంచూరు సూర్యనారాయణ రెడ్డి బద్వేల్ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదములు తెలిపారు

## గిద్దలూరు పట్టణంలోని ఫ్లెక్స్ ప్రింటింగ్ షాపుల యజమానులతో పోలీసుల సమావేశం నిర్వహించిన మార్కాపురం డిఎస్పి యు నాగరాజు.




గిద్దలూరు పట్టణంలోని ఫ్లెక్స్ ప్రింటింగ్ షాపుల యజమానులతో గిద్దలూరు పోలీసులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగాడీఎస్పీ యు. నాగరాజు మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రజల శాంతి భద్రతలకు భంగం కలిగించే వివాదాస్పద చిత్రాలు, వ్యాఖ్యలు, బ్యానర్లు, ఫ్లెక్సీలను ఎట్టి పరిస్థితుల్లోనూ ముద్రించవద్దని సూచించారు. అదేవిధంగా, ముద్రణకు ముందు ప్రతి ఫ్లెక్స్‌లోని విషయాన్ని తప్పనిసరిగా పరిశీలించి, చట్టానికి విరుద్ధమైన లేదా అభ్యంతరకరమైన అంశాలు ఉన్నట్లయితే వాటిని ముద్రించకూడదని స్పష్టం చేశారు. ఎస్పీ జారీ చేసిన మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని ఫ్లెక్స్ ప్రింటింగ్ షాపుల యజమానులకు సూచించారు.

# సీఎం రేవంత్ రెడ్డి ఓటుపై జోరుగా వార్తలు

# రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక ప్రకటన



హైదరాబాద్ సీఎం రేవంత్ రెడ్డి ఓటుకు సంబంధించి సోషల్ మీడియాలో వస్తున్న వార్తలపై రాష్ట్ర ఎన్నికల సంఘం ఎట్టకేలకు స్పష్టతనిచ్చింది. రేవంత్ రెడ్డి పేరు ఒకే ఎపిక్ నంబర్‌తో రెండు ఓటర్ జాబితాలలో కనిపించడం కేవలం సాంకేతిక లోపం మాత్రమేనని ఈసీ అధికారులు స్పష్టం చేసింది. ఈ మేరకు ఫ్యాక్ట్ చెక్ తెలంగాణ ఓ అధికారిక ప్రకటనను విడుదల చేసింది. అయితే, రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సార్ ప్రక్రియలో భాగంగా ఇలాంటి డూప్లికేట్ ఎంట్రీలను గుర్తించి, ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనల మేరకు సంబంధిత జిల్లా ఎన్నికల అధికారి డీఈవో ఈ సాంకేతిక లోపాన్ని సరిచేస్తారని స్పష్టం చేశారు. ఇక ఒకే ఎపిక్ నంబర్ రెండు వేర్వేరు ఓటరు జాబితాల్లో ఉన్నంత మాత్రాన..సదరు వ్యక్తికి రెండు నియోజకవర్గాల్లో ఓటు వేసే హక్కు లేదని ఎన్నికల క్లారిటీ ఇచ్చారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఇలాంటి పొరపాట్లు కామన్ అని వాటన్నింటినీ త్వరలోనే జాబితా నుంచి తొలగిస్తామని రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు పేర్కొన్నారు.

## పోగొట్టుకున్న 10 సెల్ ఫోన్లు బాధితులకు అందచేత

## పిడుగురాళ్ల అర్బన్ సిఐ వెంకట్రావు



పిడుగురాళ్ల, పల్నాడు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పిడుగురాళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో 2023, 2024, 2025, 2026 సంవత్సరంలో సెల్ ఫోన్ లు పోగొట్టుకున్న బాధితులను కనుగొని, ఆయా బాధితులకు మొత్తం 10 సెల్ ఫోన్లను వారికి అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా పోలీస్ శాఖ నుంచి తమ సెల్ ఫోన్లు అందుకున్న బాధితులు పల్నాడు జిల్లా ఎస్పీ కి మరియు పిడుగురాళ్ల సిఐ వెంకట్రావు కి కృతజ్ఞతలు తెలిపి ఆనందం వ్యక్తపరిచారు.

## గుంటూరులో ప్రారంభమైన సిపిఐ రాజకీయ శిక్షణా తరగతులు

## ప్రారంభించిన సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు



గుంటూరు పట్టణం లోని సిపిఐ కార్యాలయంలోని వీఎస్‌కే హాలు, మల్లయ్య లింగం భవన్‌లో జూలై 15 నుంచి 17 వరకు సీపీఐ గుంటూరు జిల్లా సమితి సభ్యులు, శాఖ కార్యదర్శులు, ప్రజాసంఘాల బాధ్యుల కోసం మూడు రోజుల రాజకీయ శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. బుధవారం తొలి రోజు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు ముప్పాళ్ల నాగేశ్వరరావు పాల్గొని శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఒక ప్రత్యేక గుర్తింపు ఉన్న సిపిఐ పార్టీ ప్రజా బలాన్ని సాధించడానికి సైదాంతికంగా, రాజకీయంగా, క్రమశిక్షణ పరంగా ఉన్నత స్థాయిలో నిలబెట్టడానికి రాజకీయ శిక్షణ తరగతులు ఎంతో అవసరమని ముప్పాళ్ళ అన్నారు. నిరంతరం ప్రజలతో మమేకమై సిపిఐ వైపుకి ఆకర్షించడానికి ప్రజలతో నిత్య సంబంధాలు, సైద్ధాంతిక నిబద్ధత, క్రమశిక్షణ అవసరమన్నారు. వాటిని ఈ మూడు రోజులు శిక్షణా తరగతులలో నేర్చుకోవడానికి వచ్చిన గొప్ప అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. అనంతరం మార్క్సిజం అంటే ఏమిటి? అనే అంశాన్ని సిపిఐ సీనియర్ నాయకులు కామ్రేడ్ బి.రామయ్య బోధించారు. ఈ తరగతులకు సిపిఐ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ కోట మాల్యాద్రి అధ్యక్షత వహించగా, సిపిఐ నగర కార్యదర్శి ఆకిటి అరుణ్ కుమార్ ప్రిన్సిపాల్ గా వ్యవహరించారు.




## చింతపల్లి అమరావతి కాలేజీలో విద్యార్థిని అనుమానాస్పద మృతి



అరకులోయ అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి అమరావతి కాలేజీలో చదువుతున్న ఇంటర్మీడియట్ విద్యార్థిని కాకరి మేరీ వయసు 16 సంవత్సరాలు. మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరు లేని సమయంలోఅనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందడం విషాదకర సంఘటనగా మారింది.మృతురాలు జీకే వీధి మండలం జెర్రిల పంచాయతీ పరిధిలోని నీట్టామామిడిపాలెం గ్రామానికి చెందిన కాకరి మేరీ .గా గుర్తించారు.ఈ ఘటనపై ఆదివాసి గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి సాగిన చిరంజీవి ఎస్ ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి జీవన్ కృష్ణ. స్పందిస్తూ, విద్యార్థిని మృతికి గల కారణాలపై పోలీసులు, ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మృతికి బాధ్యులైన వారిని గుర్తించి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుని శిక్షించాలని కోరారు.

## నిజామాబాద్ నుండి యూ.కేకు బియ్యం ఎగుమతులు

## లాంఛనంగా జెండా ఊపి ప్రారంభించిన కలెక్టర్




నిజామాబాద్, జూలై 15 భారత్?యునైటెడ్ కింగ్‌డమ్ మధ్య అమల్లోకి వచ్చిన సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం ద్వారా ఎగుమతులకు లభిస్తున్న అవకాశాలను వినియోగించుకుంటూ నిజామాబాద్ నగరంలోని గజానన్ రైస్ మిల్ యాజమాన్యం యునైటెడ్ కింగ్‌డమ్‌కు బియ్యం ఎగుమతులకు అనుమతులు సాధించింది. ఈ మేరకు గజానన్ రైస్ మిల్లు నుండి యూ.కే కు ఎగుమతి అవుతున్న సోనా మసూరి ఎక్స్పోర్ట్ క్వాలిటీ బియ్యం నిల్వలతో కూడిన వాహనాలకు కలెక్టర్ ఇలా త్రిపాఠి లాంఛనంగా జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సీఈటీఏ అమలుతో భారతీయ వ్యవసాయ ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లలో మరింత ప్రాధాన్యత లభిస్తోందని తెలిపారు. ముఖ్యంగా తెలంగాణలో నాణ్యమైన వరి ఉత్పత్తికి ప్రసిద్ధి చెందిన నిజామాబాద్ జిల్లా నుంచి యూకేకు బియ్యం ఎగుమతులు ప్రారంభం కావడం జిల్లాకు గర్వకారణమని అన్నారు.అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నాణ్యమైన బియ్యాన్ని ఉత్పత్తి చేసి విదేశాలకు ఎగుమతి చేయడం ద్వారా రైతులకు మెరుగైన ధరలు లభించడంతో పాటు జిల్లాకు మంచి గుర్తింపు వస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని దేశాలకు కూడా జిల్లా నుంచి వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు పెరిగేలా అధికారులు, ఎగుమతిదారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరస్వామి, ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్, గజానన్ రైస్ మిల్ ప్రతినిధి హితేష్ తదితరులు పాల్గొన్నారు.

### ఎన్యూమరేషన్ ఫారంల సమర్పణకు సమీపించిన గడువు

### త్వరితగతిన ఫారంలను బీ.ఏల్.ఓలకు అందజేయాలి

### కలెక్టర్ ఇలా త్రిపాఠి

నిజామాబాద్, జూలై 15 : ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా ఎన్యూమరేషన్ ఫారంల సమర్పణకు గడువు ముగియనున్న నేపథ్యంలో ఓటర్లు త్వరితగతిన తమ ఫారంను బీ.ఎల్.ఓలకు అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. వివరాలను డిజిటలైజ్ చేయాల్సి ఉందన్నారు. అంతేకాకుండా ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెత్/డిలీటెడ్ (ఏ.ఎస్.డీ)ఓటర్ల జాబితాను సైతం రూపొందించాల్సి ఉన్నందున చివరి నిమిషం వరకు వేచి చూడకుండా వెంటదివెంట ఎన్యూమరేషన్ ఫారాలను బీ.ఎల్.ఓలకు అందించాలని అన్నారు. ప్రత్యేకించి నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం పరిధిలోని ఓటర్లు ఫారం అందజేసే విషయంలో తాత్సారం చేయవద్దని సూచించారు. ఎన్యూమరేషన్ ఫారం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే ఓటరు జాబితా నుండి పేరు గల్లంతు అవుతుందని తెలిపారు. ఒకవేళ ఎవరికైనా గత 2002 ఎస్ఐఆర్ వివరాలు తెలియకపోతే సర్కిల్ వారీగా నెలకొల్పిన హెల్ప్ డెస్క్ ను, లేదా బీఎల్ఓ లను సంప్రదించాలని సూచించారు. అయినప్పటికీ వివరాలు తెలియని పక్షంలో ప్రస్తుత ఓటరు జాబితా వివరాలు పొందుపరచి ఫారం సమర్పించవచ్చని అన్నారు. అలాంటి వారి పేరు కూడా ముసాయిదా ఓటరు జాబితాలో చేర్చబడుతుందని తెలిపారు.

## టాలీవుడ్ స్టార్ శ్రీలీల చేతుల మీదుగా

## “ది సిగ్నేచర్ సిల్క్స్” షోరూమ్ ప్రారంభం



అత్యుత్తమ సిల్క్ చీరలు, డిజైనర్ ఎథ్నిక్ వేర్, బ్రైడల్ కలెక్షన్స్, పండుగల ప్రత్యేక వస్త్రాలకు ప్రీమియం గమ్యస్థానంగా నిలిచే ది సిగ్నేచర్ సిల్క్స్ తన నూతన షోరూమ్‌ను కెపిహెచ్బి లో టాలీవుడ్ ప్రముఖ నటి శ్రీలీల ముఖ్య అతిథిగా విచ్చేసి షోరూమ్‌ను ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి వినియోగదారులు, ఫ్యాషన్ అభిమానులు, శ్రేయోభిలాషులు పెద్ద ఎత్తున హాజరై సందడి చేశారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో డైరెక్టర్ ప్రకాశ్ సింగ్ గెహ్లాట్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ నరేందర్ సింగ్ గెహ్లాట్ పాల్గొని అతిథులను ఆహ్వానించారు. సంప్రదాయ మరియు ఆధునిక శైలుల సమ్మేళనంతో అత్యుత్తమ నాణ్యత కలిగిన వస్త్రాలను వినియోగదారులకు ఒకే వేదికపై అందించాలనే తమ లక్ష్యాన్ని వారు వివరించారు.ఈ సందర్భంగా మాట్లాడిన శ్రీలీల, ది సిగ్నేచర్ సిల్క్స్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, షోరూమ్‌లో అందుబాటులో ఉన్న అద్భుతమైన సిల్క్ చీరలు, బ్రైడల్ మరియు డిజైనర్ కలెక్షన్లను ప్రశంసించారు. హైదరాబాద్‌లో సిల్క్ చీరలు, వివాహ వేడుకల దుస్తులు మరియు పండుగల ప్రత్యేక వస్త్రాల కొనుగోలుకు ఈ షోరూమ్ ప్రముఖ గమ్యస్థానంగా ఎదగాలని ఆకాంక్షించారు.

## సహకార వ్యవస్థ బలోపేతం కాంగ్రెస్ సర్కార్ లక్ష్యం

## సహకార సంఘ నూతన భవనం ప్రారంభోత్సవంలో కవ్వంపల్లి



కరీంనగర్ రైతులకు మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో సహకార వ్యవస్థ బలోపేతానికి చిత్త శుద్ధితో కృషి చేస్తున్నదని మానకొండూరు ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు.బెజ్జంకి మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) భవనాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, గ్రామీణ ప్రాంతాల్లో సహకార వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నదని చెప్పారు. రైతులకు మెరుగైన సేవలు అందించడంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. నూతన భవనం ద్వారా రైతులకు ఒకే చోట రుణాలు, వ్యవసాయ సంబంధిత సేవలు, సంక్షేమ పథకాల అమలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. రైతులు సహకార సంఘాల సేవలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయాభివృద్ధికి తోడ్పడాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. అనంతరం భవనంలోని కార్యాలయ గదులను పరిశీలించి, అధికారులు రైతులకు పారదర్శకంగా, వేగవంతంగా సేవలు అందించాలని ఎమ్మెల్యే సూచించారు.ఈ కార్యక్రమంలో బెజ్జంకి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్ తన్నీరు శరత్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీపీ ఒగ్గు దామోదర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్, జిల్లా పార్టీ కార్యదర్శి అక్కరవేణి పోచయ్య ముదిరాజ్ తదితరులతోపాటు సహకార సంఘ డైరెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీరాష్ట్ర ఆర్థిక పరిస్థితి అధ్వాన్నంగా ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తున్నదని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ స్పష్టం చేశారు.

బుధవారం బెజ్జంకి మండల పరిషత్ సమావేశ మందిరంలో ఆయన వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్వాకం వల్ల రాష్ట ఖజానా ఖాళీ అయ్యిందని, ఆర్థికపరమైన సమస్యలు ఉన్నప్పటకీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నదని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూర్చేందుకు కృషి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు అండ నిలవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఒగ్గు దామోదర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, పార్టీ జిల్లా కార్యదర్శి అక్కరవేణి పోచయ్య ముదిరాజ్, మండల పార్టీ అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు గూడెల్లి శ్రీకాంత్ తోపాటు వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు,పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.పాఠశాల తనిఖీబెజ్జంకి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మానకొండూర్ ఎమ్మెల్య డాక్టర్ కవ్వంపల్లి సత్యారాయణ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. వంట గది శుభ్రత, వంటల్లో శుచి గురించి వంటవాళ్లను అడిగి తెలుసుకోవడమే కాకుండా తగు సూచనలు చేశారు. సీసీ రోడ్డు పనులకు భూమిపూజబెజ్జంకి మండల కేంద్రంలో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ బుధవారం భూమి పూజ చేశారు. అంతకు ముందు ఆయన ముత్తన్నపేట గ్రామంలో నిర్మించతలపెట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. నిర్ణీత గడువులోగా ఆయా సీసీ రోడ్డు నిర్మాణాలు పూర్తి చేయించాలని, పనుల నాణ్యతను పర్యవేక్షించాలని ఆయన సంబంధిత అధికారులకు సూచించారు.పరామర్శ బెజ్జంకి మండల కేంద్రంలో ఇటీవల మరణించిన జంగిటి రాజయ్య కుటుంబ సభ్యులను మానకొండూర్ ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణ పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా రాజయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

## మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన చొర్ పల్లి

## ఉప సర్పంచ్ ఆత్రం నిలకాంత్ వార్డ్ సభ్యులు

## కండువా కప్పి పార్టీలో ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు

కొమురం భీం లింగపూర్ మండలం లింగపూర్ బీఆర్ఎస్ పార్టీకి భారీ షాక్‌లింగపూర్ మండలం చొరపల్లి గ్రామపంచాయతీ లో బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు అనంతరం ఉప సర్పంచ్ నిలకాంట్ మాట్లాడుతూ మాట్లాడుతూ నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అభిరుద్ది చూసి కాంగ్రెస్ పార్టీలో చేరాం అని అన్నారు ప్రజా సంక్షేమ కార్యక్రమాలు అభిరుద్ది లక్ష్యాలపై విశ్వాసంతో పార్టీలో చేరినట్లు తెల్పారు గ్రామ స్థాయి కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తాం తెల్పారు ఈ కార్యక్రమంలో సభ్యులు ఆత్రం మనిక్ రావు చత్రు పంద్రా నగేష్ మడవి రాంశావ్ జైవంత్ రావు విశ్వనాథ్ చిరంజీవి తదితరులు ఉన్నారు

# వేములవాడలో సిటా మూడు రోజుల శిక్షణ ముగింపు



**వేములవాడ ప్రజాబలం ప్రతినిధి, జూలై 15:** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలోని భీమేశ్వర సదన్‌లో తెలంగాణ దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెంపుల్ అడ్మినిస్ట్రేషన్ (సిటా) నిర్వహించిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది.

జూలై 13 నుంచి 15 వరకు జరిగిన ఈ శిక్షణలో సుమారు 100 మంది దేవాదాయ శాఖ ఉద్యోగులు, అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు. హిందూ ఆలయ సంస్కృతి, శైవాగమం, దేవాలయ పరిపాలన, గో సంరక్షణ, సామాజిక ఆడిట్ వంటి అంశాలపై నిపుణులు అవగాహన కల్పించారు.ముగింపు కార్యక్రమంలో దేవస్థానం ఈవో ఎల్. రమాదేవి పాల్గొన్న వారికి శిక్షణ ధృవీకరణ పత్రాలు అందజేశారు. భక్తులకు మెరుగైన సేవలు అందించడంలో ఈ శిక్షణ ఉపయోగపడుతుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ, డీఈవో నవీన్ కుమార్, ఈఈ రాజేష్ తదితరులు పాల్గొన్నారు



# విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ



**జహీరాబాద్, జూలై 15 ప్రజాబలం ప్రతినిధి:** సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలం దిగ్వాల్ గ్రామంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులకు సామాజిక సేవకుడు వేణుగోపాల్ గౌడ్ విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. తన సొంత ఖర్చుతో విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, పలకలు, బలపాలు, వాటర్ బాటిళ్లను అందజేసి అభినందనలు అందుకున్నారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ, విద్యార్థులు అందించిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. భవిష్యత్తులో కూడా విద్యార్థుల ప్రోత్సాహానికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనాథ్ జోషి, ఉపాధ్యాయుల బృందం, అడ్వకేట్ విద్యాసాగర్, నాగరాజ్, సత్యనారాయణ ముదిరాజ్, శ్రీనివాస్, బ్రహ్మం, ప్రవీణ్ సాగర్, గిరి తదితరులు పాల్గొన్నారు.

## వికారాబాద్ పట్టణాన్ని అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

## మున్సిపాలిటీ చైర్మన్ గడ్డం అనన్య



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతి జులై 15(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:**వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీ గడ్డం అనన్య

ఏడవ వార్డు లోని గుడుపల్లిలో రెండు బోర్లకు, 32 వ వార్డులో రెండు బోర్లకు, 10వ వార్డు మధు కాలనీలో సిసి రోడ్డుకు, 11వ వార్డు గిరిగేట్ పల్లి, జాంబపూర్ తాండాలో రెండు బోర్లు, సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీ గడ్డం అనన్య మరియు పెద్దలు నాయకులు ప్రజలు



స్థానిక కౌన్సిలర్లు, నాయకులు, మున్సిపల్ అధికారులు, కాలనీ ప్రజలు శంకుస్థాపన కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నట్టు తెలిపారు

# వికారాబాద్ జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, IPS అధికారులతో సమగ్ర సమీక్ష సమావేశం




**వికారాబాద్ ప్రతినిధి జులై 15(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** వికారాబాద్ జిల్లా ఎస్పీ పోలీస్ కార్యాలయంలో జిల్లా పోలీసు అధికారులతో సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో యూ.ఐ. (UI), లాంగ్ పెండింగ్, అరెస్ట్ పెండింగ్, పోక్సో, ఎఫ్ఎస్ఎల్ (FSL) పెండింగ్ నివేదికలు, గ్రేవ్ యూ.ఐ. కేసులు, ఎన్ఫోర్స్‌మెంట్ చర్యలు, రోడ్డు ప్రమాదాలు, మిస్సింగ్ కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్, సీసీటీఎన్ఎస్ (CCTNS), ఈ-సాక్ష్య (e-Sakshya), సీసీటీవీ ఏర్పాటు, స్టేషన్ రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై సమీక్షించారు.




ఈ సందర్భంగా ప్రతి పోలీస్ స్టేషన్‌లోని పెండింగ్ కేసుల పురోగతిని పరిశీలించిన ఎస్పీ గారు, దర్యాప్తు అధికారులు ఆలస్యం లేకుండా నాణ్యమైన విచారణ పూర్తి చేయాలని ఆదేశించారు. ఫోరెన్సిక్ నివేదికలు, సీసీటీవీ ఫుటేజ్, డిజిటల్ సాక్ష్యాలు, సాంకేతిక విశ్లేషణ వంటి ఆధునిక దర్యాప్తు పద్ధతులను వినియోగించి బలమైన సాక్ష్యాధారాలతో కేసులను కోర్టులో ప్రవేశపెట్టాలని సూచించారు.

మహిళలు, చిన్నారులపై నేరాలు, పోక్సో, అత్యాచార, హత్య కేసులకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, అరెస్ట్ పెండింగ్ కేసుల్లో నిందితులను త్వరగా అరెస్ట్ చేసి, లాంగ్ పెండింగ్ కేసులను ప్రత్యేక కార్యాచరణతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు.

మూఢనమ్మకాల పేరుతో జరిగే బాణామతి, చేతబడి వంటి చట్టవిరుద్ధ చర్యలపై కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే బ్యాంకులు, ఏటీఎంలు, బంగారం దుకాణాలు, రద్దీ ప్రాంతాల్లో నిఘా పెంచి ఆస్తి సంబంధిత నేరాలను అరికట్టాలని సూచించారు. పొలాల చుట్టూ అక్రమంగా విద్యుత్ తీగలు ఏర్పాటు చేసి కరెంట్ ప్రవహింపజేయడం వల్ల మానవ ప్రాణాలు, వన్యప్రాణులకు ప్రమాదం ఏర్పడుతున్న నేపథ్యంలో అలాంటి ఘటనలపై ప్రత్యేక దృష్టి సారించి బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణా, గంజాయి, మాదకద్రవ్యాలు, అక్రమ ఇసుక రవాణా, గేమింగ్/జూదం, డ్రంక్ అండ్ డ్రైవ్, ఓవర్‌లోడ్ వాహనాలపై నిరంతర ఎన్ఫోర్స్‌మెంట్ కొనసాగించాలని ఆదేశించారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో జజుచీూ, వ-ఋఎంప్ఠ్రుఖ అప్‌డేట్లు, కేసుడాక్యుమెంటేషన్‌ను సకాలంలో పూర్తి చేసి, స్టేషన్‌లను ప్రజలకు అనుకూలంగా నిర్వహించాలని సూచించారు."వికారాబాద్ రక్షణ నేత్రం" ద్వారా జిల్లాలో సీసీటీవీ కెమెరాల ఏర్పాటును మరింత విస్తరించాలని, "వికారాబాద్ సురక్ష మిత్ర" కార్యక్రమం ద్వారా డ్రగ్స్ నిర్మూలన, సైబర్ నేరాల నివారణ, మహిళా-శిశు భద్రత, రోడ్డు భద్రతపై గ్రామాలు, పాఠశాలలు, కళాశాలల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

సమీక్షా సమావేశంలో భాగంగా చీటింగ్, హత్య, పోక్సో, అత్యాచార, రోడ్డు ప్రమాదాలు, ఎస్సీ/ఎస్టీ చట్టం కింద నమోదయ్యే కేసుల దర్యాప్తు, సాక్ష్యాల సేకరణ, కేసు డాక్యుమెంటేషన్, కోర్టు విచారణ విధానాలపై పోలీసు అధికారులకు పిపిటి ల ద్వారా ప్రత్యేక శిక్షణ కూడా నిర్వహించారు. ఈ సమావేశంలో డీఎస్పీలు శ్రీనివాస్ (డీటీసీ), జనయ్య (డీసీఆర్‌బీ), అంజయ్య (వికారాబాద్), ఎన్. యాదయ్య (తాండూరు), శ్రీనివాస్ (పరిగి), జిల్లాలోని సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌హెచ్‌ఓలు, టాస్క్ ఫోర్స్, స్పెషల్ బ్రాంచ్, డీసీఆర్‌బీ, వివిధ విభాగాల అధికారులు, దర్యాప్తు అధికారులు పాల్గొన్నారు.

## పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా భగ్నం

## -రూ.11.20 లక్షల విలువైన 350 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం



**జహీరాబాద్, జూలై 15 ప్రజాబలం ప్రతినిధి:** సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలో ప్రజాపంపిణీ వ్యవస్థ బియ్యం అక్రమ రవాణాను అధికారులు భగ్నం చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు డిప్యూటీ తహసీల్దార్ (సివిల్ సప్లైస్) గౌడిగామ బస్వరాజ్, కోహీర్ పోలీసులతో కలిసి బుధవారం జాతీయ రహదారి-65లోని కోహీర్ చౌరస్తా వద్ద తనిఖీలు చేపట్టారు.

తనిఖీల్లో +జీ 18 దీఔ 5818 నంబరు గల అశోక్ లేలాండ్ కంటైనర్‌లో 1,166 బస్తాల (సుమారు 350 క్వింటాళ్లు) పీడీఎస్ బియ్యం లభ్యమైంది. ఒక్కో బస్తా 30 కిలోల బరువు ఉండగా, మొత్తం బియ్యం విలువ సుమారు రూ.11.20 లక్షలుగా అధికారులు అంచనా వేశారు. బియ్యం రవాణాకు సంబంధించిన ఎలాంటి చెల్లుబాటు అయ్యే అనుమతి పత్రాలు, ఈ-వే బిల్లు లేదా ఇతర ధ్రువపత్రాలు లేకపోవడంతో బియ్యం, వాహనాన్ని స్వాధీనం చేసుకుని పంచనామా నిర్వహించారు. బియ్యం నమూనాలను ప్రయోగశాల పరీక్షలకు పంపించగా, నిల్వ కోసం జహీరాబాద్ ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించారు. వాహనాన్ని కోహీర్ పోలీసులకు అప్పగించారు. విచారణలో డ్రైవర్ రాయ్ చంద్, జగ్గుపర్తి ముక్కటేశ్వరరావు ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా యజ్ఞవతి రైస్ మిల్ నుంచి బియ్యాన్ని లోడ్ చేసి గుజరాత్‌కు తరలిస్తున్నట్లు తెలిపినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఘటనపై బియ్యం యజమాని, వాహన యజమాని, డ్రైవర్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

# సర్ కు మణికొండ, నెక్నంపూర్ లో అనూహ్య స్పందన






**గండిపేట ప్రజాబలం ప్రతినిధి 15 జులై 2026**భారత రాష్ట్ర సమితి పార్టీ తరపున చేపట్టిన ఓటర్ జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కు బి.ఆర్.ఎస్ పార్టీ మణికొండ, నెక్నంపూర్ నాయకులు గుట్టమీది నరేందర్, సంగం శ్రీకాంత్, జయరామ్, ముత్యాలు, రవి, ఆరిఫ్, బిందు, శివముదిరాజ్ తిరుపతి, మహేష్ యాదవ్, గోపి సాగర్, చింటూ ల సహకారంతో శివాజీ నగర్ స్థానిక ప్రజలు సంపూర్ణ మద్దతు తెలుపుతూ అనూహ్య స్పందనతో కమ్యూనిటి హాల్ వద్దకు చేరుకుని తమ తమ కుటుంబ సభ్యుల ఓటరు వివరాలను తెలుపుతో ధరకాస్తూ ఫాంరంలు పూరించడంలో సహకారం అందించిన అందే లక్ష్మణ్ రావు, సుమనలిని, అంతే కాకుండా 2002 లో స్వంత, వారి పరివార సభ్యుల ఓటు వివరాలు సేకరించి ఇవ్వడం మరియు స్థానికముగా ఉన్న వారి ఓటుకు సంబంధించిన బూతులెవల్ అధికారి వివరాలు తెలుపడంలో ప్రజలకు సంపూర్ణ వివరణ ఇవ్వడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు.

## మల్చల్మ గ్రామంలో వీవో భవనానికి మార్కింగ్



**జహీరాబాద్, జూలై 15 ప్రజా బలం ప్రతినిధి:** జహీరాబాద్ మండలంలోని మల్చల్మ గ్రామంలో గ్రామ సంఘం విలేజ్ ఆర్గనైజేషన్ భవన నిర్మాణం కోసం స్థలాన్ని గుర్తిస్తూ మార్కింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దశరథ్, ఎంపీడీవో మహేందర్ రెడ్డి పాల్గొని అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. భవన నిర్మాణానికి ఎంపిక చేసిన స్థలంలో గ్రామస్తుల సమక్షంలో మార్కింగ్ చేపట్టి, నిర్మాణ పనులు నాణ్యతతో పాటు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. గ్రామానికి అవసరమైన మౌలిక వసతుల కల్పనలో భాగంగా వీవో భవనం నిర్మాణం ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామ సంఘం సభ్యులు, గ్రామస్తులు మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వేములవాడలో కుల సంఘాల భవనాలకు త్వరలో శంకుస్థాపన

### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**వేములవాడ ప్రజాబలం ప్రతినిధి జూలై -15** వేములవాడ పట్టణంలో బీసీ భవన్, అంబేద్కర్ భవన్, క్రిస్టియన్ భవన్, ఎస్టీ భవన్ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభమవుతాయని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. ఒక్కో భవనానికి రూ.1.30 కోట్లు మంజూరై టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, స్థల కేటాయింపు పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

అనంతరం తిప్పాపూర్‌లో నిర్మాణంలో ఉన్న మూడో బ్రిడ్జి, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, సర్వీస్ రోడ్డు పనులను పరిశీలించిన ఆయన, పనులు తుది దశకు చేరుకున్నాయని, త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. దీంతో ట్రాఫిక్ సమస్య తగ్గి ప్రజల రాకపోకలు, రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని తెలిపారు.



# అర్హులైన ప్రతి ఓటరు ఓటరు జాబితాలో ఉండాలి

### ఎన్యూమరేషన్ ఫారాలను గడువులోగా సమర్పించండి: జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతీక్ జైన్

**జహీరాబాద్, జూలై15 ప్రజాబలం ప్రతినిధి:** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో భాగంగా అర్హులైన ప్రతి ఓటరు తమ ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తిగా పూరించి, ఆలస్యం చేయకుండా సంబంధిత బూత్ లెవల్ ఆఫీసర్, బీఎల్వో సూపర్‌వైజర్, సమీప హెల్ప్‌డెస్క్‌లో సమర్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కోరారు.భారత ఎన్నికల సంఘం, తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రతి శాసనసభ నియోజకవర్గంలో ఓటర్లకు సౌకర్యవంతంగా సేవలు అందించేందుకు ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజల సౌలభ్యం కోసం హెల్ప్‌డెస్క్‌లలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పేర్లు, హోదాలు, సంప్రదింపు నంబర్లను కూడా విడుదల చేసినట్లు వెల్లడించారు.

ఓటర్లందరూ తమకు అందిన ఎన్యూమరేషన్ ఫారాలను అన్ని వివరాలతో సక్రమంగా పూరించి, నిర్ణీత గడువులోగా సంబంధిత బీఎల్వో, బీఎల్వో సూపర్‌వైజర్ , సమీప హెల్ప్‌డెస్క్‌లో అందజేసి ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమానికి సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

జహీరాబాద్ నియోజకవర్గ హెల్ప్‌డెస్క్‌లు:

ఆర్డీఓ కార్యాలయం, జహీరాబాద్ -- అనిత -- 7995034779

తహసీల్దార్ కార్యాలయం, జహీరాబాద్ -- విజయమ్మ -- 9959229159

మున్సిపల్ కార్యాలయం, జహీరాబాద్ -- మైతాబ్ -- 9010209162

తహసీల్దార్ కార్యాలయం, న్యాల్‌కల్ -- రాజేందర్ -- 6303529975

తహసీల్దార్ కార్యాలయం, కోహీర్ -- మాన్‌సింగ్ -- 8074834183

తహసీల్దార్ కార్యాలయం, ఝరాసంగం -- ఐజాజ్ -- 9959898706

తహసీల్దార్ కార్యాలయం, మొగుడంపల్లి -- విజయలక్ష్మి -- 9848169844

హెల్ప్‌డెస్క్‌ల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకుని, అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా సహకరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పిలుపునిచ్చారు.

## డ్రగ్స్ నిర్మూలనకు సమన్వయ కార్యాచరణ

### యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా అన్ని శాఖలు కలిసి పనిచేయాలి: అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం, జూలై 15:**మాదక ద్రవ్యాల వ్యసనం సమాజానికి, ముఖ్యంగా యువత భవిష్యత్తుకు తీవ్ర ముప్పుగా మారిందని, వాటి నిర్మూలనకు అన్ని శాఖలు సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

బుధవారం జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన జిల్లా మాదక ద్రవ్య నిర్మూలన కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో డ్రగ్స్ నిర్మూలన కోసం కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని సూచించారు.

సంక్షేమ శాఖ అధికారులు ప్రతి నెల బాలుర హాస్టళ్లలో డ్రగ్స్ దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించాలని చెప్పారు. వైద్యశాఖ అధికారులు మాదకద్రవ్యాల దుర్వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక సమస్యలపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని సూచించారు.

పోలీసు శాఖ అధికారులు జిల్లాలో నిరంతర తనిఖీలు నిర్వహిస్తూ, సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి డ్రగ్స్ సరఫరా, వినియోగాన్ని అరికట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలల పరిసరాల్లో ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగించాలని పేర్కొన్నారు.

ప్రతి శాఖ తమ కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసి, చేపట్టిన కార్యక్రమాల వివరాలను క్రమం తప్పకుండా జిల్లా యంత్రాంగానికి నివేదించాలని అదనపు కలెక్టర్ సూచించారు. సమష్టి కృషితో మాదక ద్రవ్యాల నిర్మూలనలో జిల్లాను ఆదర్శంగా నిలపాలని పిలుపునిచ్చారు.

సమావేశంలో జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖాధికారి వినోద్ కుమార్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి పద్మజా, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ మౌనిక, కుత్బుల్లాపూర్ అదనపు డీసీపీ పురుషోత్తం, కూకట్‌పల్లి అదనపు డీసీపీ సుదర్శన్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఓటర్ల సందేహాలపై హెల్ప్ డెస్క్ లు




**పెద్దపల్లి/గోదావరిఖని, జూలై-15, ప్రజాబలం ప్రతినిధి :** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా పునః పరిశీలన ప్రక్రియలో భాగంగా ఓటర్ల సహాయార్థం రామగుండం నగర పాలక సంస్థ పరిధిలో డివిజన్ ల వారీగా హెల్ప్ డెస్క్ లు ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిషనర్ జె. అరుణ శ్రీ బుధవారం తెలిపారు . ఈ మేరకు డివిజన్ వారీ హెల్ప్ డెస్క్ కేంద్రాల జాబితా విడుదల చేశారు. ఓటర్ల సందేహాలను నివృత్తి చేసి ఫారం భర్తీ చేయడంలో సహకరించడం లక్ష్యంగా ఈ హెల్ప్ డెస్క్ కేంద్రాలు పని చేస్తాయని ఆమె అన్నారు. ఇంకా ఫారాలు తిరిగి ఇవ్వని ఓటర్లు వెంటనే తమ డివిజన్ లోని హెల్ప్ డెస్క్ కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు. అలాగే రామగుండం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబందించి సర్ ప్రక్రియ లో పాలు పంచుకుంటున్న బూత్ లెవెల్ అధికారులపై పర్యవేక్షకులుగా తహశీల్దార్ కార్యాలయం, ఐ సి డి ఎస్ కార్యాలయం, మెప్మా విభాగం ఉద్యోగులను రామగుండం అసెంబ్లీ నియోజకవర్గం ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి గా వ్యవహరిస్తున్న అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) జె. అరుణశ్రీ నియమించారు. పర్యవేక్షకుల జాబితా విడుదల చేశారు .

## నాగర్ కర్నూల్ జిల్లా నార్లాపూర్ పంప్ హౌస్లో ట్రయల్ రన్ ప్రారంభం

నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి: నార్లాపూర్ రిజర్వాయర్ వద్ద మొదటి యూనిట్ పంపన్ను విజయవంతంగా నడిపిన ఎత్తిపోతలకు లైన్ క్లియర్ ఇంజినీర్లు కృష్ణా జలాల వారానికి ఒకటి చొప్పున మిగిలిన మూడు పంపులకు వెట్రన్ నిర్వహించాలని అధికారులకు ప్రతిపాదన ఉమ్మడి మహబూబనగర్ జిల్లా ప్రజల దశాబ్దాల కల పాలమూరు రంగారెడ్డి ఎత్తి పోతల పథకంలో మరో కీలక ఘట్టం ఆవిష్కృతమయ్యింది. నాగర్కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని నార్లాపూర్ రిజ ర్వాయర్ వద్ద ఈ ప్రాజెక్టులో కీలకమైన ఒకటో నెంబర్ మోటా ర్ యూనిట్1 వెట్ రన్ మంగళవారం విజయవంతంగా పూర్త యింది. దీంతో నార్లాపూర్ రిజర్వాయర్ కృష్ణా జలాల ఎత్తిపో తలకు లైన్ క్లియర్ అయింది. ఇటీవల ఫస్ట్ పంప్ వెట్ రన్ ని ర్వహించే క్రమంలో కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దీంతో అప్రమత్తమైన నీటిపారుదల శాఖ అధికారులు, ఇంజనీ రింగ్ నిపుణులు, ఏజెన్సీ ప్రతినిధులతో కూడిన ప్రత్యేక టెక్నిక ల్ టీమ్ రంగంలోకి దిగింది.

# మై భారత్ నమోదు కార్యక్రమానికి శ్రీకారం

## 15--29 ఏళ్ల యువత పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి -- అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం, జూలై 15:**దేశ నిర్మాణంలో యువత భాగస్వామ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలో 'మై భారత్ (వీ దీక్షితీష్)' పోర్టల్ నమోదు కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్, ఐఏఎస్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించిన ఆయన, ల15 నుంచి 29 సంవత్సరాల మధ్య వయస్సు గల యువత తప్పనిసరిగా పోర్టల్‌లో నమోదు చేసుకోవాలనిలి పిలుపునిచ్చారు.




'మై భారత్' వేదిక ద్వారా యువతకు స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు, అనుభవపూర్వక అభ్యాసం, నైపుణ్యాభివృద్ధి, సామాజిక సేవతో పాటు కేంద్ర ప్రభుత్వం చేపట్టే వివిధ యువజన సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం లభిస్తుందని తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా చేపట్టిన నమోదు కార్యక్రమంలో విద్యాసంస్థలు, ప్రభుత్వ శాఖలు, యువజన సంఘాలు, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లు, ఇతర భాగస్వామ్య సంస్థలు సమన్వయంతో పనిచేసి అర్హులైన యువత ఎక్కువ సంఖ్యలో నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

కళాశాలలు, విద్యాసంస్థలు, గ్రామాలు, పట్టణ స్థానిక సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో అవగాహన కార్యక్రమాలతో పాటు అక్కడికక్కడే నమోదు శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని 'మై భారత్' విభాగం జిల్లా యంత్రాంగం సహకారంతో నిర్వహిస్తోందన్నారు.

ప్రారంభ కార్యక్రమంలో 'మై భారత్' జిల్లా డిప్యూటీ డైరెక్టర్ స్నేహల్ జ్ఞానేశ్వర్ బసుత్కర్, కార్యాలయ సహాయకుడు డి. శ్రీశైలం పాల్గొని నమోదు ప్రక్రియ, యువతకు లభించే అవకాశాలపై వివరించారు. 'వికసిత్ భారత్' లక్ష్య సాధనలో యువత చురుకుగా భాగస్వాములు కావాలని అధికారులు కోరారు.

# ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌లో రాజకీయ పార్టీల ఏజెంట్లు క్రియాశీలక పాత్ర పోషించాలి

## డిజిటలైజేషన్ పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాలి:ఎన్నికల నమోదు అధికారి, ఆర్డీవో కృష్ణవేణి

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జూలై 15** ములుగు బుధవారం ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ--2026 కార్యక్రమంలో భాగంగా గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా ఎన్నికల నమోదు అధికారి, ఆర్డీవో కృష్ణవేణి సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎన్నికల నమోదు అధికారి మాట్లాడుతూ జిల్లాలో ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తి చేసేందుకు కేవలం వారం రోజుల గడువు మాత్రమే మిగిలి ఉన్నందున ప్రజలను చైతన్యపరుస్తూ, వార్డు వారీగా బీఎల్‌ఏలు, బీఎల్‌వోలు పరస్పర






సమన్వయంతో పనిచేసి ఎన్యుమరేషన్ ఫారాల సేకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.

ములుగు మున్సిపాలిటీ, గోవిందరావుపేట మండలం పసర గ్రామం, ఏటూరునాగారం మండలం ఏటూరునాగారం గ్రామం, మంగపేట మండలం కమలాపూర్ గ్రామ పరిధిలోని పోలింగ్ స్టేషన్లలో ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఆయా ప్రాంతాల్లోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు మరింత చొరవ చూపి ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.

ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను సేకరించడం, వాటిని సంబంధిత బీఎల్‌వోలకు అందజేయడం ద్వారా నిర్ణీత గడువులోపు డిజిటలైజేషన్ పూర్తి చేసేలా సహకరించాలని కోరారు.

ఈ సమావేశంలో ఏఈఆర్‌వో, తహసీల్దార్ విజయభాస్కర్, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ములుగు మునిసిపాలిటీ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్డీవో కృష్ణవేణి



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జూలై 15**ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ--2026 కార్యక్రమంలో భాగంగా ములుగు మున్సిపాలిటీ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను, బండారుపల్లి పోలింగ్ కేంద్రాలను ఎన్నికల నమోదు అధికారి ఆర్డీవో కృష్ణవేణి బుధవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయభాస్కర్, డిప్యూటీ తహసిల్దార్ సతీష్ , ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్ సతీష్, మెప్మా ఏడీఎంసీ వహీదా తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మొగ్గు చూపేలా అవగాహన కల్పించాలి.

## అదనపు కలెక్టర్ సి.హెచ్ మహేందర్ జి.



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జూలై 15 ములుగు** బుదవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నీటి పారుదల శాఖ, వ్యవసాయ, ఉద్యాన, భూగర్భ జల వనరుల శాఖల అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఎల్ నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల గురించి రైతులకు వ్యవసాయ విస్తీర్ణ అధికారులు వివరించి చెప్పాలన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో ఎంత వరి పంట సాగు చేశారు?. ఇతర పంటల సాగు ఎంత చేశారని ఒక నివేదిక తయారు చేసుకోవాలన్నారు. జిల్లాలో ఉన్న సాగునీటి వనరుల ద్వారా గతేడాది ఎన్ని ఎకరాల్లో వరి సాగు చేశారు?. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఆయా సాగునీటి వనరుల చివరి డిస్ట్రిబ్యూటర్ వరకు నీళ్లు అందుతాయా?. లేదా అని అంచనా వేసుకొని రైతులకు క్లుప్తంగా తెలియజేయాలని ఆయన సూచించారు. ఇప్పటికే భూ గర్భ జల వనరుల శాఖ ఇచ్చిన నివేదికలు ఆశించిన స్థాయిలో లేవని, పంటల మార్పిడి అవశ్యకత ఎంతైనా అవసరం అనే విషయం జిల్లా రైతాంగానికి అర్థం అయ్యేలా అధికారులు తెలియ చెప్పాలన్నారు. ఆయిల్ ఫామ్ అంటే కేవలం ఉద్యాన శాఖ కు సంబంధించినదే అని ఏ ఈ వో లు నిర్లక్ష్యం చేయకుండా ఉద్యాన శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగు లక్ష్యాన్ని చేరుకోవాలని ఆయన స్పష్టం చేశారు. గతంతో పోలిస్తే జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగు విస్తీర్ణం పెరిగిందని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆయిల్ ఫామ్ సాగు లాభదాయకం అని రైతులు తెలుసుకునే విధంగా అధికారులు ఆయిల్ ఫామ్ సాగు చేసిన రైతులతో ఇతర రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఇక నుంచి ప్రతీ వారం వ్యవసాయ శాఖ అధికారుల డ్యూటీ చార్ట్ నివేదిక ను తనకు పంపించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.

సమావేశంలో మండలాల వారీగా వర్షపాతం, గతేడాది ఇదే సమయంలో సాగు చేసిన పంటల విస్తీర్ణం, ప్రస్తుతం సాగు విస్తీర్ణం ఎంత ? వచ్చే వారం పది రోజుల తర్వాత వాతావరణ పరిస్థితులు గురించి అదనపు కలెక్టర్ అధికారులతో చర్చించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, విద్యుత్ శాఖ ఎస్ ఈ బిక్షపతి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేష్ కుమార్, నీటి పారుదల శాఖ అప్పల నాయుడు, ఉద్యాన శాఖ అధికారి సంజీవరావు, కలెక్టరేట్ ఏ ఓ రాజ్ కుమార్, ఎస్ ఓ లాల్ నాయక్, ఇంజనీరింగ్ అధికారులు, అన్ని మండలాల ఏ వోలు, ఏ ఈ వో లు, ఉద్యాన శాఖ మండల అధికారులు పాల్గొన్నారు.

# శంకర ఐ హాస్పిటల్ హైదరాబాద్ లో 73 మందికి విజయవంతమైన కంటి శస్త్రచికిత్సలు



**ఏటూరునాగారం ప్రజాబలం ప్రతినిధి జూలై 15:** ఏటూరు నాగారం మండల కేంద్రంలోని శ్రీ సాయిబాబా దేవాలయంలో దేవాలయ కమిటీ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్ కుమారుడు పెండ్యాల పవన్ కుమార్ జన్మదిన సందర్భంగా ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి పరీక్షల శిబిరానికి విశేష స్పందన లభించింది.

ఈ శిబిరంలో ఎంపికైన 80 మందిని ప్రత్యేక బస్సులో హైదరాబాద్‌లోని శంకర ఐ హాస్పిటల్‌కు తరలించగా, సోమవారం 26 మందికి, మంగళవారం 47 మందికి కలిపి మొత్తం 73 మందికి విజయవంతంగా కంటి శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు దేవాలయ కమిటీ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. పెండ్యాల ప్రభాకర్ సూచన మేరకు సినీ నటుడు, సంజోష్ ఫౌండేషన్ చైర్మన్ హీరో సంజోష్ శంకర ఐ హాస్పిటల్‌ను సందర్శించి శస్త్రచికిత్స చేయించుకున్న రోగులను పరామర్శించారు.

ఈ సందర్భంగా వారికి పండ్లు పంపిణీ చేయడంతో పాటు, అవసరమైన కంటి అద్దాలను కూడా ఉచితంగా అందజేస్తానని హామీ ఇచ్చారు.

ఈ సేవా కార్యక్రమానికి సహకరించిన శంకర ఐ హాస్పిటల్ వైద్య బృందానికి, సంజోష్ ఫౌండేషన్‌కు, రాహుల్ ఐ ఫౌండేషన్ సిబ్బందికి అలాగే సేవాభావంతో కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ పెండ్యాల ప్రభాకర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# 37వ డివిజన్ సర్ ఓటరు మ్యాపింగ్ లో అశేష సేవలందిస్తున్న బిఎల్‌ఏ, బిఎల్‌ఓ లు




**పెద్దపల్లి/గోదావరిఖని, జులై-15, ప్రజాబలం ప్రతినిధి :** రామగుండం మున్సిపల్ పరిధి 37వ డివిజన్ లో భారత ఎన్నికల కమిషన్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ (సర్ ప్రత్యేక మ్యాపింగ్) కార్యక్రమాన్ని విజయవంతంగా చేపట్టడం కోసం డివిజన్ లో బిఎల్‌ఏ, బిఎల్‌ఓ లు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. డివిజన్ లో ఇంటింటికి వెళ్లి ఓటర్ జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా బిఎల్‌ఏ అవునూరి రమాదేవి , బిఎల్‌ఓ పైడిపల్లి వెంకట్ లు మాట్లాడారు. 37వ డివిజన్ లో సర్ ప్రక్రియ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో ఇంటింటికి వెళ్లి వారి పూర్తి వివరాలను నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. అయితే 2002 ఓటుకు సంబంధించిన నమోదు విషయంలో పూర్తి వివరాలు అందలేని పరిస్థితిలో కొంత ఇబ్బందికరంగా మారిందని, సాధ్యమైనంతవరకు ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ (సర్ ప్రత్యేక మ్యాపింగ్) ప్రక్రియను కొనసాగిస్తున్నట్లు తెలియజేశారు. డివిజన్ లో ప్రజలు సహకరించాలని కోరారు.

# పేద విద్యార్థుల భవిష్యత్తే ప్రజా ప్రభుత్వ లక్ష్యం..

# గురుకుల సీట్ల కేటాయింపులో నిర్లక్ష్యానికి తావు లేదు

**దూర ప్రాంతాల నుంచి వచ్చే తల్లిదండ్రులతో మర్యాదగా వ్యవహరించి, సరైన మార్గదర్శనం చేయాలి**

**డీఎస్సీ భవన్‌లో TGSWREIS కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**





హైదరాబాద్, జూలై 15:పేద, దళిత, గిరిజన విద్యార్థుల విద్యాభవిష్యత్తును తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ఒక్క విద్యార్థి కూడా గురుకుల విద్యకు దూరం కాకుండా అధికారులు పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాల విద్యార్థుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ భారీగా నిధులు వెచ్చిస్తున్న నేపథ్యంలో, ఆ లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు మరింత మానవీయ దృక్పథంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు.

బుధవారం హైదరాబాద్‌లోని డీఎస్సీ భవన్‌లో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (TGSWREIS) కార్యాలయాన్ని మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి తమ పిల్లలకు గురుకులాల్లో ప్రవేశాలు కల్పించాలని వచ్చిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల నుంచి మంత్రి స్వయంగా వినతిపత్రాలు స్వీకరించారు. ఒక్కొక్కరి సమస్యను ఓపికగా వింటూ వారి కుటుంబ పరిస్థితులు, ఆర్థిక ఇబ్బందులు, పిల్లల చదువుపై ఉన్న ఆశయాలను అడిగి తెలుసుకున్నారు.

దూర ప్రాంతాలు, మారుమూల గ్రామాల నుంచి వచ్చిన పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలకు సమీప జిల్లాల్లో సీట్లు కేటాయించాలని, ఇతర జిల్లాల్లో చదివించడం వల్ల రవాణా, ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని మంత్రికి వివరించారు. వారి సమస్యలను విన్న మంత్రి స్పందిస్తూ, పేద కుటుంబాలకు చెందిన అర్హులైన విద్యార్థులకు సాధ్యమైనంత మేరకు వారికి అనుకూలమైన జిల్లాల్లో సీట్లు కేటాయించేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జాయింట్ సెక్రటరీ (అడ్మినిస్ట్రేషన్) శ్రీ సక్రు నాయక్కు మంత్రి పలు కీలక సూచనలు చేశారు. సీట్ల కేటాయింపు ప్రక్రియలో పారదర్శకత, మానవీయ దృక్పథం, విద్యార్థుల సంక్షేమం ప్రధాన ప్రమాణాలుగా ఉండాలని, ప్రతి అర్జీని నిబంధనల పరిధిలో క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన ప్రతి విద్యార్థికి న్యాయం చేయాలని ఆదేశించారు.

అలాగే మారుమూల గ్రామాలు, దూర ప్రాంతాల నుంచి కార్యాలయానికి వచ్చే తల్లిదండ్రులు, సంరక్షకులు, బంధువులతో అధికారులు, సిబ్బంది అత్యంత మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని మంత్రి సూచించారు. వారికి స్పష్టమైన సమాచారం అందిస్తూ, అవసరమైన మార్గదర్శకత్వం ఇవ్వాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బందులకు గురి చేయరాదని ఆదేశించారు.

ఈ సందర్భంగా మంత్రి అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి దళిత, గిరిజన విద్యార్థుల విద్యా అభివృద్ధికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ భారీ స్థాయిలో నిధులు కేటాయించి గురుకుల విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్న సమయంలో, క్షేత్రస్థాయిలో అధికారుల నిర్లక్ష్యం లేదా అలసత్వానికి ఎలాంటి అవకాశం ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ లక్ష్యాలను ప్రతి అధికారి తన బాధ్యతగా భావించి పనిచేయాలని, ప్రజల పట్ల సానుభూతితో వ్యవహరించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.

మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం గురుకుల విద్యా వ్యవస్థను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గురుకుల విద్యార్థులకు నాణ్యమైన విద్య, పోషకాహారం, ఆధునిక మౌలిక వసతులు, పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ, మెరుగైన వసతి సౌకర్యాలు కల్పిస్తూ వారి భవిష్యత్తును తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఆ లక్ష్యాల సాధనలో అధికారులు మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.

గురుకులాల్లో ప్రవేశాల కోసం వచ్చిన తల్లిదండ్రులు తమ సమస్యలను స్వయంగా విని వెంటనే స్పందించిన మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరించేందుకు మంత్రి చూపుతున్న చొరవను వారు అభినందించారు. చివరగా మంత్రి. అడ్లూరి మాట్లాడుతూ..., "పేద విద్యార్థి చదువు ఆగకుండా చూడటం ప్రభుత్వ బాధ్యత. దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాల ప్రతి విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించేలా అవసరమైన ప్రతి సహాయాన్ని ప్రజా ప్రభుత్వం అందిస్తుంది. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ఆకాంక్షలకు అనుగుణంగా అధికారులు కూడా అదే నిబద్ధతతో పనిచేయాలి" అని స్పష్టం చేశారు.

## గుడిసెవాసుల సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

### ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను నిర్దేశిత గడువుల్లో పూర్తి చేయాలి

**పెద్దపల్లి, జూలై-15, ప్రజాబలం ప్రతినిధి :** జిల్లాలో గుడిసెల్లో నివసిస్తున్న పేద కుటుంబాల సర్వేను వేగవంతంగా పూర్తి చేసి, అర్హులైన ప్రతి కుటుంబాన్ని గుర్తించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతి, గుడిసెవాసుల సర్వేపై జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ జిల్లాలో గుడిసెల్లో నివసిస్తున్న పేద కుటుంబాలకు సంబంధించిన సర్వే ప్రక్రియను గెజిటెడ్ అధికారుల ద్వారా వేగవంతంగా పూర్తి చేయాలని, రేపటిలోపు గుడిసెవాసుల పూర్తి వివరాలను సమర్పించాలని ఆదేశించారు. ముఖ్యంగా టార్పాలిన్ కవర్ల కింద నివసిస్తున్న అత్యంత నిరుపేద కుటుంబాలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని, అర్హులైన ఒక్క కుటుంబం కూడా సర్వేలో మిగలకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని సమీక్షిస్తూ తొలి విడతలో బేస్‌మెంట్ దశలో ఉన్న ఇళ్ల నిర్మాణాలను సెప్టెంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. గోడల నిర్మాణం పూర్తయిన ఇళ్లను ఆగస్టు 15వ తేదీలోగా, పైకప్పు (స్లాబ్) పూర్తయిన ఇళ్లను ఈ నెలాఖరులోగా పూర్తిస్థాయిలో నిర్మించి లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఎల్-1 జాబితాలో ఉన్న అర్హులైన లబ్ధిదారులకు వెంటనే పరిపాలన అనుమతి ఉత్తర్వులు జారీ చేయాలని సూచించారు. మిగిలిన జాబితాలకు సంబంధించిన సర్వేను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు, ఎల్-3 జాబితాలోని ఆర్‌సీసీ డాబా గల ఇళ్ల వివరాలను సర్వే చేసి ఆన్‌లైన్ వ్యవస్థలో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు సంచాలకులు రాజేశ్వర్, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు,సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

### మేర యువ భారత్ లో యువ వాలంటీర్ నియామకాలకు దరఖాస్తు ఆహ్వానం

భారత ప్రభుత్వ యువజన వ్యవహారాల మరియు క్రీడాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో (మై భారత్), మేరా యువ భారత్ నిజామాబాద్ జిల్లాలో వివిధ ప్రభుత్వ కార్యక్రమాల అమలు కోసం మరియు గ్రామీణ ప్రాంతాల్లో యువజన సంఘాల నిర్మాణం కోసం యువ వాలంటీర్ల నియామకానికి దరఖాస్తు ఆహ్వానించడం అయినది. ఉమ్మడి నిజామాబాద్ కామారెడ్డి జిల్లాల మేరా యువ భారత్ అధికారి బి. రమేష్ తెలిపిన వివరాల ప్రకారం దేశ నిర్మాణంలో యువత భాగస్వామ్యాన్ని పెంచడం, నైపుణ్యాలను మెరుగుపరచడం మరియు ప్రభుత్వ పథకాలను గడపగడపకు తీసుకువెళ్లడం ప్రతి గ్రామంలో యువజన సంఘాల ఏర్పాటులో కీలక పాత్ర పోషించడం, యువతకు సామాజిక సేవ వైపు తీసుకు వెళ్లడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. అర్హత వయసు 18 నుంచి 29 సంవత్సరాల మధ్య ఉండాలి. విద్య అర్హత కనీసం పదో తరగతి ఉత్తీర్ణత నిజామాబాద్ జిల్లాకు చెందిన వారై ఉండాలి సామాజిక సేవ పట్ల ఆసక్తి ఉండాలి. దరఖాస్తు విధానం ఆసక్తిగల అభ్యర్థులు మై భారత్ అధికారిక పోర్టల్ ప్తబిబిజూబ://ఎఎఎప్త్రజీతీజీబి.ఇనీల.తిని/జూజీణవబ/నిఎబిఞనీతీజూబబిణతీబి కు వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకొని ఆన్లైన్ దరఖాస్తును సమర్పించాలని ఇందులో ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. చివరి తేదీ ఈ నెల 20 -07-2026 ఎంపికైన అభ్యర్థులకు గౌరవ వేతనం 5000 రూపాయలు , రెండు సంవత్సరాల కాలం పాటు, ప్రతి మండలానికి ఇద్దరు యువ వాలెంటర్ లు అవసరం ఎంపిక విధానం ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేయడం జరుగుతుంది. శిక్షణ మరియు సర్టిఫికెట్ అందజేయబడుతుంది.

## టీయూడబ్ల్యూజే హెచ్--143 సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభం



**వేములవాడ ప్రజాబలం ప్రతినిధి జూలై 15:** తెలంగాణ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్ (టీయూడబ్ల్యూజే హెచ్--143) ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం బుధవారం వేములవాడ ప్రెస్ క్లబ్ లో రాష్ట్ర ఉపాధ్యక్షుడు జిల్లా అధ్యక్షుడు లాయక్ పాషా ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కొలిపాక నర్సయ్య ప్రధాన కార్యదర్శి సయ్యద్ అలీ తో కలిసి సభ్యత్వ నమోదు పత్రాలను జర్నలిస్టులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం, వృత్తి హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం కోసం సంఘాన్ని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. జర్నలిస్టులందరూ సంఘంలో సభ్యత్వం పొందుతూ ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు. సభ్యత్వ నమోదు ద్వారా జర్నలిస్టులకు సంఘం అందించే సంక్షేమ పథకాలు, న్యాయపరమైన సహాయం, వృత్తిపరమైన రక్షణ మరింత సమర్థవంతంగా అందించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. టీయూడబ్ల్యూజే హెచ్--143 జర్నలిస్టుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న సంఘమని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు చింతల్ ఠాణం దేవరాజు, కొశాదికారి పంపరి నాగరాజు, ఫహద్,చౌటుపల్లి వెంకటేష్,దెబ్బేటి ప్రవీణ్, శ్రీరామోజు వేణు,జబ్బార్, షబ్బీర్,గంగాధర్, సంటి రాజేందర్, పండుగ స్వామి ఆసిమ్, నవీన్, రాములు పాల్గొన్నారు.

## ఆషాఢ మాసం వనభోజనాల్లో దానిమ్మ తోట కాలనీవాసులు



**వేములవాడ ప్రజాబలం ప్రతినిధి జూలై – 15**ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని దానిమ్మ తోట కాలనీవాసులు బుధవారం రోజున నిర్వహించిన వనభోజన కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రకృతి ఒడిలో కుటుంబ సభ్యులతో కలిసి ఆహ్లాదకర వాతావరణంలో వనభోజనాలు నిర్వహిస్తూ ఆనందంగా గడిపారు.

ఈ సందర్భంగా మహిళలు సంప్రదాయ ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనగా, చిన్నారుల కోసం వివిధ వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అనంతరం అందరూ కలిసి రుచికరమైన వంటకాలను ఆస్వాదించారు.

కాలనీవాసులు పరస్పర ఆప్యాయత, ఐకమత్యాన్ని పెంపొందించుకునేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కాలనీవాసులు పాల్గొని విజయవంతం చేశారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com